thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 121 కరీంనగర్ గురువారం, 10 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఢిల్లీ పెత్తనాన్ని ఎప్పటికీ అనుమతించం..

చెన్నై: ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమారమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రూ.880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ.100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రంథాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారన్నారు.




# పదేళ్లలో ఆ ప్రాజెక్టులు పూర్తి చేసుంటే

# కృష్ణా జలాల్లో న్యాయం జరిగేది!

## నీటిపారుదల ప్రాజెక్టుల అంశంపై ప్రజాప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: గత పదేళ్లలో కొన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం జరిగేది కాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల అంశంపై ప్రజాప్రతినిధులకు ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెటేషన్ ఇచ్చారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. "1976లో బచావత్ ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు చేసింది. మూడు రాష్ట్రాలకు 2130 టీఎంసీలు కేటాయించింది.

ఉమ్మడి ఏపీ 811, కర్ణాటక 734, మహారాష్ట్రకు 585 టీఎంసీలు కేటాయించింది. బచావత్ ట్రైబ్యునల్ తర్వాత కేంద్రం ఆమోదం లేకుండా ఉమ్మడి ఏపీలో ప్రాజెక్టులు చేపట్టారు. ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, బీమా ప్రాజెక్టులు చేపట్టారు. ఉమ్మడి ఏపీలో 261 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపట్టినా పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టులు గత పదేళ్లలో పూర్తి చేసి ఉంటే కృష్ణా జలాల్లో న్యాయం జరిగేది.

**ఏపీ సామర్థ్యాన్ని పెంచుకుంది...** ఆల్మట్టి ప్రాజెక్టుపై ఉమ్మడి ఏపీ హయాంలో సుప్రీంకోర్టులో కేసు వచ్చింది. తెలంగాణకు 575 టీఎంసీలు ఇవ్వాలని బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు వాదనలు వినిపించాం. ఏపీకి 236 టీఎంసీలు ఇవ్వాలని ట్రైబ్యునల్ ముందు తెలంగాణ వాదించింది. గత ప్రభుత్వం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని చెప్పింది. 2016లో అపెక్స్ కౌన్సిల్‌కు 66:34 శాతంపై లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

2025 మార్చిలో తెలంగాణకు 71శాతం కృష్ణా జలాలు ఇవ్వాలని లేఖ రాశాం. తెలంగాణ వచ్చిన తర్వాత కృష్ణా జలాల్లో ఎక్కువ అన్యాయం జరిగింది. మల్యాల సామర్థ్యాన్ని 3850 నుంచి 6300 క్యూసెక్కులకు పెంచారు. 2017లో రాయలసీమకు రోజూ 1.09 టీఎంసీలు తీసుకొనే సామర్థ్యాన్ని ఏపీ పెంచుకుంది.

**అపెక్స్ కౌన్సిల్ భేటీ కుట్రపూరితంగా వాయిదా..** 2020లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44వేల నుంచి 92వేల క్యూసెక్కులకు ఏపీ పెంచుకుంది. జగన్ హయాంలో గోదావరి, కృష్ణా జలాలపై ప్రగతి భవన్‌లో చర్చించారు. శ్రీశైలం నుంచి ఏపీకి అక్రమంగా కృష్ణా జలాల తరలింపునకు పునాదులు పడ్డాయి. రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే శ్రీశైలం, సాగర్ అవసరాలపై వినాశన ప్రభావం ఉంటుంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పూర్తిగా ఎడారిగా మారే ప్రమాదం ఉంది. 2020లో ఏపీకి మేలు చేసేలా కుట్ర పూరిత చర్యలు చేపట్టారు. అపెక్స్ కౌన్సిల్ భేటీని గత ప్రభుత్వం కుట్రపూరితంగా వాయిదా వేసింది. రాయలసీమ లిఫ్ట్ టెండర్లు పూర్తయ్యాక అపెక్స్ కౌన్సిల్ భేటీకి హాజరయ్యారు. అపెక్స్ కౌన్సిల్ భేటీ వాయిదా వేయక ముందే హాజరైతే బాగుండేది.

రాయలసీమ టెండర్లపై కేంద్రం స్టే విధించేలా చర్యలు ఉండేవేమో. రాయలసీమ లిఫ్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తికి గత ప్రభుత్వం సహకరించింది. 2019కి ముందే పాలమూరు పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి న్యాయం జరిగేది" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

# మైనింగ్ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర కలెక్టర్లదే



ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న చర్యల ద్వారా మైనింగ్ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మైనింగ్ ద్వారా వచ్చే ప్రతి పైసకు అకౌంటబిలిటీ ఉంటుందని ఉద్ఘాటించారు. గతంలో ఇల్లీగల్ మైనింగ్ జరిగేదని విమర్శించారు. ఇవాళ(బుధవారం) ఢిల్లీలో డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా గనులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఆయా రాష్ట్రాల గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మైనింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోందని చెప్పుకొచ్చారు. మైనింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. డిస్టిక్ మినరల్ ఫౌండేషన్‌కు వచ్చే ఫండ్ మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని వివరించారు. డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తారని తెలిపారు కిషన్‌రెడ్డి. మూడు రోజుల క్రితం వరకు తెలంగాణలో కూడా మంత్రులే డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు చైర్మన్లుగా ఉండేవారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం డిస్టిక్ మైనింగ్ ఫౌండేషన్‌కు కలెక్టర్లను చైర్మన్లుగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. డీఎంఎఫ్‌లో ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాములుగా ఉంటారని స్పష్టం చేశారు. మైనింగ్ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర కలెక్టర్లదేనని ఉద్ఘాటించారు. డిస్టిక్ మినరల్ ఫౌండేషన్ స్థాపించి పదేళ్లు అయ్యిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




## ఆ ఉద్యోగాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియామకం చేసిన కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై సమీక్షించాలని ఈ మేరకు రేవంత్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, పీఎస్‌యూలు ,స్థానిక సంస్థలు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పోస్టుల నియామకాలపై సమీక్షకు ఓ కమిటీని ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఈ కమిటీలో రిటైర్డ్ సీఎస్ ఏ.శాంతి కుమారి, రిటైర్డ్ ఐఏఎస్ ఎన్.శివ శంకర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఐఏఎస్ అధికారి రఘునందన్ రావు ఉన్నారు.

మంజూరు చేయబడిన పోస్టులు, వాటి కొనసాగింపు, కొత్త ఆంక్షలు, సవరణలపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. శాఖా కార్యదర్శులు, విభాగాల అధిపతులతో సంప్రదించి సమగ్ర అధ్యయనం చేసి తెలంగాణ ప్రభుత్వానికి తుది నివేదికను ఈ కమిటీ ఇవ్వనుంది.




# సీమాంధ్ర పాలకుల కంటే...

# వెయ్యి రెట్లు కేసీఆర్ ద్రోహం...

## పదేళ్లలో ఆయన వెలగబెట్టింది ఇదే!

## కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ అనుబంధం ఎలాంటిదైనా తెలంగాణకు తీరని నష్టం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే అధికారం కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వలేదని చెప్పారు. గత ప్రభుత్వం వాదించి ఉంటే హైదరాబాద్‌కు తాగునీరు సాధించేవాళ్లమన్నారు. కృష్ణా జలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు సీఎం హాజరై మాట్లాడారు.

**ఆ నిర్ణయాలు కృష్ణా పరివాహక ప్రాంత రైతులకు మరణ శాసనం...** "బేసిన్లు లేవు.. భేషజాలు లేవని కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి నుంచి 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్ వరకు నీళ్లు తరలించుకోవచ్చన్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు.

జగన్‌కు సూచనలతో పాటు టెండర్లు, జీవోలు ఇచ్చేలా సహకరించారు. ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్‌కు తాగునీరు జలాలను వేరు చేయాల్సి ఉంది. నగరంలో ఏపీ ప్రజలు 20 శాతం వరకూ ఉన్నారు. హైదరాబాద్‌కు ఉమ్మడి జలాల నుంచి తాగునీరిచ్చేలా కేసీఆర్ చర్చించాల్సింది. మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేది. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు తొలుత గద్వాలకు వస్తాయి. తెలంగాణకు వచ్చిన వెంటనే ఒడిసి పట్టుకోవాల్సి ఉంది. వెంటనే పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ ఇతర ప్రాంతాలకు తరలించాలి. తెలంగాణ వదిలితేనే ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు వెళ్తాయి. రాష్ట్రానికి వచ్చినప్పుడు వదిలేసి ఏపీ నుంచి తిరిగి వచ్చాక చివరకు తీసుకునేలా చేశారు. రాయలసీమకు వెళ్లిన జలాలను ఏపీ ఒడిసి పట్టుకుంటోంది. జూరాల నుంచే తెచ్చుకుంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదు. కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక ప్రాంతాల రైతులకు మరణ శాసనంగా మారాయి. ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ దక్కేది. ఉమ్మడి ఏపీలో సీమాంధ్ర పాలకులు చేసిన అన్యాయానికి వెయ్యి రెట్లు కేసీఆర్ ద్రోహం చేశారు.

సీమాంధ్ర పాలకులకు ఒక కొరడా దెబ్బ కొడితే.. కేసీఆర్‌ను వెయ్యి దెబ్బలు కొట్టాలి. గతంలో పాలమూరు-రంగారెడ్డి సామర్థ్యాన్ని ఒక టీఎంసీకి తగ్గించారు. ఏపీ 10 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపడితే పాలమూరును ఒక టీఎంసీకి తగ్గించారు. ఏడాదికి కిలోమీటర్ టన్నెల్ పూర్తిచేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యేది. గతంలో వెయ్యికోట్ల ప్రాజెక్టు అంచనా రూ.3వేల కోట్లకు పెరిగింది. 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టారు. కృష్ణా జలాలను దారి దోపిడీ చేసే అవకాశం ఏపీకి ఆయనే ఇచ్చారు.

**ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహిద్దాం...** కేసీఆర్ పాలనలో నిర్ణయాలు, మా పాలనలో నిర్ణయాలపై చర్చిద్దాం. వీధుల్లో, పబ్బుల్లో, క్లబ్బుల్లో కాకుండా అసెంబ్లీలో చర్చిద్దామన్నా. దయచేసి నన్ను క్లబ్బులు, పబ్బులకు పిలవొద్దు.. నేను రాను. కేసీఆర్ ఏ తేదీ చెబితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం. స్పీకర్ అనుమతితో నిపుణులను కూడా అసెంబ్లీకి ఆహ్వానిస్తాం. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా.. ఎలాంటి గందరగోళం లేకుండా సభ నిర్వహిస్తాం. ప్రశాంత వాతావరణంలో అర్థవంతమైన చర్చ నిర్వహిద్దాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. ఆయన ఆరోగ్యంగా ప్రజాజీవితంలో ఉండాలి. కేసీఆర్‌కు ఇబ్బంది లేకుంటే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే చర్చపెడదాం. అక్కడ మాక్ అసెంబ్లీ నిర్వహిద్దాం. నాకేమీ భేషజాలు లేవు.. కేసీఆర్ నాకంటే చాలా సీనియర్. నేను కూడా రావాలని ఆయన కోరుకుంటే తప్పకుండా వెళ్తా. ఫామ్‌హౌస్‌లో భేటీకి కేసీఆర్ తేదీ నిర్ణయించి చెప్పాలి. ఎర్రవల్లికి మంత్రుల బృందాన్ని పంపిస్తా. కేసీఆర్‌కు ఇబ్బంది లేకుండా అక్కడే చర్చిద్దాం.

**మీ కుటుంబ గొడవలను జనం గమనిస్తున్నారు...** నేపాల్‌లో ఓ యువరాజు కుటుంబంలో అందర్నీ చంపి రాజయ్యాడు. కేసీఆర్ కుటుంబంలో సమస్య ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలి. కులపెద్దలు, పెద్ద మనుషులతో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కేసీఆర్ కుటుంబ గొడవలు వీధి బాగోతాల్లా ఉన్నాయి. బావ, బావమరిది, చెల్లి గొడవలను జనం గమనిస్తున్నారు" అని రేవంత్ రెడ్డి అన్నారు.




హైదరాబాద్: సిగాచీ పరిశ్రమ ప్రమాదం విషయంలో అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఘటనలో 8 మంది ఆచూకీ లభించడం కష్టమేనని నిర్ణయానికి వచ్చారు.

రాహుల్, శివాజీ, వెంకటేష్, విజయ్, అఖిలేష్, జస్టిన్, రవి, ఇర్ఫాన్‌లు పూర్తిగా కాలి బూడిదైపోయి ఉంటారని భావిస్తున్నారు. ఆచూకీ లభించని ఆ 8 మంది చనిపోయినట్లుగా అధికారులు ప్రకటించారు. అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలు చేసుకోవాలని వారి కుటుంబ సభ్యులకు సూచించారు. ఆచూకీ తెలిస్తే సమాచారమిస్తామని బాధిత కుటుంబాలకు తెలిపారు.

డీఎన్ఏ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో ఇదివరకు 44 మృతదేహాలు గుర్తించిన విషయం తెలిసిందే.




హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారం దేశ రాజధాని ఢిల్లీ వెళ్లిన ఆయన తన పర్యటన ముగించుకుని కొద్దిసేపటి క్రితమే హైదరాబాద్ కు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చిచారు. సోమవారం కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో కలిసి తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్ ను తెలంగాణలో నిర్వహించాలని, ఒలింపిక్స్-2036 లో 2 ఈవెంట్లు రాష్ట్రంలో జరపాలని కోరారు. ఇదే రోజున సీఎం రేవంత్ రెడ్డిని టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కలిసి తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ తాను భాగస్వామినవుతానని సీఎంతో చెప్పారు. ప్రముఖ బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవ్ గణ్ సీఎంను కలిలి రాష్ట్రంలో ఫిల్మ్ స్టూడియో నిర్మించేందుకు సహకరించాలని కోరారు.

మంగళవారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పీయూష్ గోయల్ తో భేటీ అయిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రానికి యూరియా సరఫరా, జహీరాబాద్ స్మార్ట్ సిటీకి నిధులు, వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక చేయుతతో పాటు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధిపై కీలక విజ్ఞప్తులు చేశారు. ఇవాళ మరికొంత మంది కేంద్ర మంత్రులతో భేటీ అవుతారనే టాక్ వినిపించినా ఎవరిని సీఎం కలవలేదు. ఈక్రమంలో తన పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. అయితే ఈ పర్యటనలో భాగంగా సీఎం ఏఐసీసీ పెద్దలెవరిని కలవకుండానే రాష్ట్రానికి తిరిగి వచ్చేశారు.

## రైతులకు బిగ్ రిలీఫ్... యూరియా సరఫరాపై కేంద్రం కీలక ఆదేశాలు



తెలంగాణ రాష్ట్ర రైతులకు గుడ్ న్యూస్. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నారు కేంద్ర మంత్రి జేపీ నడ్డా. అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎరువుల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2023- 24 రబీతో పోలిస్తే 2024- 25లో 21% అదనంగా యూరియా అమ్మకాలు జరిగాయని కేంద్రమంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటి వరకు 12.4% అదనపు వినియోగం జరిగిందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య ఎరువుల సమన్వయాన్ని చేస్తూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచనలు చేశారు జేపీ నడ్డా. దింతో తెలంగాణ రాష్ట్ర రైతులకు ఊరట లభించింది.

## విచారణ పేరుతో రాజకీయ ప్రేరేపిత కుట్రలు: హరీశ్‌రావు




హైదరాబాద్: విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రేరేపిత కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. "ఎన్డీయే పాలిత బిహార్, గుజరాత్‌లో వంతెనలు కూలడం సర్వసాధారణం. అయినప్పటికీ అక్కడ విచారణలు, చర్యలుండవు. అదే మేడిగడ్డలో 2 పిల్లర్లు కుంగితే హడావిడి చేస్తారు. ఎన్డీఎస్ఏ వేగంగా విచారణ చేపడుతుంది. రాజకీయ ప్రేరేపిత నివేదికలు ఇస్తారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

## త్వరలో మోదీ కిట్‌లు పంపిణీ చేస్తాం: బండి సంజయ్



కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం విద్య కోసం రూ.1.28లక్షల కోట్లు కేటాయించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా "మన మోదీ కానుక' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు 20వేల సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తలచుకుంటే అద్భుతాలు చేయగలరు. తలదించుకుని పుస్తకాలు చదివితే భవిష్యత్‌లో తలెత్తుకుని జీవిస్తాం. సైకిళ్ల పంపిణీ కార్యక్రమం పూర్తయిన తర్వాత.. త్వరలోనే మోదీ కిట్‌లు కూడా పంపిణీ చేస్తాం" అని బండి సంజయ్ తెలిపారు.




## సీవీ ఆనంద్ కృషి.. వారసత్వ సంపద అప్పుడలా.. ఇప్పుడిలా

హైదరాబాద్, జులై 9: దేశ వారసత్వ సంపద వెలకట్టలేని ఆస్తి. పురాతన కట్టడాలు ఎక్కడున్నా వాటిని పరిరక్షించి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ఎంతో ఉంది. దీనిని అక్షరాలా అమలు చేశారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ).. సీవీ ఆనంద్. ఆయన కృషి, పట్టుదలతో హైదరాబాద్ పాతబస్తీలో ఉన్న పురానీ హవేలీ లోని పాత కొత్వాల్ కార్యాలయానికి మునుపటి శోభ తీసుకొచ్చారు. ఆ పురాతన భవంతికి పూర్తి స్థాయి మరమ్మత్తులు చేయించి, కొత్త సొబగులద్ది, మళ్లీ ఆ మహల్‌ను భావితరాల ముందుంచారు. ఇవాళ పురానీ హవేలీలో సరికొత్తగా కొత్వాల్ ఆఫీస్ ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం 'ఎక్స్' లో ఒక పోస్ట్ చేశారు. ' ఈ రోజు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రోజు. పురానీ హవేలీలోని పాత కొత్వాల్ కార్యాలయం పున:ప్రారంభోత్సవం జరిగింది. దాదాపు 4 సంవత్సరాల క్రితం, ఈ భవనం పైకప్పు కూలిపోయింది. దీంతో ఆ పురాతన భవంతని కూల్చివేయాలనే నిర్ణయానికి వచ్చారు. కానీ మన వారసత్వాన్ని నాశనం చేయాలనే ఆలోచన నాకు నచ్చలేదు. దీనికి ఎలాగైనా పూర్వ వైభవం తీసుకురావాలన్న తలంపుతో స్పాన్సర్ కోసం వెతికాను. గ్రీన్కో సంస్థ సీఎండీ అనిల్ ఈ పునరుద్ధరణకు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. అంతే, ఈ భవంతి మరమ్మత్తు పని డిసెంబర్ 2022లో ప్రారంభమైంది. కానీ 2023 అక్టోబర్‌లో నా బదిలీతో, అది ఆగిపోయింది. తరువాత సెప్టెంబర్ 2024లో, నేను %జూ%(కమిషనర్ ఆఫ్ పోలీస్)గా తిరిగి పోస్ట్ చేయబడినప్పుడు, నేను పనిని తిరిగి ప్రారంభించాను. హెరిటేజ్ సైట్ పునరుద్ధరణ అనేది ఒక శ్రమతో కూడిన ప్రక్రియ. ఎంతో ఓపికపట్టాలి. దక్కన్ టెర్రైన్ ఏజెన్సీలకు చెందిన మీర్ ఖాన్ ఎంతో ప్రశంసనీయమైన పని చేయడంతో మేము దానిని తిరిగి ప్రారంభించబోతున్నాము. ఇప్పటి నుండి కోత్వాల్ పాత నగరాన్ని సందర్శించినప్పుడు కూర్చోవడానికి ఒక స్థలం ఉంటుంది!' అని ఆనంద్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.




వంతెన కుప్పకూలడంతో వాహనాలు నదిలో పడిపోయిన ఘటన గుజరాత్‌లోని వడోదరలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం పద్రా వద్ద మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెనలోని కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో దానిపై వెళ్తున్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు సహా పలు వాహనాలు నదిలో పడిపోవడంతో తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు వాహనాల నుంచి ఇప్పటివరకు నలుగురిని రక్షించారని.. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. 1985లో నిర్మించిన ఈ వంతెన పాతబడడంతో పాటు.. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల కూలిపోయి ఉండొచ్చని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేశారు. గుజరాత్‌లోని వడోదర-ఆనంద్ పట్టణాలను కలుపుతున్న ఈ వంతెన కూలడంతో ఇరు పట్టణాల మధ్య రాకపోకలు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. వంతెన కూలిన ఘటనపై ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్పందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి వంతెన కూలడానికి గల కారణాలను గుర్తించాలని సాంకేతిక నిపుణులను ఆదేశించారు. నదిలో పడిన వాహనాలను తొలగించడానికి వడోదర అగ్నిమాపక శాఖ బృందాలు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు చర్యలు తీసుకుంటున్నాయి.

**భారీ వర్షాలు..కొట్టుకుపోయిన రోడ్డు...** మరో ఘటనలో రాజస్థాన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఝుంఝును జిల్లాలో కొత్తగా నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. భారీ వర్షాలకు కట్లి నదిలో నీటిమట్టం పెరగడంతో వరద ఉద్ధృతి కారణంగా కొత్తగా వేసిన రహదారి కొట్టుకుపోయిందని అధికారులు పేర్కొన్నారు. కాగా రోడ్డు నాణ్యత పైనా స్థానికులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

**మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం: ప్రధాని మోదీ...** బ్రిడ్జి కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## కల్తీ కల్లు ఘటనలో మరొకరి మృతి.. పోలీసుల అదుపులో నిర్వాహకులు

హైదరాబాద్: కల్తీ కల్లు కేసులో ఐదుగురు నిర్వాహకులను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తున్న నగేశ్ గౌడ్, బి. శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, టి.కుమార్ గౌడ్, తీగల రమేశ్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. నిర్వాహకులకు సంబంధించిన ఐదు షాపులను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. మొత్తం 600 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకున్నారు. కల్లు కాంపౌండ్‌లో మంగళవారం కల్తీ కల్లు తాగి 19 మంది అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. బుధవారం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీతారాం (47) మృతి చెందగా.. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్వరూప అనే మహిళ ప్రాణాలు విడిచారు. అంత్యక్రియల కోసం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. కల్తీ కల్లు తాగి చనిపోయినట్లు తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మరో 15 మంది పంజాగుట్ట నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

## కల్తీ కల్లు ఘటన.. రాష్ట్ర ప్రభుత్వం నిజాలు దాచాలని చూస్తోంది: ఈటల రాజేందర్




హైదరాబాద్: కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిజాలు దాచాలని చూస్తోందని ఆరోపించారు. ఈ ఘటనలో ఇవాళ ఒకరు, నిన్న ఇద్దరు.. మొత్తం ముగ్గురు చనిపోయినట్లు సమాచారం ఉందని చెప్పారు. కల్తీ కల్లు ఎప్పటి నుంచి అమ్మారు? ఎంతమంది తాగారు? అనే పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం సేకరించాలన్నారు. బాధితులు 20 మంది కంటే ఎక్కువ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే మరికొందరు ఆసుపత్రిలో చేరుతున్నారని వివరించారు. కల్తీకల్లు ఘటనలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సీతారాం (47) బుధవారం ప్రాణాలు విడిచాడు. వనపర్తి జిల్లా మదిగట్ల గ్రామానికి చెందిన సీతారాం, అనిత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చి హైదర్‌నగర్‌లో ఉంటూ సీతారాం మేస్త్రీగా పని చేస్తున్నాడు.




## ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, జులై 09: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. పార్టీ వీడి ఎందుకు వెళ్లి పోయారో ఆయనకే తెలియదని బీజేపీ నేత మాధవి లత వ్యంగ్యంగా అన్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ.. హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా తనకు అధిష్టానం అవకాశం ఇస్తే.. ఆ రోజు పార్టీలో మగాళ్లు లేరా అని రాజాసింగ్ ప్రశ్నించారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. అయినా రాజాసింగ్ తన తమ్ముడేనని ఆమె స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో బీజేపీ నేత మాధవి లత మాట్లాడుతూ.. మొన్నటి ఎన్నికల్లో తన తమ్ముడు రాజా సింగ్ కంటే తనకే ఎక్కువ ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. గోషామహల్ కాదు ప్రస్తుతం అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో తాను పర్యటిస్తున్నానన్నారు. తనకు ఒక్క గోషామహల్ నియోజకవర్గమే కాదని.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు తన పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది అధిష్టానం ఇష్టమన్నారు. తనకు అవకాశం ఇస్తే బరిలో ఉంటానని మాధవి లత వెల్లడించారు. పేద ప్రజల ఇళ్లు కూలుస్తున్న హైడ్రా.. ఫాతిమా కాలేజీ విషయంలో ఎందుకు భయ పడుతుందో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆమె డిమాండ్ చేశారు. తన పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది ప్రజలు రోడ్డున పడే పరిస్థితి నెలకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ ఇచ్చే డబ్బుల మూటలతో ఈ ప్రభుత్వం నోరు కట్టేస్తుందని మండిపడ్డారు. దీనిపై త్వరలో తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాధవి లత బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. ఇక తెలంగాణలో రాష్ట్ర బీజేపీ అధ్యక్ష ఎన్నిక ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఈ పదవికి గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నామినేషన్ దాఖలు చేసేందుకు తన అనుచరులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. వారిని కార్యాలయంలోకి వెళ్లకుండా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది.. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా.. మీకు, మీ పార్టీకో దండం అన్నారు. అలాగే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాకుండా.. సీనియర్లు అడ్డుకుంటున్నారంటూ రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు వేశారు. దీంతో రాజాసింగ్ వ్యవహారంపై పార్టీ అగ్రనాయకత్వం సీరియస్ అయినట్లు తెలుస్తుంది. మరోవైపు అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేస్తుంది. అలాంటి వేళ.. ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీకి చెందిన కళాశాల పట్ల హైడ్రా ఉదాసీనంగా వ్యవహరిస్తుందంటూ గత కొంత కాలంగా విమర్శలు వస్తున్నాయి. ఈ అంశంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఉదాసీన వైఖరి అవలంభించిందంటూ.. అందుకే హైడ్రా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఒక ప్రచారం సాగుతుంది. ఇక జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ ఇటీవల అనార్యోగంతో మరణించారు. ఈ స్థానానికి ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. దీనిపై మరికొద్ది రోజుల్లో ఎన్నికల సంఘం ప్రకటన చేయనుంది. ఈ నేపథ్యంలో ఈ ఉప ఎన్నికపై మాధవి లతపై విధంగా స్పందించారు.

# గురు పూజకు ఉద్దిష్టమైనది వ్యాసపూర్ణిమ



ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురు పూర్ణిమ, వ్యాస పూర్ణిమ అని పేరు. వ్యాస పౌర్ణమి గురుపూజా దినమని భావించ బడుతున్నది. వేదాలను సమగ్రంగా పఠించలేని, శక్తి హీనులకు సహాయం చేయడం కోసం, భగవంతుడు ద్వాపర యుగ ప్రారంభాన, సత్యవతి దేవికి పరాశర మహర్షికి కుమారుడిగా అవతరించి, సమగ్రమైన వేదరాశిని క్రమంగా రుక్, యజుర్, సామ, అథర్వణ నాలుగు విధాలుగా విభజించి, శాఖల పరంగా అమర్చి, సక్రమ పద్ధతిలో ఏర్పరిచినందున, "వ్యాసుడు" అని సార్థక నామధేయుడు అయినారు. అష్టాదశ పురాణాలు, మహా భారతం, సంహిత గ్రంథాలను రచించిన, భగవత్ స్వరూపుడైన వేదవ్యాస భగవానుని పూజించే దినమిది. వ్యాస పూర్ణిమ పర్వాన్ని ఆదిశంకర భగవత్పాదులు ఏర్పాటు చేసినట్లుగా చెబుతారు. ఇందు వ్యాస పదము గురు పరము. ఈ రోజున లోకమంతయు, తమ తమ గురువులను ఆరాధించుకొని, తరించాలని శాస్త్రాలు తెలుపుతున్నాయి. స్వస్వరూప అనుసంధానమున కన్న భిన్నమగు అన్యారాధన చేయని, యతి శేఖరులు కూడా ఆచార్య పీఠార్చనలను ఆచరించాలని శాస్త్రాదేశము. "యస్యదేవే పరాశక్తి: యథా దేవే యాతథా గురౌ" అని శ్వేతాశ్వతరోపనిషత్తు తెలుపుతున్నది. గురు పూజనము, వేదమాత, ఈశ్వర ఆరాధనతో తొలి గౌరవమును, సమాన ప్రాధాన్యతను పొంది ఉన్నది. "దైవే రుష్టే గురు స్త్రాతా, గురౌ రుష్టేన కశ్చన" అని స్మృతి కారులు చెప్పియున్నారు. గురువు అనుగ్రహం పొందనిదే, దైవానుగ్రహం పొంద లేరని స్మృతి కర్తలు పేర్కొన్నారు. "సాధనలో నిర్లక్ష్యం వహించి సిద్ది పొందే ప్రయత్నం చేయడం అవివేకం" అని వారి భావన. ఋషులు ఎంత మంది ఉన్నా, వేదవ్యాసుని పేరుననే పూజ జరుగుట ప్రత్యేకం. ఆది శంకరులను వ్యాస భగవానుని అవతారమని చెబుతారు. కనుకనే ఇది వ్యాస పూజకు విశిష్టమైనది. వ్యాస పూజ అంటే ఆదిశంకరుల పూజ అని భావిస్తారు. కనుక ఆది శంకరులను గురువుగా ఎంచుకొని, వ్యాస రూపుడైన గురువును కొలవడం చేత, ఇది వ్యాస పూజా దినం అయింది. ."శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణం, సూత్ర భాష్య కృతే వందే భగవంతౌ పునః పునః" అని పూజిస్తే బ్రహ్మత్వం సిద్ధిస్తుందని చెబుతారు. వ్యాసుడు సకల కళానిధి, శాస్త్రవేత్త. సోమకుడు అనే రాక్షసుడు వేదాలను ఎత్తుకు పోయినపుడు, ఇవన్నీ ఒకదానితో ఒకటి కలిసి పోగా, మహావిష్ణువే వ్యాసావతారియై, చిక్కుపడిన వేదాలను విభజించి వేరు పరిచిన విద్యావేత్త. "గుకారో అంధకారస్య రుకారో తన్నిరోధక:" శిష్యుని లో ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞాన వెలుగులు నింపే వాడే నిజమైన గురువు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించేవాడు అసలైన గురువు. మానవ జాతికి ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఒసగిన, వైద్య వరుడు, వైద్య విద్యానిధి, మేధానిధి, ఆత్మ విద్యానిధి అయిన వ్యాసభగవానుని, ఆషాఢ పౌర్ణమి నాడు పూజించడం, ఉపదేశ గురువులకు పూజలు చేయడం, హైందవ సంస్కృతిలో సత్సంప్రదాయం. "గురుర్ బ్రహ్మ గురు విష్ణు: గురుదేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ... త్రైమూర్త్య సమానుడైన గురువుకు హైందవ సంస్కృతిలో పరమోన్నత స్థానం ఉంది. విద్యార్థులతో పాటు భాషకు, స్పర్శకు, కనుచూపుకు, అందని అలౌకికానందాన్ని ఇచ్చే అంతర్యామిని, అనుభవింప చేయ కలిగినవాడే నిజమైన గురువు. అందుకే అనుబంధాల వాల్మీకంలో తిమిరంతో సమరం చేస్తున్న వేళ... జ్ఞాన పిపాస గావించి పుట్ట బయట వెలుగులు ప్రసాదింప చేసి, లౌకిక పారలౌకిక జ్ఞాన సంపన్నులను చేసే, సద్గురువులను ఆరాధించడమే అసలైన గురుపూజోత్సవ ఉద్దేశం.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# అభివృద్ధి కాముకులు అక్కిరాజు వాసుదేవరావు

## - జూలై 10...అక్కిరాజు వాసుదేవరావు జయంతి



హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మేళ్లచెర్వు శివారు వెంకట్రామాపురం నివాసి అక్కిరాజు వాసుదేవరావు. ఆయన కుటుంబం భూస్వామ్య కుటుంబం కావడంతో విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఆయనను ఆయన తల్లిదండ్రులు కృష్ణా జిల్లాలో చదివించారు. అక్కడ ఆయన ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదవి అంగ్లంలో మంచి పట్టు సాధించారు. 1962ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అక్కిరాజు వాసుదేవరావు సీపీఐ అభ్యర్థి డి.నరసయ్యపై 2,833 ఓట్లతో గెలుపొందారు. 1967ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి అక్కిరాజు వాసుదేవరావు సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన డి.నరసయ్యపై 2,888ఓట్లతో గెలుపొందారు. 1978లో ఏర్పడిన కోదాడ నియోజకవర్గం నుండి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అక్కిరాజు వాసుదేవరావు కాంగ్రెస్ఐ అభ్యర్థి కె.లక్ష్మణ్‌రాజుపై గెలుపొందారు. ఎంతో చైతన్యం కల్గిన హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాలకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అక్కిరాజు వాసుదేవరావు నాటి రాజకీయాలకే వన్నె తెచ్చారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఆయన సఫలీకృతులయ్యారు. 1962 నుండి 72 వరకు వరకు రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే ఎన్నికై బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహా రావుల కేబినెట్ లలో మంత్రిగా పనిచేశారు. అనంతరం 1977 కోదాడ నియోజకవర్గం ఏర్పడిన అనంతరం ఆయన 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొంతకాలం తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. 1983 వరకు కోదాడ ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకున్నారు. తరవాత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చినప్పటికీ స్థానిక పరిస్థితులను అవగతం చేసుకుని, తన శిష్యుడైన చింతా చంద్రారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఇప్పించిన త్యాగశీలి ఆయన. నేటి రాజకీయ నాయకులు పార్టీ టికెట్ల కోసం తన్నుకుంటున్న స్థితిలో ఆయనకు వచ్చిన టికెట్‌ను స్వచ్ఛందంగా వదులుకుని సమకాలిన రాజకీయాలకే వన్నె తెచ్చారు. ఆ నిర్ణయాన్ని కోదాడ ఎన్నికల బహిరంగ సభకు వచ్చిన మాజీ ప్రధాని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ స్వయంగా బహిరంగ వేదిక పైనుంచే అభినందించారు. హుజూర్ నగర్ ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు కోదాడలో డిగ్రీ కళాశాలను ఆర్ట్స్అండ్ సైన్స్ విభాగంతో ఏర్పాటు చేయించారు. తొలుత కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కళాశాలను ప్రారంభించారు. అనంతరం తన బంధువులైన కొండపల్లి రాఘవమ్మరంగారవు నుంచి 60ఎకరాల భూమిని విరాళంగా సేకరించి 1970లో కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు ఫౌండర్ చైర్మన్‌గా ఆయన కొనసాగారు. అదే విధంగా ఆయన కళాశాల అభివృద్ధికి అన్ని వర్గాలను భాగస్వామ్యం చేశారు. ఆ కళాశాల ద్వారా ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఐఎఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ కళాశాలకు, కళాశాల విద్యార్థులకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. నియోజకవర్గ పరిధిలో వంద గ్రామాలకు ఒకే సారి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత కూడా ఆయనకు ఉన్నదని చెపుతారు. నియోజకవర్గంలో రహదారులను ఏర్పాటు చేయడంలో ఆయన కృషిచేశారు. కనీస రహదారి లేని గ్రామాలకు మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు రహదారి సౌకర్యాలు కల్పించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ద్వారా హుజూర్‌నగర్, కోదాడ రెండు నియోజక వర్గాలకు సంబంధించిన అనేక గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయించారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలలో వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషిచేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాలకు సాగర్‌నీటిని తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఇప్పటికీ ఆయా ప్రాంతాల ప్రజలు కొనియాడుతారు. పీవీ నర్సింహారావు మంత్రి వర్గంలో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన ఆ యన అప్పటి కాలువల ఏర్పాటులో ఎంతో కృషిచేశారు. రాజకీయంగా ఆయన రాష్టంలో మంచి గుర్తింపు తెచ్చుకుని జాతీయ నాయకులతో మంచి సత్సంబంధాలను కొనసాగించారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కోదాడకు వచ్చిన సందర్భముగా ఆయనను అభినందించి కేంద్రంలో ఆయన సేవలు వినియోగించు కుంటామని చెప్పారు. అనంతరం ఆమె హత్యకు గురికావడంతో రాజకీయ జీవితానికి అవరోధం ఏర్పడింది. పీవి నర్సింహారావుకు బంధువు, అత్యంత ఆత్మీయుడు అయన వాసుదేవరావుకు మారుతున్న రాజకీయ పరిణామాలతో రాజకీయ జీవితానికి విఘాతం కల్గింది. ఆప్కాబ్ చైర్మన్, ఖాధీ భాగ్యనగర సమితి చైర్మన్ ఆయన కొనసాగారు. జాతీయ స్థాయిలో ఆయనకు మణిశంకర్ అయ్యర్ తదితర ఆనాటి నాయకులతో సత్సంబంధాలు ఉండేవి. రాష్ట్రంలో నాటి నాయకులు, సినిమా పరంగా ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సి నారాయణరెడ్డి, దాశరథిలతో సంబంధాలను కొనసాగించారు. రాష్ట్రానికి జాతీయ నాయకులు ఎవరు వచ్చినా వారి ప్రసంగాలను ఆయనే అనువదించే వారు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో అసెంబ్లీలో పలు సమస్యలపై ఆంగ్లంలో మాట్లాడుతుంటే సభ ఆసాంతం ఆలకించేవని నాటి తరం నాయకులు అనుకుంటూ ఉండేవారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


# దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి అమరేశ్వరి - జూలై 10.. జస్టిస్ కే.అమరేశ్వరి జయంతి



సమాజంలో స్త్రీలకు సరైన గౌరవం, మర్యాద లభించని రోజుల్లో కొందరు మహిళలు, ముందుకు వచ్చి, పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని, స్వయం కృషితో వివిధ రంగాల్లో తమ సత్తా చాటుకుని గుర్తింపు పొంది, సాటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని ఆరోజుల్లోనే నిరూపించారు. తాము తలుచుకుంటే ఏమైనా సాధించ గలమని మహిళలు ముందుకు సాగారు. అలాంటి వారిలో జస్టిస్ అమరేశ్వరి ఒకరు. ఒక సాధారణ వ్యవసాయం కుటుంబంలో జన్మించిన ఆమె.. దేశంలో న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో పేదరికం, వివాహం, ఇతర అంశాలు ఏమాత్రం అడ్డురాదని నిరూపించిన ఆమె.. సాటి మహిళల్లో ఏమైనా సాధించగలమన్న చైతన్యాన్ని నింపారు. జస్టిస్ కె. అమరేశ్వరి (కోనమనేని అమరేశ్వరి) భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తిగా చరిత్ర పుటల కెక్కారు. గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10 వ తేదీన జన్మించారు. 14వ ఏటనే పెళ్ళి జరిగినా భర్త ప్రోత్సాహముతో చదువు సాగించారు.ఆమె 1949 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి పొలిటిక్స్ అండ్ హిస్టరీలో ఎంఏ డిగ్రీని పొంది, అదే విశ్వ విద్యాలయం నుండి బిఎల్, డిగ్రీని కూడా తీసుకున్నారు. డి.మునికన్నయ్య ఛాంబర్స్‌లో ఆమె అప్రెంటిస్‌షిప్ చేశారు. 1952 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాదిగా చేరారు. గుంటూరుకు, తరువాత హైదరాబాద్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మారగా ఆమె అదే వృత్తిలో కొనసాగారు. 1960-61 మధ్య కాలంలో బార్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. అక్టోబర్, 1974 లో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుండి 14-2-1977 వరకు రెండేళ్లపాటు అదనపు న్యాయమూర్తిగా పని చేశారు. భారత మహిళా న్యాయవాదుల సంఘమునకు ఉపాధ్యక్షులుగా, 1975-76 మధ్యకాలంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వర్తించారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కాగా, ఉమ్మడి హైకోర్టు తొలి మహిళా న్యాయ మూర్తిగా జస్టిస్ అమరేశ్వరి 29-4-1978 న శాశ్వత న్యాయ మూర్తిగా నియమితులయ్యారు. దేశములోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990 సంలో సీనియర్ గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ నుంచి గత 13 సంవత్సరాలుగా సుప్రీంకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సాధించిన మహిళ జస్టిస్ కొనమనేని అమరేశ్వరి, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమరేశ్వరి సమర్థించారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు చట్ట పరమైన పరిణామాలు' అన్న అంశంపై నిర్వహించిన ఒక సెమినార్లో ఆమె తన అభిప్రాయాన్ని ముక్కు సూటిగా వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందుకుంటున్న ప్రైవేటు సంస్థలు సిబ్బంది నియామకంలో రిజర్వేషన్లను అమలు చేయాలని గట్టిగా వాదించారు. మహిళలకు మార్గదర్శకురాలై, న్యాయ వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు పొందిన జస్టిస్ అమరేశ్వరి 2009, జులై 25 న కొత్త ఢిల్లీలో మరణించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**


# సంచలనాల "బాహుబలి"కి పదేళ్లు




తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన చిత్రం బాహుబలి. రాజమౌళి ఊహల్లోంచి పుట్టిన బాహుబలి సినిమా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటింది. ఈ సినిమా జూలై 10వ తేదీన 2015 వ సంవత్సరంలో విడుదలై అద్భుతమైన విజయాన్ని సాధించి రికార్డు సృష్టించి, పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు కలెక్షన్లు సాధించింది. సుమారు 180 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా 650 కోట్ల రూపాయల కలెక్షన్లు సాధించి తెలుగు సినీ జగత్తులో బద్దలు కొట్టలేని విధంగా అనేక రికార్డులు సృష్టించింది. భారీ అంచనాలతో పదేళ్ళ క్రితం జూలై 10న విడుదల అయిన బాహుబలి... భారతీయ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఒక బ్లాక్ బస్టర్ గా నిలిచి పోయింది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలిచి, పలు చిత్రాలకు మార్గ దర్శియై, ఎనిమిది ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రభాస్ హీరోగా, రాణా విలన్ పాత్రలో నటించిన ఈ సినిమాకు రాజమౌళి దర్శకత్వం వహించగా ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్ మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సినిమాను నిర్మించారు. అనుష్క, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్, తమన్నా వంటి వారు ఇద్దరు కీలక పాత్రలలో నటించారు. హీరో ప్రభాస్ తన కెరీర్ లో ఈ చిత్రం కోసం ఐదేళ్లు వెచ్చించారు. 2012 సంవత్సరం నుంచి 2017వ సంవత్సరం వరకు మరో ప్రాజెక్ట్ ఒప్పుకోకుండా ప్రభాస్ ఈ సినిమా పూర్తి చేశారు. సినిమా క్లైమాక్స్ ఒక్కదానికే సుమారు 30 కోట్ల రూపాయల ఖర్చయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 36 స్టూడియోలలో ఈ సినిమా కోసం వివిఎక్స్ ఆర్టిస్టులు పని చేశారు. సుమారు 1300 మంది వివిఎక్స్ ఆర్టిస్టులు రాత్రి పగలు తేడా లేకుండా పని చేశారు. సినిమా చిత్రీకరణ జూలై 6, 2013న కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు రాతి ఉద్యా నవనంలో మొదలైంది. సినిమాలో భాగమైన మాహిష్మతి రాజ్యానికి సంబంధించిన భారీ సెట్టుని రామోజీ ఫిలిం సిటీలో కళా దర్శకుడు సాబు సిరిల్ నేతృత్వంలో నిర్మించారు. సినిమాలోని తమ పాత్రలకు అనుగుణంగా ప్రభాస్, అనుష్క, రాణా కత్తిసాము నేర్చుకోగా, ప్రభాస్, రాణాలు అదనంగా గుర్రపు స్వారీలు నేర్చుకోవడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 9000 థియేటర్లలో విడుదలైన సినిమా ఒక్క భారత దేశంలోనే 6500 స్క్రీన్ లలో విడుదల చేయ బడింది. ఈ సినిమాలో నటీనటులు ధరించడం కోసం 1500 వెరైటీలకు ఆభరణాలు తయారు చేయించారు. ఒక్కొక్క క్యారెక్టర్ కి ఒక్కొక్క విధంగా ఈ ఆభరణాలు తయారు చేయించారు. రాజమౌళి సినిమా కోసం తమిళ రచయిత మదన్ కార్కి "కిలికిలి" లేదా "కిలికి" అనే పేరుతో ఓ కొత్త భాషను రూపొందించారు. భాషను 750 పదాలతో, 40 వ్యాకరణ సూత్రాలతో రూపొందించారు. సినిమాలో కనిపించే కాలకేయులు అనే తెగ ఈ భాష మాట్లాడుతుంది. ఒక సినిమా కోసం ఓ భాషను రూపొందించడం భారత దేశంలో ఇదే ప్రథమం. భారత దేశంలో అత్యంత వసూళ్ళు సాధించిన సినిమాలలో ఒకటిగా ఈ సినిమా పేరొందింది. 2015లో.. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ విలన్, ఉత్తమ ఛాయా గ్రహణం, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నేపథ్య గాయకుడు, ఉత్తమ కళా దర్శకుడు, ఉత్తమ నృత్య దర్శకుడు, ఉత్తమ శబ్ద గ్రాహకుడు, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్, ఉత్తమ స్టంట్ మాస్టర్, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో నంది పురస్కారాలు పొందడం విశేషం. 2015 లో వచ్చిన మొదటి భాగము బాహుబలి "ది బిగినింగ్"కి కొనసాగింపుగా బాహుబలి 2 "ది కన్ క్లూజన్" చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 2017 ఏప్రిల్ 28వ తేదీన విడుదల చేసారు. ఈ చిత్రం విడుదలై తొలి రోజే ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల వసూళ్లతో చరిత్ర సృష్టించి, విడుదలైన ఆరు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 800 కోట్లు వసూలు చేసి, ఆల్ టైమ్ అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రంగా నిలిచింది. కేవలం పది రోజుల లోనే 1000 కోట్లు పైగా వసూలు చేసిన మొట్టమొదటి భారతీయ చిత్రంగా నిలిచింది. భారత దేశంలో, ఇది అనేక చలన చిత్రాల రికార్డులను నెల కొల్పింది. హిందీలో, తెలుగు మరియు తమిళ భాషలలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా చరిత్ర పుటల కెక్కింది.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# కృష్ణ పాత్ర ధారణలో పీసపాటికి రారెవరూ సాటి - జూలై 10...పీసపాటి నరసింహ మూర్తి జయంతి



పీసపాటి నరసింహమూర్తి (1920 జూలై 10 - 2007 సెప్టెంబర్ 28) పేరుపొందిన రంగస్థల నటులు. తెలుగు నాటక రంగంలో శ్రీకృష్ణ పాత్రదారిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్న గొప్ప నటుడు. పద్యగానంలో తనకంటూ ఒక ఒరవడిని సృష్టించుకున్న నటులు. పీసపాటి నరసింహమూర్తి, విజయనగరం జిల్లా బలిజిపేట మండలం, వంతరాం గ్రామంలో 1920, జూలై 10న జన్మించారు. ప్రారంభంలో ఆకాశవాణిలో పనిచేశారు. 1938లో రంగూన్‌రౌడీ నాటకంలో కృష్ణమూర్తి పాత్ర ద్వారా పీసపాటి నాటకరంగం లోకి అడుగు పెట్టారు. 1946లో పాండవోద్యోగ విజయాలు నాటకంలో మొదటి సారిగా శ్రీకృష్ణుడి పాత్ర ధరించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు రెండు పర్యాయాలు సంగీత నాటక అకాడమీలో సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం 1993లో ఆయనను కళాప్రపూర్ణ ఇచ్చి సత్కరించింది. దాదాపు ఏడు దశాబ్దాల పాటు వేలాది ప్రదర్శనలు ఇచ్చిన పీసపాటి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. తిరుపతి వేంకట కవులు, కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ వంటివారు ఎంతగానో అభినందించారు. ఎన్.టి.రామారావు పీసపాటి శ్రీకృష్ణ పాత్ర నటనను చూసి మెచ్చుకున్నారు. పాండవోద్యోగ విజయాలతో పాటు గౌతమ బుద్ధ, లవకుశ, తారా శశాంకం, చింతామణి లాంటి నాటకాలు అనేకం వేసినా, పీసపాటికి ఎనలేని కీర్తి కృష్ణుని పాత్ర వల్లే వచ్చింది. అత్యుత్తమ కృష్ణునిగా ఉద్యోగ విజయాల నాటక రచయితల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి నుంచి అవార్డు అందుకోవడం, టంగుటూరి ప్రకాశం నటరాజు విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వటం, బిలాస్‌పూర్లో తెలుగురాని ఒక బెంగాలీ జంట నాటకం చూసి, గ్రీన్ రూమ్‌లో ఇతనిని తనివితీరా ముద్దాడడం తన జీవితంలో మరపురాని సంఘటనలుగా పీసపాటి పేర్కొన్నారు. పద్య గానంలో పీసపాటి అనేక మార్పులు తీసుకు వచ్చారు. తెలుగు పౌరాణికాల్లో పద్యాలను సుదీర్ఘమైన రాగాలతో పాడడం అలవాటుగా ఉండేది. ఒక నిముషం పద్యానికి ఐదేసి నిముషాల రాగం తియ్యడం ఆనవాయితీగా ఉండేది. పీసపాటి ఆ పద్ధతిని విడనాడి, అనవసరమైన సాగతీతలను విసర్జించి, సాహిత్యానికి ఎక్కువ విలువ కల్పిస్తూ పద్యం పాడి ప్రజలను అలరించారు. పీసపాటి కృష్ణుడి వేష ధారణలో కూడా మార్పులు తీసుకు వచ్చారు. దేహానికి అంటిపెట్టుకుని ఉండే నీలపు రంగు చొక్కా ధరించి నిజంగా నీలపు కృష్ణుడేననే భ్రమ కల్పించారు. పీసపాటి 1987-1993 కాలంలో బొబ్బిలి మండలం, రాముడువలస గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి ఆయనకు నాటక రంగంలో విశిష్ట పురస్కారం లభించింది. పీసపాటి నరసింహ మూర్తి 2007, సెప్టెంబర్ 28న మరణించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

చురకలు

## సంపాదకీయం

# ఏఐ విప్లవం

## ఉద్యోగాలు పోతున్నాయి.. ఏం చేయాలి?

ఏఐ విప్లవం వచ్చింది. దీంతో మైక్రోసాఫ్ట్ నుంచి మొదలుపెడితే మామూలు కంపెనీల వరకూ అందరి ఉద్యోగాలు పోతున్నాయి. ఇది కేవలం ఉద్యోగాల సమస్య కాదు. ఇది మనసు మీద బురద పడే భయాల భూతం. ఇది ఒక ఆర్థిక సంక్షోభం మాత్రమే కాదు. మానవ సంబంధాల సంక్షోభం కూడా.. ఎందుకంటే ఉద్యోగం కోల్పోవడం అనేది కేవలం ఆదాయాన్ని కోల్పోవడమే కాదు. ఒక గమ్యాన్ని, గౌరవాన్ని, జీవన ఉద్దేశ్యాన్ని కోల్పోవడమే. అంత్రోపిక్ సీఈఓ డారియో అమోడీ ప్రకారం.. మరో ఐదేళ్లలో సగం వైట్ కాలర్ ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాల్సిన ఈ తరం ముందు.. ఆదాయానికి తొలి మెట్టు కనిపించకుండా పోతోంది. ఇది చిన్న మార్పు కాదు. ఒక మహా తరంగం. దీన్ని విస్మరించడం, అలమటించడం పరిష్కారం కాదు. పరిష్కారం దిశగా ముందడుగు వేయడమే మార్గం.

**– మానవ మనస్తత్వంపై ముద్ర వేసే ఏఐ ప్రభావం**... ప్రధానంగా మూడు రంగాలలో వ్యక్తులు, వ్యాపార నాయకులు, ప్రభుత్వాలు ఇప్పుడే స్పందించాల్సిన అవసరం ఉంది.

**1. వ్యక్తులు ఏమి చేయాలి?...** మీకు భయంగా ఉంది కదా? నలుగురిలో నలుగురికి ఇదే అనుభూతి. ఇది "ఉద్యోగ భయం" కాదు. ఇది గమనికలేని భవిష్యత్తుపై దుఃఖం. అందుకోసం మొదటి అడుగు ధైర్యంగా వేయాలి. మీ భావాలను గుర్తించండి. మీరు కోల్పోయినది కేవలం జీతం కాదు. మీ కలలు, మీ గుర్తింపు. ఏఐ చేయలేని పనులపై దృష్టి పెట్టండి. విశ్లేషణలు చేయగలిగేది యంత్రమే అయినా, అనుభూతిని అర్థం చేసుకోవడం, నమ్మకాన్ని నింపడం, నైతికతతో వ్యవహరించడం మనుషుల వంతే. ఐటీ స్కిల్స్ కాక, అంతర్దృష్టిని అభివృద్ధి చేసుకోండి. సిస్టమ్స్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలు మీకు లాంగ్‌టర్మ్ బలం. పాత "కేరీర్ లాడర్" ను వదిలేసి, కొత్త దారులు తయారు చేసుకోండి. స్టెబిలిటీ కాదు, ఫ్లెక్సిబిలిటీకి సిద్ధపడండి. బంధాలు పెంచుకోండి. భవిష్యత్తు వ్యక్తిగతం కాదు.. సామూహికం అని గుర్తించండి..

**2. వ్యాపార కంపెనీల అధిపతులు ఏమి చేయాలి?...** ఉద్యోగాల్ని తొలగించడం వల్ల లాభాలొస్తాయనుకుంటే ఒక విషయం గుర్తుంచుకోండి. యంత్రాలు ఎప్పుడూ నమ్మదగ్గవి కావు.. మనుషులే మార్కెట్‌కి ప్రాణం. విజ్ఞతతో కూడిన నాయకత్వం ఈ మార్గాలను చూపుతుంది. గౌరవం కోసం వేరే ఉద్యోగాలను డిజైన్ చేయండి. ఆటోమేట్ చేయలేమా అని కాదు. దానివల్ల ఎవరికి ఉపయోగపడుతుంది? ఎవరిని మర్చిపోతున్నాం? అనే ప్రశ్నలు మీకు మీరు వేసుకోండి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల స్థానంలో అభ్యాస కేంద్రాలు ఏర్పరచండి. లాభాల మార్గంగా కాకుండా మానవతా సామర్థ్యానికి పెట్టుబడులు పెట్టండి. ఓపికగా మాట్లాడండి, భయాల్ని అర్థం చేసుకోండి.. అస్పష్టత అనేది వికాసానికి అవకాశంగా మారాలే కానీ, భయంగా మిగలకూడదు. సిస్టమిక్‌గా ఆలోచించండి. ఉద్యోగుల పునఃప్రారంభం లేకుండా ఎలాంటి వ్యూహాలూ నిలబడవు.

**3. ప్రభుత్వం ఏమి చేయాలి?...** ప్రభుత్వాలు చూస్తూ ఉండకూడదు. ఇది భవిష్యత్తు సమస్య కాదు. ఇప్పుడే ప్రారంభమైపోయింది. ఇప్పుడు కావాల్సిన చర్యలు చేపట్టాలి. ఏఐ ట్రాన్సిషన్ ఎమర్జెన్సీ ప్రకటించండి. వృత్తి మార్పులకు పెద్ద పథకాలతో ముందుకొచ్చే సమయం ఇది. సేఫ్టీ నెట్‌ను ఆధునీకరించండి. జీవితాలు లీనియర్ కాదంటే, బీమా/పదవీ భద్రతలు కూడా కొత్తగా ఆలోచించాలి. ఏఐపై బాధ్యత పెట్టండి. న్యాయం, పారదర్శకత, ప్రభావ విశ్లేషణలతోనే కొత్త టెక్నాలజీకి అనుమతి ఇవ్వాలి. మానవతా కేంద్రంగా ఉన్న ఆవిష్కరణలకు మద్దతివ్వండి. విశ్వాసాన్ని రాబట్టే కథలు చెప్పండి. భవిష్యత్తును నమ్మేలా ప్రజల్లో నూతన నైపుణ్యం తీసుకురండి.

**ఇది మానవతా పరీక్ష!...** ఏఐ వినియోగాన్ని తప్పుడు దిశలో తీసుకెళ్తే, మనం నిర్మించేది ఒక ఎందుకు పనికిరాని శూన్యమైన భవిష్యత్తు. కానీ ఇప్పుడే స్పందిస్తే ధైర్యంగా, దూరదృష్టితో, దయతో మనం సాంకేతికతతో మన మానవత్వాన్ని విస్తరింపజేసే భవిష్యత్తును నిర్మించగలం. "ఏఐ పనిని చేస్తుందా?" కాదు.. "ఏఐతో కూడిన ప్రపంచంలో మనం ఎలా ఉండాలనుకుంటున్నాం?" అనేదే ఇప్పుడు అసలు ప్రశ్న.

# రాయలసీమ మట్టి పరిమళ భరితాలు...కేతు కథలు - జూలై 10...కేతు విశ్వనాథరెడ్డి జయంతి



తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా కథా రంగంలో, కేతు విశ్వనాథరెడ్డి ఒక ధ్రువతార. కథల ద్వారా వాస్తవాన్ని స్పష్టంగా ప్రతిబింబించిన ఆయన రచనలు రాయలసీమ మట్టి పరిమళంతో నిండి ఉంటాయి. ఆయన రచనలు కేవలం సాహిత్య వస్తువుకే పరిమితమవకుండా, సమకాలీన భారతీయ సామాజిక నిర్మాణాన్ని ప్రశ్నించేవిగా, కొత్త ఆలోచనలను తట్టి లేపే తలపుల వలె మారాయి. 1939 జూలై 10న కడప జిల్లాలోని రంగశాయి పురంలో జన్మించిన కేతు విశ్వనాథరెడ్డి, బాల్యంలోనే గ్రామీణ జీవితం యొక్క లోతుల్ని, లోపాల్ని దగ్గర నుంచి చూశారు. ఆ అనుభవాలే ఆయన రచనలకు ప్రాణం పోశాయి. "అమ్మ" అనే కథతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, "అనాది వాళ్లు" అనే కథతో 1963లో సవ్యసాచి పత్రిక ద్వారా రచయితగా అరంగేట్రం చేశారు. పాత్రికేయుడిగా వృత్తి ప్రారంభించి, అనంతరం అధ్యాపకునిగా, పరిశోధకునిగా, పాఠ్య రచయితగా, భాషా శాస్త్రవేత్తగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. కడప జిల్లా గ్రామ నామాలపై చేసిన లోతైన పరిశోధనకు డాక్టరేట్ అందుకోవడం ఆయన పరిశోధనా ప్రగాఢతకు నిదర్శనం. కేతు రచనలలో రాయలసీమ ప్రజల జీవన శైలి, కరువు, ఆకలితో పోరాటం, మత సామరస్యం, పేదరికం, న్యాయాన్యాయాల మధ్య లంకె పడుతున్న సామాన్యుల బతుకు బండలు ధ్వనిస్తాయి. 'జప్తు', 'ఇచ్ఛాగ్ని', 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' వంటి కథా సంపుటులు ఆయన వాస్తవిక దృక్పథానికి నిదర్శనాలు. ముఖ్యంగా "వేర్లు" నవలలో దళిత యువకుడి అభివృద్ధిని అడ్డుకుంటున్న "క్రీమీలేయర్" అనే సంకలిత వ్యవస్థపై వ్యంగ్యంగా, తాత్వికంగా స్పందించారు. "బోధి" నవలలో మధ్య తరగతి జీవితం, ప్రేమ, బాధ్యత, విరక్తి వంటి అంశాలను చక్కగా మేళ వించారు. అతని రచనలు సామాజిక స్పృహతో కూడిన రచనలు. ఒక చోట ఆయన ఇలా వర్ణించారు:

**"విసిరిన మట్టి తడి కాదు, కానీ బూతులా అంటుకుంటుంది**
**దుర్భర జీవితాల దారుల్ని చీల్చలేను, కనీసం ఆ దారుల నొప్పుల్ని**
**వ్రాయగలనన్న నమ్మకమే నా కలం."**

ఇలాంటి సామాజిక బాధ్యత, ప్రజల పట్ల ప్రేమ ఆయన రచనల్లో ప్రతిబింబించేది. కేతు రచనలు హిందీ, ఆంగ్లం, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీ, రష్యన్ వంటి భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆయన వ్యాసాల సంకలనం "దృష్టి", ప్రముఖ కథా రచయితలపై రాసిన "దీప ధారులు" వంటి రచనలు సాహిత్య పరంగా విలువైన మూలాలుగా నిలిచాయి. కొడవటిగంటి కుటుంబరావు రచనలు సంపాదించిన వారు, విశాలాంధ్ర "నూరేళ్ల తెలుగు కథ" సంపుటికి సంపాదకులు, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్ పురస్కారం, రావిశాస్త్రి అవార్డు, తుమ్మల వెంకట రామయ్య బంగారు పతకం, వై ఎస్ ఆర్ జీవన సాఫల్య పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయనకు లభించాయి. ఆయనకు లభించిన గౌరవాలు మానవీయతపై ఆయన కలానికి ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 2023 మే 22న ఒంగోలు పట్టణంలో గుండెపోటుతో ఆయన మృతి చెందారు. తెలుగు సాహిత్య లోకంలో "కథా శిఖరం కూలిపోయింది" అనే మాటలు విరివిగా వినిపించాయి. కేతు విశ్వనాథరెడ్డి రచనలు ఏ కాలానికీ పరిమితం కావు. అవి అనంతమైన మానవ జీవిత ప్రవాహాన్ని వర్ణించే ప్రవాహకథలు. ఆయన రచనలు మనం ఎవరం? మన వాస్తవాలు ఏమిటి? అనే ప్రశ్నలకు అద్దం పడతాయి. ఆయన కథలన్నీ ఎ అనుభవాన్ని మింగిన వాస్తవం, వాస్తవాన్ని వెలికి తీసిన శైలీ, శైలిలో చిరంజీవి అయిన మానవతా వాదం. తెలుగు కథా ప్రపంచానికి కేతు విశ్వనాథరెడ్డి ఒక గొప్ప మార్గదర్శి, రాయలసీమ గొంతు. ఆయన రచనలు తెలుగువారి మనస్సుల్లో దీపధారలుగా వెలిగిపోతూనే ఉంటాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత"

## జాతీయ చేపల రైతుల దినోత్సవం... 'నీలి విప్లవ' స్ఫూర్తి దినం - జూలై 10... జాతీయ చేపల రైతుల దినోత్సవం





ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపు కోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి మరియు డాక్టర్ కె. హెచ్. అలీ కున్హి ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ (%ఎఎజూశీజూష్ట్రఎయ్‌ఱశీఅ%) అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి 'నీలి విప్లవం'కు నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతే కాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం వాటాను కలిగి ఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం 'నీలి విప్లవం'ను మరింత బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (%ూవీమీ%) వంటి పథకాలను ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో %ూవీమీ% కింద దాదాపు ?2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలో మార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగు తున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగు పరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ అసలైన ఉద్దేశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "పరబ్రహ్మ స్వరూపుడు గురుదేవుడు"

**" గురు బ్రహ్మ, గురు విష్ణు గురు దేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"**



ఆషాఢ శుద్ధపౌర్ణమిని 'గురుపౌర్ణమి' లేదా 'వ్యాసపౌర్ణమి' అని అంటారు. గురువును బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపంగా పూజించే ఉత్కృష్టమైన సంస్కృతి మనది. గురువు త్రిమూర్తి స్వరూపుడు. బ్రహ్మల్జ్ఞానాన్ని మనలో పుట్టించి , విష్ణువులా రక్షించి, శివుడిలా అజ్ఞానాన్ని తుంచి మంచి చెడులను విశదీకరించి, మానవతా విలువలు, సద్గుణ సంపన్నతలు ఎలా పొందాలో నేర్పుతాడు. గురు పూర్ణిమను పురస్కరించుకుని గురువులను స్మరించడం వల్ల త్రిమూర్తులను పూజించిన పుణ్యఫలం లభిస్తుంది. ఆది యోగి, ఆది గురువైన మహా శివుడు ఆషాఢ పౌర్ణమి నాడు, సప్తర్షులకు జానబోధ చేశాడని శివపురాణం చెబుతున్నది. ఆషాఢ పౌర్ణమి దత్తాత్రేయుడు తన శిష్యులకు జ్ఞాన బోధ చేసిన రోజుగా దత్త చరిత్ర చెబుతుంది. వ్యాస మహాముని ఈ రోజున సత్యవతీ శంతనులకు జన్మించాడని, కొన్ని సంవత్సరాల తర్వాత ఆయన ఇదే రోజున వేదాలను ఋక్, యజుస్, సామ, అధర్వణ వేదాలుగా విభజించాడనీ ప్రతీతి. ఈ పుణ్య విశేషాలను పురస్కరించుకుని ఆషాడ పౌర్ణమి నాడు గురు పూర్ణిమగా, వ్యాస పూర్ణిమగా జరుపు కుంటాము. మనం ఏ రంగంలోనైనా రాణించాలంటే, అనుకున్నది సాధించాలంటే ఉన్నతంగా ఎదగాలంటే గురువు మార్గదర్శకత్వంలో శిక్షణ అత్యంత అవసరం. నిత్యానిత్యాలను వివరించి, వివేక జ్యోతిని వెలిగించి, ప్రగతి పథంలో నడిపించేవాడు గురువు. అందుకే "కృష్ణం వందే జగద్గురుం" అన్నారు. గీతాచార్యుడైన శ్రీకృష్ణభగవానుడు మనకు ఎన్నో విషయాలను బోధించాడు.

**"దేవానాంచ ఋషీణాంచ గురుంకాంచన సన్నిభం**
**బుద్ధిమంతం త్రిలోకేశం తం నమామి బృహస్పతిం"**

నవగ్రహాలలో గురుగ్రహం ఒకటి. దేవగురువు బృహస్పతి. గురు గ్రహానికి బృహస్పతి అని పేరు. సూర్యుని నుండి 5వ గ్రహం గురు గ్రహం. ఇతర గ్రహాల కంటే దీని బరువు రెండున్నరెట్లు ఎక్కువ. ఆంగ్లంలో గురు గ్రహాన్ని జుపిటర్ అని అంటారు. రోమన్ దేవత్కైన జుపిటర్ పేరు మీదుగా దీనికి ఆ పేరు వచ్చింది. గురుగ్రహం తన చుట్టూ తాను తిరిగి రావడానికి 9గం.50 ని.ల పడుతుంది. సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి 11.86సం.ల కాలం పడుతుంది. గురు గ్రహానికి 16ఉపగ్రహాలు ఉన్నాయి. గురు గ్రహం పసుపు పచ్చగా కనిపిస్తుంటుంది. గురువు అంటే సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడు. గురువు శిష్యులలోని ఆజ్ఞానాంధకారాలను నిర్మూలించి జ్ఞానాన్ని, వెలుగును అందించే వాడు. పురాణాల ప్రకారం దేవతల గురువు బృహస్పతి. సప్త ఋషులలో అంగీరస పుత్రుడు బృహస్పతి. బాల్యంలోనే మహా పండితుడు. బుద్ధిమంతుడైనాడు. వేదాలను కూలంకశంగా అధ్యయనం చేసి, శాస్త్రాలను లోతుగా పరిశీలించి, రూప, గుణ, శీలంతో ప్రకాశించాడు. పరమేశ్వరుడ్కైన శివుని ఆరాధించి అతడిని ప్రసన్నం చేసుకున్నాడు. పరమ పావనమ్కైన కాశిలో శివలింగ ప్రతిష్ఠ చేసి ఘోర తపస్సుచేసి, శివుని అనుగ్రహాన్ని పొందాడు. గురువారం బృహస్పతిని స్మరిస్తూ నామకరణం చేయ బడింది. మానవుల ప్రవర్తనను నిర్ధారించే నవగ్రహాలలో బృహస్పతి ఒకటి. ఇతనికి వాచస్పతి అని మరొక పేరు కూడా ఉంది. కొన్ని వేదము ఋక్కులలో బృహస్పతిని అగ్ని అని భావించారు. గురువు - యజమానులకు పురోహితుడు. దేవతలకు గురువు. గురువు గుణాలకు అతీతుడు. ప్రకృతిలో కనిపించే ప్రతి అంశము మనకు గురువు. గురువు లేకుండా ఏ విద్య రాణించదని శాస్త్ర వచనం. అయోమయ స్థితిలో ఉన్న మనకు ఆనందం మన అంతరాత్మలోనే ఉందని గుర్తు చేసే మహాత్ముడే గురువు. మనం ఏ రంగంలోన్కైనా రాణించాలంటే, అనుకున్నది సాధించాలంటే ఉన్నతంగా ఎదగాలంటే గురువు మార్గ దర్శకత్వంలో శిక్షణ అత్యంత అవసరం. నిత్యానిత్యాలను వివరించి వివేక జ్యోతిని వెలిగించి ప్రగతి పథంలో నడిపించేవాడు గురువు. అందుకే కృష్ణం వందే జగద్గురుం అన్నారు. గీతాచార్యుడ్కైన శ్రీకృష్ణభగవానుడు మనకు ఎన్నో విషయాలను బోధించాడు. భారతీయ సంస్కృతిలో గురువులకు ప్రత్యేకస్థానం ఉంది. యోగ సంప్రదాయంలో పరమ శివుడు ఆదియోగి. గురు సంప్రదాయంలో శివుడే ఆదిగురువు. పరమశివుడు తాండవం చేసే సమయంలో ఆయన చేతి ఢమరుకం నుంచి నాదం(శబ్దం) పుట్టింది. నాదం నుంచి వేదం పుట్టింది. ఈ వేదాన్ని శ్రీ మహా విష్ణువు బ్రహ్మదేవునకు ఉపాదేశించాడు (శివకేశవులకు బేధం లేదు, ఇద్దరూ ఒకే పరమాత్మ యొక్క భిన్న రూపాలు). బ్రహ్మదేవుడు ఈ వేదాన్ని ప్రామాణికంగా తీసుకుని సృష్టి చేశాడు. ఆ తర్వాత ఈ వేదాన్ని బ్రహ్మ దేవుడు తన కుమారుడైన వశిష్ట మహర్షికి, ఆయన తన కూమారుడైన శక్తి మహర్షికి ఉపదేశం చేశాడు. శక్తి మహర్షి తన పుత్రుడైన పరాశర మహర్షికి, ఆయన తన కుమారుడైన వ్యాస మహర్షికి ఉపదేశించాడు. వ్యాస మహర్షి ఆషాఢ పౌర్ణమి రోజున జన్మించాడు కాబట్టి, ఆ రోజుని వ్యాస పౌర్ణమిగా పేర్కొంటారు. వ్యాసుని అసలు పేరు కృష్ణ ద్వైపాయనుడు. నలుపు రంగులో ఉన్నవాడు కాబట్టి కృష్ణ అనీ, ద్వీపం (ద్వైపాయనము) మీద జన్మించినవాడు కాబట్టి ద్వైపాయనుడు అనీ ఆ పేరు వచ్చిందంటారు. అప్పటి వరకూ ఉన్న వేదాలన్నింటినీ ఒక చోటకు చేర్చి, వాటిని నాలుగు భాగాలుగా విభజించాడు కాబట్టి ఈ కృష్ణ ద్వైపాయనుడు 'వేద వ్యాసుడు'గా మారాడు. వేదవ్యాస మహర్షి మానవ జాతికే గురువు. అందుకే ఆయన పేరిట వ్యాస పూర్ణిమ రోజున గురు పూర్ణిమగా పండుగను జరుపుకుంటున్నాం. ఈ రోజున దేశమంతా గురు పూజా మహెూత్సవాన్ని జరుపుకుంటారు. వేదవ్యాసుడు అనగానే మహాభారతం కూడా గుర్తుకు వస్తుంది. వ్యాసుడు మహాభారత రచయితే కాదు, అందులో ఒక ముఖ్య పాత్ర కూడా! అసలు వ్యాసుడు లేనిదే భారతం లేదు. వ్యాసుని కారణం గానే దృతరాష్ట్రుడు, పాండురాజు, విదురులు జన్మించారు. అంటే వ్యాసుడు లేకపోతే కౌరవ పాండవులే ఉండేవారు కాదు! వ్యాసుడు భారతాన్నే కాదు, భాగవతం సహా అష్టాదశ పురాణాలన్నీ రాశాడనీ... యోగ సూత్రాలకు భాష్యాన్ని అందించాడనీ అంటారు. ఇక బ్రహ్మ సూత్రాలను రాసింది కూడా వ్యాసుడే అని చెబుతారు. అంటే హిందూ సంస్కృతికి మూలమైన శాస్త్రాలన్నింటికీ వ్యాసుడు మూల పురుషుడన్నమాట. అలాంటి వ్యాసుని గురుపరంపరకు ప్రతినిధిగా భావించి, ఆయన పుట్టిన రోజుని గురువులను ఆరాధించే గురు పౌర్ణమిగా జరుపుకోవడం ఆచారంగా వస్తున్నది. ఏ వ్యక్తికైనా మొదటి గురువు తల్లే. ఆ తర్వాత మనకు జ్ఞానాన్ని అందించి... ఏది మంచో, ఏది చెడో చెప్పే వారు గురువులు. అలాంటి గురువులను పూజించడం కోసం నిర్ణయించిన తిథి గురు పౌర్ణిమ. "గు" అంటే అంధకారం లేదా అజ్ఞానాన్ని, "రు" అంటే నిరోధించుట లేక నశింప చేయుట అని అర్థం. అంటే గురువు అనే పదానికి అజ్ఞానాన్నినశింప చేయువారు అని అర్థం స్ఫురిస్తుంది. హిందూ సంప్రదాయాలు పాటించే భారతదేశం, నేపాల్, ఇంకా బుద్ధ, జైన సంప్రదాయాలు పాటించే చోట్ల గురు పౌర్ణిమను ఘనంగా జరుపు కుంటారు. ఆషాఢ శుద్ధ పూర్ణిమ రోజున విష్ణుమూర్తి, దత్తాత్రేయ, సాయిబాబా పూజతో పాటు ఆదిశంకరాచార్యుల వారిని కూడా పూజించడం ఆచారం. ఈ రోజున ప్రజలు తమ ఆధ్యాత్మిక గురువులను స్మరిస్తారు. పూజిస్తారు. కట్న కానుకలు ఇస్తారు. గుడికి వెళ్లి ప్రార్థిస్తారు, దేవుళ్ల నుంచి ఆశీర్వాదం తీసుకుంటారు. విద్యార్థి... సంఘానికి "దేహం" వంటివాడైతే గురువు... "ఆత్మ". అటువంటి గురువును ప్రతి యేటా సత్కరించుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల మీదే కాదు, సమాజం మీద కూడ ఉంది. **రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# ఆశలు అడుగంటి...!

మిర్యాలగూడ : వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా ఉమ్మడి జిల్లాలో నీటి జాడ కనపడడం లేదు. సాధారణంగా జులైలో వర్షపాతం పెరగడంతో పాటు భూగర్భ జలాలు పైపైకి వస్తాయి. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు కాగా.. భూగర్భ జలాలు సైతం మరింత కిందకి వెళ్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

**మెరుగైనా..లోలోపలే..**

ఉమ్మడి జిల్లాలో గత మూడు నెలల్లో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భూగర్భ జలాలు మరింత కిందకి పడిపోగా..కొంత పైకి వచ్చినప్పటికీ యాదాద్రి జిల్లాలో భూగర్భ నీటిమట్టం ఆందోళనకరంగానే ఉంది. ఏప్రిల్ నెలతో పోలిస్తే జూన్ నాటికి నల్గొండ జిల్లాలో 0.23 మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోగా.. సూర్యాపేట జిల్లాలో 0.52 మీటర్లు పడిపోయాయి. యాదాద్రి జిల్లాలో 0.02మీటర్ల మేర భూగర్భ జలాలు పైకి వచ్చాయి.

**మూడు జిల్లాల్లోనూ లోటే..**


జూన్ 1 నుంచి ఈ నెల 6 వరకు నమోదైన వివరాల ప్రకారం మూడు జిల్లాల్లోనూ లోటు వర్షపాతమే నమోదైంది. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 32.0శాతం లోటు నమోదు కాగా నల్గొండ జిల్లాలో 18, యాదాద్రి జిల్లాలో 15శాతం సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది. వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. 20శాతం పైగా తక్కువ వర్షపాతం నమోదైతే లోటు వర్షపాతంగా గుర్తిస్తారు. ఈ గణాంకాల ప్రకారం..సూర్యాపేట జిల్లా లోటు వర్షపాతం నమోదైన జిల్లాల జాబితాలో ఉంది.



నల్గొండ జిల్లాలో 33 మండలాలకు మర్రిగూడ మండలంలో 61 శాతం, చింతపల్లి 39, గుండపల్లి 29, దేవరకొండలో 21శాతం అదనపు వర్షపాతం నమోదు కాగా మొత్తం 16 మండలాల్లో సాధారణ, మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనుముల 63, నిడమనూరు మండలంలో 61శాతం తక్కువ నమోదైంది. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలకు 6 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా..మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అధిక వర్షపాతం ఎక్కడా నమోదు కాలేదు. యాదాద్రి జిల్లాలోని మొత్తం 17 మండలాలకు గాను 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. నారాయణపురం మండలంలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 108శాతం అధికంగా నమోదవగా చౌటుప్పల్‌లో 63శాతం, రాజాపేట మండలంలో 24శాతం అదనంగా వర్షం కురిసింది.

# కూలిన కరకట్ట రక్షణ గోడ..!

భద్రాచలం : భద్రాచలం పట్టణాన్ని గోదావరి వరదల నుంచి రక్షించేందుకు ఏర్పాటుచేసిన కరకట్ట పలుచోట్ల దెబ్బతింది. తాత్కాలిక మరమ్మతులతో ఎప్పటికప్పుడు సరిపెడుతున్నా రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి 50మీటర్ల మేర రక్షణ గోడ కూలిపోయింది. కూలిన భాగం కొంత ఏపీ పరిధిలో ఉంది. ఇప్పటికిప్పుడు నష్టం లేకున్నా భారీ స్థాయిలో వరదొస్తే మన వైపు ఇబ్బందికర పరిస్థితులుంటాయని నిపుణులంటున్నారు. 1986, ఆగస్టులో 75.6 అడుగుల వరద రావడంతో భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. జనజీవనం అస్తవ్యస్తమై పెను నష్టం సంభవించింది. స్పందించిన ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను గుర్తించి కరకట్ట నిర్మాణం చేపట్టింది. 80 అడుగుల వరదొచ్చినా ముంపు తలెత్తకుండా భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపం నుంచి ఎటపాక వరకు కరకట్ట నిర్మించారు. తర్వాత అడపాదడపా మరమ్మతులు చేస్తున్నా అవి తాత్కాలిక అవసరాల మేరకే ఉండేవి. రెండ్రోజుల క్రితం నది వైపున కరకట్ట రక్షణ గోడ దాదాపు 50 మీటర్ల మేర కూలింది. ఈ ప్రదేశం ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో ఉంది. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు 5 కి.మీ పొడవైన కట్ట తెలంగాణలో ఉండగా మిగతా ప్రాంతం ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధికి వెళ్లింది. గోడ కూలిన విషయాన్ని రంపచోడవరంలోని ఇరిగేషన్ అధికారులకు సమాచారం



చేరవేసినా వారు ఇటుగా చూడలేదు.

**అప్రమత్తతే రక్ష**

నూతన బ్రిడ్జి సమీపం నుంచి ఎటపాక వరకు కరకట్ట 3 కి.మీ పొడవు ఉంది. దీని అంచున రక్షణ గోడ ఉంటుంది. ఇది కరకట్ట కంటే 3అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇప్పుడిందులో కొంత గోడ కూలింది. పలుచోట్ల ఒరిగిపోయింది. సీసీ రహదారికి భారీగా గుంతలు పడ్డాయి.ఏపీ అధికారుల అనుమతి లేకుండా కూలిన చోట మరమ్మతులు చేస్తే సాంకేతిక చిక్కులు వస్తాయని భద్రాచలం ఇరిగేషన్ అధికారులు తటపటాయిస్తున్నారు.

భద్రాచలం-ఎటపాక మధ్య మేడువాయి వాగుకు వరద చేరితే ఆ నీరు విరిగిపడిన గోడ వైపున స్లూయిస్‌కు చేరుతుంది. అదే జరిగితే ఇబ్బందవుతుంది. మరమ్మతులకు సుమారు రూ.10 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. రెండు ప్రభుత్వాలు సమన్వయంగా పూర్తి చేయాలి.'కరకట్ట స్లూయిస్‌లకు మరమ్మతులు చేయిస్తున్నాం. సీసీ రహదారిని బాగు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఎటపాక వైపున కొంత గోడ ఒరిగిపోగా, కొద్దిగా విరిగింది. ఏపీ అధికారులకు సమాచారం చేరవేశాం. ప్రస్తుతానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.' వెంకటేశ్, ఇరిగేషన్ ఏఈ.

# సుందరీకరణ మాటున నిధుల వృథా



ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని తమ్మళ్లకుంట చెరువును గతంలో రూ.లక్షలు వెచ్చించి సుందరీకరణ చేసినా.. నిర్వహణ లేక అధ్వానంగా మారింది. ఎటుచూసినా పిచ్చి మొక్కలు, బురదతో నిండి మురుగు కూపంగా మారింది. గతంలో రూ.50 లక్షల వ్యయంతో కట్ట ఎత్తు పెంచారు. లోపల పూడిక తీసి నీరు నిలువ ఉండేలా చేశారు. కట్టకు రాతి కట్టడం, కిందికి పైపులద్వారా నీరు నిలవడంతోపాటు, ఇనుప జాలీలను ఏర్పాటుచేశారు. ఆహ్లాదకరంగా ఉండేలా పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు.

**ఎకరం స్థలం అన్యాక్రాంతం**

ఈ చెరువుకు సమీపంలోనే అక్కన్న మాదన్నలచే నిర్మితమైన పెద్ద బావి ఉంది. శాసనాలు కూడా ఇందులో లభ్యమయ్యాయి. ఇందులోని పూలను నరసింహస్వామికి సమర్పించేవారు. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం గల ఈ కుంట నిర్లక్ష్యం కారణంగా వట్టిపోతోంది. దీని కింద ఒక ఎకరం వరకు స్థలం అన్యాక్రాంతమైంది.

**మూణ్నాళ్ల ముచ్చట**

మొదట్లో కొన్నేళ్లపాటు పురపాలిక నిర్వహణ చేపట్టినా ఆ తర్వాత వదిలేశారు. రక్షణగా ఏర్పాటుచేసిన కంచె చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. మురుగు కాలువలను నిర్మించినా.. చెత్త పేరుకుపోయి కాలువలో నిలిచిపోతోంది. సగం వరకు విద్యుత్తు దీపాలు వెలగడంలేదు. లోపల నాచు, పిచ్చి మొక్కలు పెరిగాయి. చుట్టూ ఫుట్‌పాత్ నిర్మించినా.. నడవడానికి వీలు లేకుండా అపరిశుభ్రంగా ఉంటోంది. రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాగా మారింది.

**ఇలా చేస్తేనే పూర్వ వైభవం**

ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలి. తమ్మళ్లకుంటకు మిషన్ భగీరథ నీటి పైపులైను ద్వారా శుభ్రమైన నీటిని అందించాలి. కాలువ వద్ద లీకేజీలను తొలగించాలి. విద్యుత్తు దీపాలకు మరమ్మతు చేయాలి. ఆహ్లాదకరంగా ఉండేందుకు పూల కుండీలను ఏర్పాటుచేసి మొక్కలు నాటించాలి. సుందరీకరణ, తమ్మళ్లకుంట చరిత్రను తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలి. దీనిపై పురపాలక కమిషనర్ శ్రీనివాస్‌రావును ' వివరణ కోరగా.. స్వచ్ఛత పనులు చేపడతామన్నారు.

# మరో 30 మిలియన్ టన్నులు



గోదావరిఖని: సింగరేణి సంస్థ 30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి పెంచుకునేందుకు ప్రణాళికలు చేసింది. కొత్త గనులను ఈ ఏడాది అందుబాటులోకి తేవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే వివిధ స్టేజీల్లో అనుమతుల కోసం ఎదురు చూస్తున్న విస్తరణ గనులను ప్రారంభించేందుకు సిద్ధం చేసుకుంటుంది. వీటి ద్వారా బొగ్గు ఉత్పత్తి పెంచుకొని మార్కెట్‌లో మరింత విస్తరించేందుకు ప్రణాళికలు చేసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరం 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్న సింగరేణి భవిష్యత్తులో 100 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం సంస్థ పరిధిలో ఉన్న విస్తరణ గనులను ప్రారంభించడం ద్వారా ఉత్పత్తి పెరిగి వినియోగదారులకు సరిపడా బొగ్గును అందించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తోంది.

**నెలాఖరులో వీకే ఓసీపీ పనులు**

ఈ నెలాఖరులో కొత్తగూడెం వీకే ఓసీపీ పనులుప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈ గనికి సంబంధించిన పర్యావరణ అనుమతులతో పాటు ప్రభుత్వం నుంచి క్లియరెన్సు రావడంతో ఈనెల చివరలో పనులు ప్రారంభించే పనిలో పడింది. గని ప్రారంభించడం ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. గతంలో భూగర్భ గని ద్వారా ఉత్పత్తి చేసిన ఈ గనిని ఉపరితల గనిగా విస్తరిస్తున్నారు. ఓసీపీ ద్వారా బొగ్గు ఉత్పత్తి అధికంగా వెలికి తీసే అవకాశం ఉండటంతో ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు చేసుకుంది. దీంతో పాటు ఇల్లెందు ప్రాంతంలోని జేకే ఓసీపీ, బెల్లంపల్లి రీజియన్‌లోని గోలేటి ఓసీపీలను కూడా ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు దృష్టి సారించింది. ప్రస్తుతం వీటికి పర్యావరణ అనుమతులు రావాల్సి ఉండటంతో దాని కోసం వేగంగా ప్రయత్నాలు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ రెండు గనులు అందుబాటులోకి వస్తే 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉంది. వీటితో పాటు మదారం ఎంవీకే ఓసీపీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీని ద్వారా మరో 3 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టనుంది.

**నైనీ ప్రధానం**


సింగరేణికి ప్రస్తుతం మెగా ఓసీపీ ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు. దీని ద్వారా ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టనుంది. కొత్తగా ప్రారంభించే గనులతో పాటు నైనీ ద్వారా సింగరేణికి 30 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులోకి రానుంది. దీంతో సింగరేణి సంస్థ ఏటా 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సులువుగా చేరుకునేందుకు అడుగులు వేస్తోంది.

# చినుకులే తప్ప వరదలేవీ!

సిరిసిల్ల: వానాకాలం సాగు సీజన్ మొదలై 35 రోజులవుతున్నా.. పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకెళ్లడం లేదు. అడపాదడపా కురుస్తున్న చినుకులతో రైతుల్లో వణుకు మొదలవుతోంది. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. వరుణుడిపై ఆశతో ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న విత్తనాలు భూమిలో విత్తుకున్నారు. బోరుబావుల కింద వరినారు పోసుకున్నరైతులు అవి ఎదగడంతో నాట్లు వేస్తున్నారు. చెరువులు, కుంటలు, జలాశయాల ఆయకట్టు పరిధిలోని వారు పొడిదుక్కుల్లో నారుపోసుకుని వర్షాలు కురిసి, జలాశయాలు నిండాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

**పడిపోయిన నీటి నిల్వలు**

వ్యవసాయశాఖ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి జులై 5 వరకు ఉమ్మడి జిల్లాలో 604.65 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాలి. ఇప్పటికీ 497.4 మిల్లీమీటర్లు కురిసింది. ఇలాగే సాగితే పంటనష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. జలాశయాల్లోనూ నీటినిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఉమ్మడి శ్రీరాంసాగర్‌లో 16.41 టీఎంసీలు ఉంది. బాబ్లీ గేట్లు ఎత్తడంతో ఆరువేల క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. మధ్యమానేరులో 6.92, దిగువమానేరులో 6.32, ఎల్లంపల్లిలో 8.61 టీఎంసీలు మాత్రమే ఉంది. ఇక భూగర్భజలాల విషయానికొస్తే జగిత్యాల 5.68 మీటర్లు, పెద్దపల్లి 6.63, కరీంనగర్ 8.78, సిరిసిల్ల 11.01 మీటర్ల లోతుల్లో



ఉన్నాయి. పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఆశాజనకంగానే ఉన్నాయి.

**తగ్గిన సాగు విస్తీర్ణం**

ఉమ్మడి జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న మూడు ప్రధాన పంటలు కలిపి 12 లక్షల సాధారణ సాగు విస్తీర్ణంగా వ్యవసాయశాఖ అంచనా. దీనిలో అత్యధికంగా 9.51 లక్షల ఎకరాల్లో వరిసాగు అంచనా. గతేడాది ఇదే సమయానికి 8,307 ఎకరాల్లో వరినాట్లు పూర్తవగా ప్రస్తుతం 7,559 ఎకరాల్లో నాట్లు అయ్యాయి. మొక్కజొన్న 47 వేల ఎకరాలు అంచనాకు ఇప్పటికీ 25,876 ఎకరాల్లో విత్తుకున్నారు. పత్తి సాగు 2.02 లక్షల ఎకరాల అంచనా. గతేడాది ఈ సమయానికి 1.28 లక్షల ఎకరాల్లో విత్తనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం 84,413 ఎకరాలు మాత్రమే విత్తుకున్నారు. బోరు, వ్యవసాయ బావుల కింద సాగుచేసిన ఆరుతడిపంటలకు నీటితడులు అందిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

# సేవలు మెరుగు..!

సూర్యాపేట : పురపాలికల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. మున్సిపాలిటీల్లో వార్డు కార్యాలయాల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. తొలుత యాదాద్రి జిల్లాలో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేయాలని పాలకులు నిర్ణయించారు. దశలవారీగా అన్ని జిల్లాలకు విస్తరించాలన్నది ప్రధాన లక్ష్యం. జిల్లాలోని ఐదు పురపాలికలు ఉండగా 141 వార్డులున్నాయి. అన్ని పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. త్వరలో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

**జవాబుదారీగా ఉండాలని..**

ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి ఆయా విభాగాలకు సిఫారసు చేయనున్నారు. వార్డు కౌన్సిలర్, ఛైర్మన్ల పర్యవేక్షణ సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సమాధానం దొరకనుంది. మొత్తంగా పట్టణాల్లో ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి మరింత జవాబుదారీగా



ఉండాలని ప్రభుత్వం సరికొత్త తరహాలో పాలనకు శ్రీకారం చుడుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వెంటనే ఏర్పాటు చేస్తామని పుర అధికారులు 'న్యూస్‌టుడే'తో పేర్కొంటున్నారు.

**త్వరలో పురపాలికల్లో వార్డు కార్యాలయాలు**

వార్డు కార్యాలయం ఏర్పాటు చేసి అధికారిని నియమిస్తే వార్డు సభ్యుని పర్యవేక్షణలో పాలన సాగనుంది. అధికారి రోజు తన పరిధిలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి మురుగు కాల్వల పరిశుభ్రత, పచ్చదనం, నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ, కూరగాయలు, మాంసం దుకాణాల వద్ద పారిశుద్ధ్యం, పింఛన్ల పంపిణీ పథకాల పర్యవేక్షణ చేపడుతుంటారు. ఫలితంగా దాదాపు 90శాతం వరకు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించే అవకాశం ఏర్పడుతుంది. అంతేకాక జూనియర్ అసిస్టెంట్, శానిటేషన్ సిబ్బంది, బిల్ కలెక్టర్, జవాన్ తదితర విధులు నిర్వహించే అధికారులందరూ ప్రతి రోజు వార్డు కార్యాలయానికి వచ్చి హాజరువేయనున్నారు.

# రక్తమోడేదెందుకు..?

కొత్తగూడెం : భద్రాద్రి జిల్లా పరిధిలోని జాతీయ, అంతర్రాష్ట్ర రహదారులపై ఈ ఆరు నెలల వ్యవధిలో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో 141మంది మృత్యువాతపడ్డారు. ప్రమాద స్థలాల్లో కనీస సూచికలు లేకపోవటం ఓ కారణమైతే నిర్లక్ష్యం, అతి వేగం ప్రధాన కారణాలని పోలీసు అధికారులు నిర్ధారించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 33 బ్లాక్‌స్పాట్స్ గుర్తించారు. రవాణా శాఖ, ఎన్‌హెచ్, ఎస్‌హెచ్ అధికారులతో కలెక్టర్, ఎస్పీలు సమీక్ష చేపట్టారు. ప్రమాదాలు సంభవించకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు శాఖాపరంగా తీసుకోవాల్సిన చర్యలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే కొత్తగూడెం బైపాస్ రహదారి నిర్మాణంతో సగానికి సగం బ్లాక్‌స్పాట్స్ తగ్గిపోతాయి. పాల్వంచ నవభారత్ నుంచి కొత్తగూడెం మీదుగా విద్యానగర్ బైపాస్ వరకు బ్లాక్‌స్పాట్స్ లేకుండా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చు.

ఎన్‌హెచ్-30లో ప్రమాద స్థలాలు ఎక్కడెక్కడంటే..!

కొత్తగూడెం 2టౌన్ పీఎస్: అంబేడ్కర్ నగర్ నుంచి పెనగడప సెంటర్, 4 ఇంక్లైన్ నుంచి రామవరం సెంటర్.

కొత్తగూడెం 1టౌన్: పోస్టాఫీస్ సెంటర్ నుంచి బస్టాండు వరకు.

కొత్తగూడెం 3 టౌన్: వసుంధర షాప్ నుంచి ఉర్దూఘర్ వరకు..

లక్ష్మీదేవిపల్లి: ముర్రేడు వాగు నుంచి చాతకొండ క్రాస్‌రోడ్డు, ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి రేగళ్ల క్రాస్‌రోడ్డు.

పాల్వంచ టౌన్: కలెక్టరేట్ నుంచి ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి, పాత పాల్వంచ



నుంచి అయ్యప్పస్వామి టెంపుల్ వరకు, సీసీ కాలనీ గేట్ నుంచి జీసీసీ గోదాము వరకు.

పాల్వంచ రూరల్: జగన్నాథపురం, కేశవాపురం, ఆర్‌టీఏ చెక్‌పోస్టు, నాగారం, రంగాపురం

బూర్గంపాడు: పినపాక పట్టినగర్, ఎంపీ బంజర, సారపాక సెంటర్, గోదావరి బ్రిడ్జి నుంచి సారపాక వరకు

భద్రాచలం టౌన్: గోదావరి బ్రిడ్జి ప్రవేశం నుంచి ఫారెస్టు చెక్‌పోస్టు

దమ్మపేట: గట్టుగూడెం, ముష్టిబండ గ్రామ చెరువు వద్ద, మందలపల్లి ప్రభు నర్సరీ దగ్గర..

నారంవారి గూడెం క్రాస్‌రోడ్డు, అశ్వారావుపేట రింగ్ సెంటర్.

ఎస్‌హెచ్-12 రహదారులపై ఎక్కడెక్కడంటే..

సుజాతనగర్ మండల పరిధిలోని నాయకులగూడెం, సుజాతనగర్ సెంటర్, వేపలగడ్డ.

చుంచుపల్లి మండల పరిధిలో విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు నుంచి సాయిబాబా టెంపుల్ వరకు, చుంచుపల్లి పాత పోలీస్ స్టేషన్ నుంచి బాబుక్యాంపు వరకు.

'జిల్లా వ్యాప్తంగా గుర్తించిన బ్లాక్‌స్పాట్స్‌లో పోలీసు శాఖాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిస్తాం. వాహనదారులు ఆ ప్రదేశాలను గుర్తించే విధంగా సంబంధిత శాఖల అధికారులతో కలిసి అవసరమైన సూచనల బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. నిత్యం డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేసి మందుబాబుల చేష్టలకు అడ్డుకట్ట వేస్తాం. ప్రమాదాలను నివారిస్తాం.'

**బి.రోహిత్‌రాజు, ఎస్పీ**

జాతీయ రహదారి పొడవు: 159 కి.మీ.

అంతర్రాష్ట్ర, జిల్లా: 1200 కి.మీ.

2025 జూన్ వరకు ప్రమాదాలు ఇలా..

మొత్తం ప్రమాదాలు: 311

మృతులు: 141

క్షతగాత్రులు: 272

తాజాగా అధికారులు గుర్తించిన బ్లాక్ స్పాట్స్: జాతీయ రహదారి-30: 19 ఎస్‌హెచ్ రహదారి-12పై: 5

ఇతర రహదారులు: 9

కొత్తగూడెం బైపాస్ పరిధిలో బ్లాక్‌స్పాట్స్: 11

# జల్లు పడితే ఒళ్లు ఝల్లు

హైదరాబాద్: వానాకాలం ప్రారంభమైంది. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. నిమోనియా, అస్తమా, డయేరియా, హెపటైటీస్, టైఫాయిడ్ వంటివి విజృంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఇంటి వద్ద ఉంటే చిన్నారుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం నిలోఫర్‌కు నిత్యం జలుబు, దగ్గుతోపాటు ఒకరిద్దరు డెంగీతో చికిత్స కోసం వస్తున్నారు. గతేడాది రాష్ట్రంలో 10 వేలకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి.

**పగలు కుట్టే దోమతో...**

డెంగికి కారణమయ్యే టైగర్ దోమ పగటి పూట ఎక్కువగా కుడుతుంది. పాఠశాలల చుట్టూ నీరు నిల్వ ఉండటం, కొబ్బరి చిప్పలు ఇతర చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల ఈ దోమలు ఎక్కువగా ఉంటాయి. దోమ కుట్టిన వారం రోజుల్లో తీవ్ర జ్వరం ప్రారంభమై 4-5 రోజులపాటు కొనసాగుతుంది. తగ్గిన తర్వాత 72 గంటలు చాలా



కీలకం. ప్లేట్‌లెట్లు తగ్గుతుంటాయి. రక్తంలోని ప్లాస్మా లీకేజీ అత్యంత ప్రమాదకరం. రక్తపోటు తగ్గిపోయి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. ముఖం, కాళ్లు, పొట్ట ఉబ్బడం, తీవ్రమైన నీరసం, కాళ్లు, చేతులు చల్లబడటం తదితర లక్షణాలు ప్లాస్మా లీకేజీగా గుర్తించాలి. జలుబు, దగ్గు లేకుండా వచ్చిన తీవ్రమైన జ్వరాన్ని డెంగీగానే అనుమానించాలని వైద్యులు చెబుతున్నారు.

**ఆ సమయంలో పాఠశాలకు పంపొద్దు**

వానాకాలంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే తగ్గేవరకు పాఠశాలకు పంపొద్దు. ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. బయట ఆహారం కాకుండా ఇంట్లో వేడిగా తయారు చేసి పెట్టాలి. 4-5 రోజులైనా తగ్గని జ్వరం, నీరసం, కడుపులో నొప్పి, వాంతులు, వీరేచనాలు వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి. కాచి, చల్లార్చిన నీటినే తాగించాలి. కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరింపచేయాలి. ఉషారాణి, చిన్నపిల్లల వైద్యులు, నిలోఫర్ ఆసుపత్రి

# తాగునీటికి తడబడి

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సరఫరా ప్రధాన సమస్యగా మారింది. శుద్ధజలం అందించాలని ప్రభుత్వం యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని పాఠశాలలకు ప్రత్యేకంగా పైపులైన్ వేసి నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలల్లో సరఫరాకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. చౌటుప్పల్‌లోని దివీస్ సంస్థ జిల్లాలో 565 పాఠశాలలకు నీటి శుద్ధి ఫిల్టర్లను సమకూర్చింది. మరమ్మతులు లేక 125 పనిచేయడం లేవని విద్యాశాఖ అధికారుల లెక్క. జిల్లాలో 100కు పైగా సర్కారు బడుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కృష్ణా నీటి కోసం భగీరథ ట్యాంకు నిర్మించారు. నీటిని నింపడం



లేదు. పాఠశాల వెనుకభాగంలో మరో ట్యాంకులోకి కృష్ణానీటిని నింపుతున్నారు. ఆ నీళ్లను దివీస్ లేబొరేటరీస్ సరఫరా చేసిన ఫిల్టర్‌లో శుద్ధి చేసి వంటకు ఉపయోగిస్తున్నారు. విద్యార్థులు ఇంటి నుంచి సీసాలు తెచ్చుకుంటున్నారు. ఆలేరు మండలం కొలనుపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 306 మంది విద్యార్థులున్నారు. భగీరథ నీటిసరఫరా ఉన్నా విద్యార్థులు వాటిని తాగేందుకు ఇష్టపడటం లేదు. గతంలో 'దివీస్' ఇచ్చిన రెండు వాటర్ ఫిల్టర్లలో ఒకటి పనిచేయడం లేదు. మోత్కూరు పురపాలికలోని ప్రభుత్వ పాఠశాలల్లో దివీస్ ఫిల్టర్ల నుంచి వచ్చిన నీరే విద్యార్థుల దాహం తీరుస్తోంది.

యాదగిరిగుట్ట మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఎక్కువ శాతం విద్యార్థులు ప్లాస్టిక్ సీసాలనే వినియోగిస్తున్నారు. నీటి ట్యాంకులు కడగక, మూతలు పగిలి, గాలికి లేచిపోయి, కోతులు వాటిని తొలగించడం వల్ల నీరు కలుషితంగా మారుతున్నాయి.

ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహాడ్ ఉన్నత పాఠశాలకు గ్రామ మిషన్ భగీరథ ట్యాంకు దూరంగా ఉండటంతో నీరు సరఫరా కావడం లేదు. పంచాయతీ ట్యాంకర్‌తో సంపు నింపుతున్నారు. దివీస్ ఆర్వో వాటర్ ఫిల్టర్ దెబ్బతింది. గ్రామ పంచాయతీ నీటిశుద్ధి కేంద్రం నుంచి పాఠశాల అటెండర్ నిత్యం మూడు నీటి క్యాన్లను తెస్తున్నారు.

**స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నాం**

-సత్యనారాయణ, డీఈవో, యాదాద్రి భువనగిరి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నీటి సదుపాయం కల్పించాం. కొన్ని పాఠశాలల్లో దివీస్ సంస్థ సమకూర్చిన ఫిల్టర్లు పనిచేయడం లేదు. పాఠశాలలు తెరవడానికి ముందే ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాం. అన్ని చోట్ల పైకప్పులు ఏర్పాటు చేస్తున్నాం.

# విదేశాలకు పార్సిల్ పంపాలా? తపాలా ఉందిగా!

హైదరాబాద్: ఇంటి నుంచి ఏ వస్తువునైనా వేరే దేశానికి పంపించడానికి కేంద్ర ప్రభుత్వం 'పోస్టాఫీసు డాక్ నిర్యత్ కేంద్రం' ద్వారా సేవలు అందిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా ఉత్పత్తులను ఎయిర్ పార్శిల్, స్పీడ్‌పోస్ట్, ఐటీపీఎస్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎగుమతి చేయవచ్చు. నగరంలోని జనరల్ పోస్టాఫీస్ (జీపీవో)లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

**ప్రత్యేకతలు ఇవి..**

ఉత్పత్తి నమూనాలు తీసుకురావాల్సిన అవసరం లేదు.

ఎగుమతి పోస్టల్ బిల్లు నేరుగా దాఖలు చేయక్కర్లేదు. వెబ్సైట్‌లో పోస్టల్ బిల్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ (పీబీఈ)లో అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది.

కస్టమ్ హౌస్ ఏజెంట్, కస్టమ్ అధికారిని కలవాల్సిన అవసరం ఉండదు.

కస్టమ్ తనిఖీ తర్వాత పీబీఈని పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఏవైనా విచారణలు, అభ్యర్థించిన పత్రాలకు నోటిఫికేషన్లు పోర్టల్‌లో అందుతాయి. వాటికి కావాల్సిన పత్రాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు.

ఈ-పోర్టల్ ద్వారా వస్తువు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు.

జీపీవోలో డాక్ నిర్యత్ కేంద్రం ద్వారా సేవలు

అంతర్జాతీయ స్పీడ్‌పోస్ట్ పార్శిల్ (ఈఎంఎస్): ఒక్కో పార్శిల్ 35 కేజీల వరకు, తక్కువ ఖర్చుతో 106దేశాలకు పంపించవచ్చు.

అంతర్జాతీయ ట్రాక్ చేయబడిన ప్యాకెట్ సర్వీస్(ఐటీపీఎస్): రెండు కిలోల వరకు పార్సిళ్లను ఆసియా పసిఫిక్ రీజియన్, యూఎస్‌ఏ పరిధిలోని 39 దేశాలకు చాలా తక్కువ ధరకు పంపించే వీలుంది.

ఎగుమతులకు సులభ మార్గం జీఎస్టీ నంబరు ఉన్న వారు ఇతర దేశాలకు ఏవైనా వస్తువులు సులభంగా ఎగుమతి చేసుకోవడానికి ఈ డీఎన్‌కేలు ఉపయోగపడతాయి.

ప్రసాద్, ఛీఫ్ పోస్ట్‌మాస్టర్, హైదరాబాద్ జీపీవో

**రిజిస్ట్రేషన్ ఇలా..**

ఎగుమతిదారు %https://dnk.cept.gov.in/customers.web%/ పోర్టల్ ఓపెన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక ఒక ఐడీ వస్తుంది. ఆ కోడ్ ద్వారా పాన్ / జీఎస్టీ నంబరు, అవసరమైన ఇతర పత్రాలు పూర్తి చేయాలి. తరవాత పంపించే వస్తువుల వివరాలను పోర్టల్‌లోని పీబీఈలో ఎంటర్ చేస్తే పీబీఈ నంబర్ వస్తుంది. ఆయా వస్తువులను దగ్గరలోని డీఎన్‌కేకి తీసుకెళ్తే ఓ లేబుల్(సీఎన్22, సీఎన్23 కస్టమ్స్ డిక్లరేషన్)తో ఉంచి విదేశీ పోస్టాఫీస్‌కు పంపిస్తారు. అక్కడ పరీక్షించి అవసరమైన పత్రాలను అడుగుతారు. అన్నీ అయిన తర్వాత వస్తువు ఎగుమతికి లెట్ ఎక్స్‌పోర్టు ఆర్డర్‌ను ఇస్తుంది. దాన్ని పీబీఈ కస్టమర్ ఐడీలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# ముం'చెత్త'తోంది



హైదరాబాద్: ప్లాస్టిక్ వ్యర్థాలు నగరాన్ని ముంచేస్తున్నాయి. నాలాల్లో వరద ప్రవాహం సాఫీగా సాగట్లేదు. దీంతో వందలాది కాలనీలు, రహదారులను ముంచెత్తుతోంది. చిన్న వానకే వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. కల్వర్టులు, మ్యాన్‌హోళ్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహోపకరణాలు పేరుకుపోవడంతో వరదంతా ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ప్రజల నిర్లక్ష్యం.. బల్దియా పర్యవేక్షణ లేకపోవడంతో ప్లాస్టిక్ ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది.

**40శాతం ప్లాస్టిక్, గృహోపకరణాలే..:** ఏటా వేల టన్నుల కొద్దీ పూడిక తీస్తుంటారు. అందులో 40శాతం ప్లాస్టిక్, గృహోపకరణాల వ్యర్థాల లెక్క తేలుతున్నాయి. రోజువారీ చెత్తలోనూ దాదాపు 20శాతం ప్లాస్టిక్ వ్యర్థాలుంటున్నాయి. వాటిలో పీపీ(పాలిథిలీన్), పీఈ(పాలిప్రొపెలిన్), సాధారణ కవర్లు, ఎక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు(హెచ్‌డీపీఈ), తక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు(ఎల్‌డీపీఈ), వ్యర్థాలు ఉంటున్నాయి.

**పూడికతీతలో అవినీతి..:** పూడికతీత పనుల్లో అవినీతి పేరుకుపోయింది. పనిచేయకుండా గుత్తేదారులు, ఇంజినీర్లు నిధులు పంచుకుంటున్నారు. దాంతో.. సగానికిపైగా మ్యాన్‌హోళ్లు, భూగర్భ వరద కాలువలు, కల్వర్టులు పూడిపోతున్నాయి.

ఎక్కడ తవ్వినా అవే : హైడ్రా ఆధ్వర్యంలో నాలాలు, మ్యాన్‌హోళ్లలోని వ్యర్థాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఏ మ్యాన్‌హోల్ తెరిచినా పైపులైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి.

**అమలవ్వని నిషేధాజ్ఞలు..**

రాష్ట్ర వ్యాప్తంగా 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై నిషేధం ఉంది. జీహెచ్ఎంసీ నిషేదాజ్ఞలను అమలు చేయకపోవడంతో వందలాది ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. బల్దియా కార్యాలయాల్లో, అధికారుల నివాసాల్లోనూ ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. రోజుకు ఉత్పత్తయ్యే చెత్త 8 వేల టన్నులు. అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇలా..

పీపీ 1.24%

పీఈ 0.84%

కవర్లు 11.53%

హెచ్‌డీపీఈ 0.83%

ఎల్‌డీపీఈ 0.80%

ఇతర 1.66%

# అమృత్ పనులు జోరందుకునేనా?



పెద్దపల్లి: పెద్దపల్లిలో ఏడాదిన్నరగా సాగుతున్న అమృత్ భారత్ పనులు ముందుకు సాగడం లేదు. జిల్లా కేంద్రంలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ప్రతిపాదనలకు మోక్షం దక్కలేదు. రామగుండంలో చేపట్టిన అమృత్‌స్టేషన్ పనులు కొలిక్కి రావడం లేదు. ఈ క్రమంలో ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించిన సందీప్ మాథూర్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రామగుండం స్టేషన్, ఆర్‌వోహెచ్ డిపోను పరిశీలిస్తారు. 2.10 గంటలకు పెద్దపల్లిలో జరుగుతున్న అమృత్‌భారత్ పనుల పురోగతిని తెలుసుకుంటారు. అనంతరం కాజీపేటకు వెళ్తారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న రైల్వే సమస్యలపై కథనం.

**ముందుకు సాగక..**

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో రూ.26.49 కోట్లతో చేపట్టిన అమృత్ భారత్ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రెండుసార్లు స్టేషన్ నమూనాను మార్చారు. కొత్త భవన నిర్మాణం కోసం పాత భవనం కూల్చివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో ప్లాట్‌ఫాంపై శౌచాలయం లేదు. టికెట్ బుకింగ్ కోసం నిర్మించిన తాత్కాలిక షెడ్డు నుంచి ప్లాట్‌ఫాం మీదకు వెళ్లేందుకు కవరింగ్ షెడ్లు, దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు, వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. రామగుండంలో చేపట్టిన అమృత్‌భారత్ పనులు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి స్టేషన్‌లో క్రమంగా రైళ్ల హాల్టింగ్‌లు ఎత్తివేయడంతో ఈ ప్రాంతంలోని పది గ్రామాల ప్రజలకు రైలు సౌకర్యం లేకుండా పోయింది.

**నత్తనడకన ఆర్వోబీ నిర్మాణాలు**

పెద్దపల్లిలోని కూనారం ఆర్వోబీ పనులు 2022లో మొదలవగా భూసేకరణ జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి వద్ద చేపట్టిన ఆర్వోబీ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. పెద్దపల్లి స్టేషన్‌పై ఒత్తిడి తగ్గించేందుకు నిర్మించిన బైపాస్ రైల్వే లైన్ నిర్మాణం జరిగినప్పటికీ కమిషనింగ్(ట్రయల్ రన్) జరగకపోవడంతో వినియోగంలోకి రాలేదు. బైపాస్ లైన్‌లో టౌన్ రైల్వేస్టేషన్ నిర్మాణంపై స్పష్టత లేకుండా పోయింది.

**హాల్టింగ్‌లకు మోక్షం కలిగేనా!**

పెద్దపల్లి నుంచి కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కనెక్టివిటీ లేకుండా పోయింది. తమిళనాడులోని చెన్నై మినహా ఇతర ప్రాంతాలకు డైలీ కనెక్టివిటీ లేదు. వారానికి ఒకసారి నడిచే మన్నార్‌గుడి, కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్, కేఎస్సార్ బెంగళూర్ ఎక్స్‌ప్రెస్‌లు మినహా ప్రత్యామ్నాయం లేదు. పెద్దపల్లిలో కాశీ తమిళ సంఘం ఎక్స్‌ప్రెస్, పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్, జోద్‌పూర్, వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్‌క్రాంతి, కేరళ ఎక్స్‌ప్రెస్‌లు, రామగుండంలో తమిళనాడు, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్‌లు కల్పించాలనే ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు.

# ఆయిల్‌పామ్‌లోకి తెచ్చేందుకు..!

నకిరేకల్: ఆయిల్‌పామ్ సాగులో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. సాగులో వేగాన్ని పెంచేందుకు కసరత్తులు చేస్తున్నారు. మంత్రి సూచనలతో ఉద్యాన శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని సంయుక్త సంచాలకుల(జేడీ)కు ఒక్కొక్కరికి ఐదు జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. నల్గొండ జిల్లా ఉద్యాన పంటల సాగు, పథకాల అమలు అధికారి జేడీ బి.బాబు.. తాజాగా నల్గొండలో ఉమ్మడి జిల్లా స్థాయి ఉద్యాన అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్‌తో పాటు ఉద్యాన పంటల సాగుపై సమీక్ష నిర్వహించారు. పది రోజుల్లో పురోగతి సాధించాలని లక్ష్యాలు విధించారు.

**జిల్లాలో ఇలా..** నల్గొండ జిల్లాలోని 33 మండలాల్లో ఇప్పటి వరకు 10,827.10 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయి. 2025-26 సంవత్సరానికి మరో 6,500 ఎకరాల్లో ఈ సాగును ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. నెలవారీగా ఎన్ని ఎకరాల్లో మొక్కల ప్లాంటేషన్ పూర్తి చేయాలో కూడా సూచించింది. జూన్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటించాల్సి ఉంది. ఇప్పటి వరకు 650 ఎకరాలను గత నెలలో సాగులోకి తీసుకొచ్చారు. వర్షాలు ఆలస్యం కావడం, వాతావరణంలో వేడి, రైతులు ఇతర సాగుపనుల్లో నిమగ్నం కావడం వంటి అంశాలు జూన్‌నెల ఆయిల్‌పామ్ మొక్కల ప్లాంటేషన్ లక్ష్యాలపై కొంత ప్రభావం చూపాయని అధికారులు అంటున్నారు.

# టెండర్ నిర్వహణ.. ఒప్పందం విస్మరణ

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో రూ.50 కోట్ల మేర పనులు చేసేందుకు సాధారణ నిధులతో టెండర్లు పిలిచారు. డివిజన్లలో నిలిచిపోయిన రోడ్లు, మురుగుకాలువలకు సంబంధించిన పనులు చేసుకోవడానికి గత పాలకవర్గ సభ్యులు తీర్మానం కూడా చేశారు. ఆ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకొస్తుండగా.. ఒప్పందం చేసేందుకు కొందరు ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు.

**గుత్తేదారులు డీడీలు చెల్లించినా..**

అభివృద్ధి పనులు చేసేందుకు గుత్తేదారులు డీడీలు కూడా చెల్లించారు.



ఆ మొత్తం బల్దియా ఖజానాలో జమ అయినప్పటికీ ఒప్పందం చేసే ఇంజినీరింగ్ అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు. అలా ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కాక గుత్తేదారులు అయోమయంలో పడుతున్నారు. కొన్ని చోట్ల పనులు కూడా ప్రారంభించగా ఒప్పందం చేసుకోకుండా ఎలా చేస్తారని బెదిరింపులకు గురి చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

**అధికారుల వద్దే దస్త్రాలు**

టెండర్ నిర్వహించి ఒప్పందం చేసుకోవాల్సిన దస్త్రాలు ఇంజినీరింగ్ అధికారుల వద్దే ఉన్నాయి. ఓ వైపు రహదారులు మురుగుకాలువల పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కొందరు ఇంజినీర్లు మాత్రం మోకాలడ్డు పెట్టడం వివాదాస్పదంగా మారుతోంది. పనులు చేయకుండా ఆపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న మాజీ పాలకవర్గ సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

**కమిషనర్ ఆదేశాలతో..**

ప్రాధాన్యం ప్రకారం పనులు చేయాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. సాధారణ నిధులతో గతంలో చేపట్టిన పనులకే రూ.కోట్లు నిధులు చెల్లించాల్సి ఉంది. సంజయ్‌కుమార్, ఈఈ, నగరపాలిక

# సంపుతున్నయ్ జాగ్రత్త

సిరిసిల్ల : కుళాయి నీటిని ఒడిసిపట్టేందుకు ఇళ్ల ఆవరణలో సంపులు నిర్మిస్తుంటారు. ఈ మధ్య ప్రతి ఇంటికి ఇవి తప్పనిసరిగా మారాయి. తొట్టీల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, నీటితో ఆడుకునేందుకు ఇష్టపడే చిన్నారుల పాలిట మృత్యువుగా మారుతున్నాయి. ఎద్దడిలో నీటి నిల్వకు ఏర్పాటు చేసుకున్న తొట్లు ప్రాణాలను హరిస్తున్నాయి. భవన నిర్మాణ ప్రదేశాల్లో నీటితొట్టీలు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేసేలా సంబంధిత పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు పర్యవేక్షణ చేయాలని.. నిర్లక్ష్యం చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త**

బాల్యంలో చిన్నారులు నీటితో ఆడుకునేందుకు ఇష్ట పడుతుంటారు. అదే భావనతో తెరిచి ఉన్న నీటి సంపుల వద్దకు వెళ్లి ఆడుకునే క్రమంలో అందులో పడిపోతున్నారు. సంపుకు దూరంగా ఉండేలా చిన్నారులకు భయం చెప్పాలి. పెద్ద పిల్లలయితే అందులో పడితే జరిగే ప్రమాదంపై అవగాహన కల్పించాలి. జ్ఞానం రాని చిన్నారులపై నిత్యం తల్లితండ్రులు పర్యవేక్షణ ఉంచాలి.

పిల్లల ముందు సంపులను శుభ్రపరిచే పని పెట్టుకోకపోవడం మంచిది. అనుకరించి తర్వాత అందులో పడే ఆస్కారం ఉంటుంది.

సంపులను కడిగే క్రమంలో, నీటి నిల్వాలు పరిశీలించిన పిదప తప్పనిసరిగా మూతను పెట్టాలి. ఆ విషయంలో ఏమరపాటు వద్దు. అవసరమైతే సంపులపై ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. పైన ఏర్పాటు చేసిన సిమెంటు పలకలు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలి. భవన నిర్మాణ పనులు చేపట్టే చోట సంపులు, సెప్టిక్ ట్యాంకులపై పైకప్పు వేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. పనిచేసే వారితోపాటు తోడుగా తెచ్చుకున్న పిల్లలు ఆడుకుంటూ పడిపోయే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న



ప్రమాదాలను పసిగట్టాలి. బయట ఆడుకునేటప్పుడు ఎలాంటి పనులపై నిమగ్నం కాకుండా నిత్యం పర్యవేక్షించాలి.

మచ్చుకుకొన్ని ఘటనలు

వేములవాడ మండలం చింతల్ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన ఆరేళ్ల బాలుడు రుషి శనివారం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆడుకునే సమయంలో పొరపాటున నీటి సంపులో పడిపోయాడు. తనతో వచ్చిన పిల్లలు పరిగెత్తి ఇంట్లో వారిని తీసుకొచ్చేలోపే ప్రాణాలు కోల్పోయాడు. గతేడాది డిసెంబరు నెలలో గంభీరావుపేట మండలం నర్మాలలో 18 నెలల చిన్నారి ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయి మృతి చెందింది. గత సంవత్సరం జులైలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ అనుబంధ గ్రామం గాజులపల్లిలో శ్వేహాన్ (3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. చేతిలో ఉన్న పలక మూత లేని నీటి తొట్టీలో పడింది. అది మృత్యు కుహరం అని తెలియక బాలుడు పలకను తీసే యత్నంలో అందులో పడ్డాడు. బాలుడి కోసం వెతికిన చూసిన తల్లికి సంపులో శవమై కనిపించాడు.

# ఉద్యానానికి ఊతం.. రైతన్నకు లాభం

పరిగి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నాయి. రాయితీ ప్రకటించడంతోపాటు నిర్దేశిత లక్ష్యాలను విధించింది. గతం కంటే అధిక విస్తీర్ణంలో సాగు చేయాలని అధికారులు వార్షిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్‌పాం, సుగంధ ద్రవ్యాల సాగు, తోటల పునరుద్ధరణ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా పథకాల కింద సుమారు రూ.35 కోట్ల మేరకు నిధులు ఖర్చు చేయనున్నారు. అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు కసరత్తు చేస్తున్నారు.

**పెరగనున్న సాగు విస్తీర్ణం..**

జిల్లాలో పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయి. మరోవైపు రాయితీ అందించడంతో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మరింత పెరగనుంది. తోటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పదిహేనేళ్లకు పైబడిన తోటల పునరుద్ధరణకు 71 హెక్టార్లను తీసుకొని ప్రోత్సహించనున్నారు. దీనికిగాను ప్రభుత్వం రూ.17 లక్షలు వెచ్చించనుంది. జిల్లాకు 12 నీటి నిల్వ గుంతల యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.75వేల చొప్పున రాయితీ అందనుంది. 570 హెక్టార్లలో మల్చింగ్ యూనిట్లు, ఉల్లి



నిల్వకు 20 యూనిట్లు మంజూరు కావడంతో రూ.25 లక్షలు వెచ్చించనున్నారు.

**యాంత్రీకరణ పథకం కింద..**

ఈ పథకం కింద మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, తైవాన్ పంపులు వంటివి 136 యూనిట్లు వచ్చాయి. ఆర్‌కేవీవై పథకం కింద తీగజాతి పందిళ్లకు 100 యూనిట్లు రాగా.. ఇది అరెకరం వరకు మాత్రమే పరిమితం చేశారు. బిందు సేద్యంలో భాగంగా 1,225 హెక్టార్లు, తుంపర కింద 485 యూనిట్లు మంజూరయ్యాయి.

**ఇది సువర్ణావకాశం..**

ఇటు పండ్లు, అటు కూరగాయల సాగుకు ఇది సువర్ణావకాశం. నీటి సదుపాయం తక్కువున్న రైతులు వీటి సాగుపై దృష్టి సారించారు. సాగుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తాం. ఆయిల్‌పాం సాగుకు రాయితీ ఎక్కువగా ఉంది. ప్రభుత్వం ప్రత్యేకించి ప్రోత్సహిస్తోంది.ఎంఏ సత్తార్, జిల్లా ఉద్యానాధికారి

# ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నాలు

రాయదుర్గం : ఖాజాగూడలో ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నాలు చేస్తున్నారు. సర్కారు జాగా అనే సూచిక ఉన్నా.. బోర్డును వదిలేసి దాని చుట్టూ చదును చేసే పనులు చేపడుతున్నారు. ఖాజాగూడ సర్వే నం.40లో ఈ పనులు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్కడ ఆక్రమణదారులు కబ్జాలకు యత్నాలు చేస్తుండడంతో గతంలోనే శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని పేర్కొనే సూచికను ఏర్పాటు చేశారు. ఆ సూచిక తొలగిపోవడంతో తిరిగి అదే పనిచేస్తున్నారు. దీంతో అధికారులు కొత్తగా సూచిక ఏర్పాటు చేసినా దాని పక్కనుంచే రాళ్లతొలగింపు, చదును పనులు ఆరంభించారు. పగలు ఆ పనులు చేపడితే యంత్రాంగం అడ్డుకునే అవకాశం ఉండడంతో



రాత్రికిరాత్రి జేసీబీలతో రాళ్లను తొలగించడం, మట్టితో చదును చేసే పనులు చేపడుతున్నారు. దాదాపు 600 గజాల స్థలాన్ని కబళించే యత్నాలు చేస్తున్నారు. ఈ స్థలంపై రెవెర్యూ అధికారులు ఆది నుంచీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆక్రమణ దారులు నకిలీ పత్రాలు సృష్టించడం వందల గజాల స్థలాన్ని కాజేయడానికి తెరతీశారు. ఇప్పటికే జాగా అన్యాక్రాంతమై ఆ సర్కారు జాగాలో బహుళ అంతస్తుల భవనాలు పుట్టుకొచ్చాయి. మిగిలి ఉన్న స్థల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో త్వరలోనే అది కూడా మాయమయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని, త్వరలోనే కంచె నిర్మిస్తామని శేరిలింగంపల్లి ఆర్ఐ చంద్రారెడ్డి అన్నారు.

# మహా నగరానికి ‘వన’హారతి

హైదరాబాద్: మహానగరంలో వనమహోత్సవానికి కార్యాచరణ సిద్ధమైంది. మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని 42 నర్సరీల్లో భారీఎత్తున మొక్కలు సిద్ధం చేశారు. అందులో పండ్లు, ఇతర అన్ని రకాల మొక్కలు ఉన్నాయి. త్వరలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఇవి నాటనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, సాధారణ పౌరులకు ఇవి పంపిణీ చేయనున్నారు. ఒకప్పుడు చెరువులు, ఉద్యనవనాలకు చిరునామాగా ఉన్న భాగ్యనగరం చివరికి కాలుష్య కాసారంగా మారుతోంది. దాదాపు కోటికి చేరువవుతోన్న వాహనాలతో వాయు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో పచ్చదనం పెంపు చాలా కీలకంగా మారనుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం వనమహోత్సవం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. హెచ్ఎండీఏకు శివార్లలో నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ మొక్కలను పెంచి వాటిని నగరంలోని అన్ని ప్రాంతాలకు పంపిణీ చేయనున్నారు. ఇందుకు హెచ్ఎండీఏ రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తోంది. ఈ ఏడాది 4.94 కోట్ల మొక్కలు అర్బన్ ఫారెస్ట్రీ అధికారులు సిద్ధం చేశారు. పార్కులు, చెరువులు, జాతీయ, రాష్ట్ర రహదారులు, సెంట్రల్ మీడియన్లు, అర్బన్ ఫారెస్ట్‌ల బ్లాకుల్లో సుమారు 4.5 కోట్ల మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కోసం చెట్లను తొలగించారు. కొన్నింటిని ట్రాన్స్‌లొకేట్ చేస్తున్నారు. తర్వాత ఈ ప్రాజెక్టుల వెంబడి మొక్కలు నాటాలని నిర్ణయించారు. వనమహోత్సంలో భాగంగా సాధారణ పౌరులకు పెద్ద ఎత్తున పంపిణీ చేసేందుకు కార్యాచరణ షురూ అయింది.

# సైబర్ నేరగాళ్ల రీఫండ్ మాయ.. ఆ లింక్ క్లిక్ చేశారో అంతే!



హైదరాబాద్: ఆకలేసిందంటే చాలు.. ఫుడ్ డెలివరీ యాప్‌ల్లో ఆర్డర్ పెట్టేవారు ప్రస్తుతం వేలల్లో ఉన్నారు. అలాంటివారే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. యాప్‌లలో ఆహారం ఆర్డర్ పెట్టిన తర్వాత రద్దయిందని నకిలీ సందేశాలు పంపిస్తున్న నేరగాళ్లు.. డబ్బు తిరిగి పొందాలంటే(రీఫండ్) బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలంటూ లింకులు పంపిస్తున్నారు. నిజమేనని భావిస్తున్న వినియోగదారులు వాటిపై క్లిక్ చేసి డబ్బు పోగొట్టుకుంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాట్సప్, ఎస్ఎంఎస్ ద్వారా డెలివరీ యాప్‌లకు సంబంధించిన లింకులు వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిస్తోంది.

**లింకు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ**

ఆర్డర్ పెట్టి రద్దు చేసుకున్న తర్వాత రీఫండ్ పేరుతో సైబర్ ముఠాలు డబ్బు కొట్టేస్తున్నాయి. రీఫండ్ కోసం క్లిక్ చేశాక.. నిమిషాల వ్యవధిలోనే సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తున్నాయి. తాము ఫుడ్ డెలివరీ యాప్ నుంచి మాట్లాడుతున్నామని.. రీఫండ్ కోసం పంపించే లింకు క్లిక్ చేసి బ్యాంకు వివరాలు నమోదు చేయాలని సూచిస్తారు. నిజమేనని భావించి క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయి. కొన్నిసార్లు తాము పంపించే లింకు క్లిక్ చేశాక రూ.1 పంపిస్తే రీఫండ్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెబుతున్నారు. పొరపాటున లింకు క్లిక్ చేస్తే ఫోన్ ఆధీనంలోకి తీసుకుంటున్న నేరగాళ్లు డబ్బు కొట్టేస్తున్నారు. ఓ ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్‌లో నగరవాసి ఆహారం ఆర్డర్ పెట్టిన తర్వాత డెలివరీ చేయకుండా నకిలీ లింకులతో రూ.1.90 లక్షలు పోగొట్టుకున్న వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే.

**డేటా నేరగాళ్ల చేతుల్లో..**

ఈ–కామర్స్ సంస్థలు, ఫుడ్ డెలివరీ యాప్ వినియోగదారుల డేటా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి ఎప్పటికప్పుడు చేరుతోంది. వ్యాపారాలు నిర్వహిస్తున్న మెజార్టీ సంస్థలు డేటా నిర్వహణ బాధ్యతను తృతీయ పక్ష ఏజెన్సీలకు అప్పగిస్తున్నాయి. సేవలు అందించేది ఈ సంస్థలే అయినా.. వినియోగదారుల వివరాలు, సాంకేతిక అవసరాల కోసం ఇతర సంస్థల మీద ఆధారపడతాయి.

**ఇవీ జాగ్రత్తలు..** ఈ–కామర్స్, ఫుడ్స్ డెలివరీ సేవలకు కచ్చితంగా అధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లనే వినియోగించాలి. ఆర్డర్ రద్దు, రీఫండ్ విషయంలో సమస్యలుంటే యాప్‌లోనే ఫిర్యాదు చేయాలి. కొందరు ఫిర్యాదు చేసేందుకు నేరుగా గూగుల్ సంస్థ పేరు టైప్ చేసి కస్టమర్ కేర్‌నంబరు కోసం వెతుకుతారు. ఇలా చేస్తే కచ్చితంగా మోసపోయినట్లే. వాట్సప్‌నకు రాయితీ, బంపర్‌డ్రా పేరుతో వచ్చే ప్రకటనల్ని నమ్మి క్లిక్ చేయొద్దు. ఒకవేళ మోసపోతే 1930 టోల్‌ఫ్రీ లేదా స్థానిక పోలీసులను ఆశ్రయించాలి.

# వ్యర్థాలతో 14 మెగావాట్ల వెలుగులు



హైదరాబాద్: రాజధానిలో ఉత్పత్తి అవుతున్న చెత్తకు పరిష్కారం చూపడంలో జీహెచ్ఎంసీ మరో మైలురాయి చేరుకుంది. ప్రస్తుతం పనిచేస్తున్న రెండు డబ్ల్యూటీఈ(వేస్ట్ టు ఎనర్జీ)లకు అదనంగా.. మరో 14 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు జీహెచ్ఎంసీ పచ్చజెండా ఊపింది. దశాబ్దంగా పెండింగులో ఉన్న యాచారం ప్లాంటు దరఖాస్తును ఆమోదించింది. దీంతో జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గనుంది. చెత్తను గుట్టలుగా పోసే దుస్థితి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇబ్రహీంపట్నం మండలం యాచారంలో రాబోతున్న ప్లాంటు జపాన్ సాంకేతికతతో పనిచేస్తుందని, కాలుష్య ఉద్గారాలకు తావులేకుండా డబ్ల్యూటీఈ అందుబాటులోకి వస్తుందని జీహెచ్ఎంసీ తెలిపింది.

**100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి లక్ష్యం**

నగరంలో ప్రస్తుతం రోజుకు 8 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దాన్నుంచి 100 మెగావాట్లకుపైగా విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది జీహెచ్ఎంసీ లక్ష్యం. లక్ష్యానికి తగ్గట్లుగా జీహెచ్ఎంసీ ఇప్పటికే రెండు విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 24 మెగావాట్ల కేంద్రం.. దుండిగల్‌లో 14.5 మెగావాట్ల డబ్లూటీఈ పని చేస్తున్నాయి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులోనే మరో 24 మెగావాట్ల కేంద్రం నిర్మాణంలో ఉంది. ప్యారానగర్‌లో ఏర్పాటు చేయదలచిన 15 మెగావాట్ల కేంద్రం నిర్మాణ పనులు కోర్టు కేసుతో నిలిచిపోయాయి. ఇవన్నీ రాంకీ సంస్థకు చెందినవే. వాటన్నింటిలో చేపడుతున్న విద్యుత్తు ఉత్పత్తికి ప్రస్తుతం 2,500 టన్నుల మండే స్వభావమున్న చెత్త మాత్రమే ఉపయోగపడుతోంది. మిగిలిన వ్యర్థాల్లోని కొంత తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చుతున్నారు. పనికిరాని వ్యర్థాలను డంపింగ్‌యార్డులోనే గుట్టలుగా పోస్తున్నారు. దీంతో జవహర్‌నగర్ కేంద్రం కిక్కిరిసిపోయింది. బీబీనగర్‌లో దశాబ్దం క్రితం ఏర్పాటైన 11 మెగావాట్ల డబ్ల్యూటీఈ పలు కారణాలతో పనిచేయట్లేదు. తాజాగా వెంకటేశ్వర ప్లాంటుకు అనుమతి లభించడం గమనార్హం.

**సమీక్షించి ఎన్వోసీ ఇప్పించారు**

వెంకటేశ్వర పవర్ ప్లాంట్ సంస్థ రూపొందించిన ప్రాజెక్టుపై పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్షించి.. రాంకీ సంస్థ నుంచి ప్లాంటు ఏర్పాటుకు తాజాగా ఎన్వోసీ ఇప్పించారు. నిత్యం 700 టన్నుల చెత్తను యాచారం ప్లాంటుకు తరలించేందుకు రాంకీని ఒప్పించారు. ఏడాదిన్నరలో కేంద్రం అందుబాటులోకి వస్తుందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. వెంకటేశ్వర సంస్థ బల్దియాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఆ సంస్థనే బల్దియాకు రాయల్టీ రూపంలో నిధులు చెల్లిస్తుంది. తద్వారా.. బల్దియాకు ఏటా రూ.25 కోట్లు ఆదా కానున్నట్లు అధికారులు తెలిపారు.

# సమీకృత గురుకులాలు.. వేగంగా అడుగులు!




హైదరాబాద్: విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా సమీకృత పాఠశాలలు ఏర్పాటయ్యే ప్రాంతాల ఎంపికపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఒక్కో పాఠశాలను రూ.200కోట్ల వ్యయంతో నిర్మించనుండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెవెన్యూ అధికారులు స్థలాల ఎంపికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 29 నియోజకవర్గాల్లో అనువైన ప్రాంతాలను రెండు, మూడు నెలల్లో ఎంపిక చేసి శంకుస్థాపన పనులు చేపట్టనున్నారు. మహేశ్వరం, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. హైదరాబాద్‌లో అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు.

**రవాణా సౌకర్యాలు.. మౌలిక సదుపాయాలు..**

ఈ పాఠశాలకు 5–25 ఎకరాల స్థలం అవసరం కావడంతో మూడు జిల్లాల్లోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. సమీకృత గురుకులాలు సబర్బన్, గ్రామీణ ప్రాంతాలకు మరీ దూరంగా ఉండకుండా రవాణా సౌకర్యాలు ఉండేలా మౌలిక సదుపాయాలను సమకూర్చనున్నారు. భూముల లభ్యత ఆధారంగా మూడు నెలల క్రితం అబ్దుల్లాపూర్‌మెట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కాప్రా మండలాల్లో ప్రభుత్వ భూముల వివరాలను సేకరించారు. మేడ్చల్ జిల్లాలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూములను జాగ్రత్తగా ఎంపిక చేస్తున్నారు.

**వివరాలు సేకరించి మంత్రికి నివేదించి**

హైదరాబాద్‌లో సమీకృత గురుకులాలు నిర్మించాలంటే సరిపడా ప్రభుత్వ భూములు లేవు. పదిహేను నియోజకవర్గాల్లో రెండు, మూడు నియోజకవర్గాల్లో మినహా ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేవు. ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలమంటే నగరంలో ఎకరం కనీసం రూ.50 కోట్లు అనుకున్నా.. పాఠశాల స్థలానికే రూ.250 కోట్లవుతుంది. దీంతో రెవెన్యూ అధికారులు గతంలో వేర్వేరు శాఖలకు ఇచ్చిన భూముల్లో ఖాళీగా ఉన్న వాటి వివరాలను సేకరిస్తున్నారు. హెచ్ఎండీఏ, రవాణా, పోలీస్, వైద్యారోగ్య శాఖలకు ఇచ్చిన భూముల వివరాలను క్షుణ్నంగా అధ్యయనం చేస్తున్నారు. బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములున్నాయని తెలుసుకున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివరాలను సేకరించారు. పదిహేను చోట్ల వివరాలు సేకరించి ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వాటిని తెలపనున్నారు.

# ఏరువాక.. జోరుగా సాగాలిక!

జగిత్యాల : అన్నదాతలు కార్తెలను నమ్ముకుని, ప్రకృతితో మమేకమై పొలం పనులను మొదలు పెడతారు. ఇదే అధిక దిగుబ డులను తమ లోగిళ్లకు తెస్తుందని విశ్వసిస్తారు. గత నెలలోనే భారీ వర్షాలు కురవగా అన్నదాతలు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేయటం, విత్తనాలను సేకరించుకోవడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. ‘ఏరువాక పౌర్ణమి’తో ఉమ్మడి జిల్లాలో సాగు పనులు జోరందుకోనున్నాయి.

**ప్రధాన పంటగా వరి**

ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం 9.50 లక్షల ఎకరాల్లో వరి పండించనున్నట్లు అంచనా. పత్తి, కంది తదితర పంటల సాగు పెంచాలని ప్రభుత్వం పేర్కొంటున్నా పసుపులో మిశ్రమ పంటగా మక్క, ఇతరత్రా అలసంద, సోయాబీన్, పెసర, మినుము, కూరగాయలు, మిరప ప్రధాన పంటలుగా ఉండనున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరినార్లు పోస్తుండగా పసుపు, మక్క, పత్తిని విత్తుతున్నారు.

**ఇలా చేస్తే కర్షకులకు దన్ను**

పత్తిలో బీటీ–3, నకిలీ విత్తులను, ఇతర పంటల్లోనూ నాసిరకం విత్తనాల విక్రయాన్ని అరికట్టాలి. గ్రామాల్లో గుట్టుగా సాగే నకిలీ సేంద్రియ ఎరువుల జీరో క్రయవిక్రయాలను నిరోధించాలి.

జనుము, జీలుగ విత్తనాలను రాయితీపై ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు అన్ని రకాల ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు జిల్లాకు కనీసం రూ.275 కోట్లను యాంత్రీకరణ, యంత్రలక్ష్మి పథకానికి కేటాయించి సీజన్ ఆరంభంలో యంత్రాలు, పరికరాలివ్వాలి. ఈ సీజన్ నుంచి అయినా పంటల



బీమా పథకాన్ని అమలు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలి. రూ.2 లక్షల్లోపు రుణమాఫీ వివిధ కారణాలతో మిగిలిపోయిన వారు, కుటుంబ యూనిట్‌గా పరిగణించినందున రూ.2 లక్షలకన్నా పైబడి రుణమున్నవారు ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.31 లక్షల మంది ఉండగా వీరికి రుణమాఫీ నిధులు విడుదల చేయాల్సి ఉంది.

నిరుడు వానాకాలానికి చెందిన రైతుభరోసా నిధులు ఇవ్వలేదు. గత యాసంగి సీజనుకు చెందిన నిధులను 4 ఎకరాల వరకే ఇవ్వగా మిగిలిన రైతులకు నిధుల విడుదలపై రైతులు ఎదురు చూస్తున్నారు. ఉపాధిహామీని సాగు పనులకు అనుసంధానించాలి. పంటల్లో ఉప ఉత్పత్తుల తయారీకి వ్యవసాయ అనుబంధ పరిశ్రమ, ఫుడ్‌పార్కు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి.

ప్రభుత్వ హామీ మేరకు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు, పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన కేంద్రం, ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం, జిల్లాలో ఉద్యాన పరిశోధన స్థానం ఏర్పాటు చేయాల్సి ఉంది. లక్ష్మీపూర్‌లో విత్తనశుద్ధి కర్మాగారం పూర్తి చేయాలి. వాగులపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలను పూర్తి చేయాలి.

# ఊరు చిన్న.. తీరు మిన్న

సిరిసిల్ల: వేములవాడ పక్కనే ఉన్న చిన్న పంచాయతీ.. అక్కడ ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి.. వీధుల్లో మురుగు కనిపించకుండా ఇంకుడు గుంతలు నిర్మించారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ప్రకటించిన చెక్కపల్లి ఘనత ఇది. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి.. కాలుష్య రహిత గ్రామం దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో జిల్లా స్వచ్ఛభారత్ మిషన్, కాలుష్య నియంత్రణ విభాగం ఏప్రిల్‌లో సంయుక్తంగా సర్వే చేసి, ప్రతిపాదనలు పంపింది.

**ప్రణాళిక.. ఆదర్శంగా..**

వేములవాడ గ్రామీణ మండలం చెక్కపల్లిలో 464 గృహాలు, 2,320 జనాభా ఉంది. ఇళ్లలో సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలిస్తున్నారు. దీని ద్వారా ఇప్పటికే 463 కిలోల సేంద్రియ ఎరువును తయారు చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. దీనికోసం గ్రామంలో మహిళలతో ప్రత్యేకంగా ప్లాస్టిక్ నివారణ కమిటీని




నియమించారు. సెగ్రిగేషన్ షెడ్డులోనే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తూనే.. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్టీల్‌బ్యాంకును ఏర్పాటు చేశారు. గ్రామంలో జరిగే శుభకార్యాలకు వీటిని ఇస్తున్నారు. గ్రామంలో చాలా వరకు మురుగునీటి కాల్వలు లేవు. దీంతో ఇళ్లలోని మరుగునీరు వీధుల్లోకి వచ్చి చేరుతుంది. దీనికోసం ద్రవ వ్యర్థాల నిర్వహణ కమిటీని ఏర్పాటుచేసి ప్రతి ఇంటితోపాటు వీధుల్లోనూ సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించారు. ఇలా ప్రతీది ప్రణాళిక ప్రకారం చేస్తుండటంతో గ్రామం పరిశుభ్రంగా మారింది.

**స్వచ్ఛతే లక్ష్యంగా..** సురేష్, ఐఈసీ కన్సల్టెంట్

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని పంచాయతీలు ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపికయ్యాయి. ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఏ కార్యక్రమంలోనైనా ప్లాస్టిక్ వినియోగం భారీగా పెరిగింది. ఈ క్రమంలో తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వినియోగించిన శానిటరీ న్యాప్‌కిన్‌ల కోసం శుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. జిల్లాలోని మిగతా గ్రామాలు చెక్కపల్లిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని నమూనాగా చూపుతున్నాం.

**నిత్యం పర్యవేక్షణ : మంజుల, వీవోఏ**

సేంద్రియ ఎరువు విక్రయంతో పంచాయతీకీ రూ.6,270 ఆదాయం సమకూరింది. కొంత ఎరువును నర్సరీలు, ప్రకృతి వనాలు, రోడ్ల వెంట నాటిన మొక్కలకు వేశాం. శుభకార్యాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామంలో స్టీలు సామగ్రిని అందుబాటులో ఉంచాం. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్, వస్త్ర సంచులను అందించాలని సూచించాం.

# సయోధ్య కుదరక.. రోడ్డున పడింది

నాయుడుపేట : జిల్లాలో ఆరు మండలాలు, మూడు నియోజకవర్గాలను కలిపే కొనేటి రాజుపాళెం–కొణతనేరి ర.భ. శాఖ రోడ్డు రెండు శాఖల సమన్వయం లోపంతో చివరకు వివాదాస్పదంగా మారింది. నాయుడుపేట మండలంలోని కొనేటిరాజుపాళెం నుంచి మేనకూరు పారిశ్రామికవాడ మీదుగా శ్రీకాళహస్తి వరకు 15 కి.మీ. ర.భ. శాఖ రోడ్డు ఉంది. గతంలో వెంకటగిరి, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల పరిధిలో ఈ మార్గంలో అధిక సంఖ్యలో బస్సులు నడిపేవాళు్లు. కల్వర్టులు అధ్వానంగా ఉండడం, పాలచ్చూరు నుంచి రహదారి మరమ్మతులు లేకపోవడంతో ఒకటి రెండు బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. దీంతో పాలచ్చూరు నుంచి కొనేటిరాజుపాళెం మధ్య భూములను ఏపీఐఐసీ ఇటీవల ఆదిత్య బిర్లా పరిశ్రమకు కేటాయించింది.



భూముల మధ్య ఉన్న రోడ్డు కేటాయించడంతో ఇటీవల పనులు ప్రారంభించిన పరిశ్రమ యాజమాన్యం రోడ్డుకు అడ్డుగా ప్రహరీ నిర్మించేందుకు యత్నించడంతో పాలచ్చూరు గ్రామస్థులు ఆందోళన చేశారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏపీఐఐసీ అధికారులు చూపకపోవడం, మరోవైపు ర.భ.శాఖ రోడ్డు మార్గం వెంబడి ఆదిత్య బిర్లా పరిశ్రమ నిర్మాణం చేపడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు సమస్య పరిష్కారానికి ర.భ.శాఖ, ఏపీఐఐసీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జనగళం వినిపించాలి.. జలకష్టం తీర్చాలి

కర్నూలు : జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తి.. పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంది. కర్నూలు కలెక్టరేట్‌లో నీటి పారుదల సలహా మండలి (ఐఏబీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశాన్ని మొక్కుబడిగా కాకుండా సాగునీటి కష్టాలు తీర్చేలా అర్థవంతంగా నిర్వహించాలని రైతులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేలు హాజరై వివిధ అంశాలపై స్పష్టంగా చర్చించి.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**గేట్లు బిగించి చేతులు దులిపేసుకున్నారు**

గాజులదిన్నె జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 4.500 టీఎంసీలు కాగా 5.500 టీఎంసీలకు పెంచేందుకు గత ప్రభుత్వం రూ.137 కోట్ల నిధులు విడుదల చేసింది. ఒక టీఎంసీ నీటిని అదనంగా నిల్వ చేసేందుకు 410 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఒక్క సెంటు కూడా సేకరించలేదు. జీడీపీ అధికారులు రూ.51 కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు. గేట్లు బిగించి మిగతా పనులు చేయకుండా చేతులు దులిపేసుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు.



**గుండ్రేవుల కల సాకారమవ్వాలి**

తుంగభద్ర జలాలను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడవంతో ఏటా వందల టీఎంసీల నీటిని సుంకేసుల ద్వారా దిగువకు విడుదల చేయాల్సి వస్తోంది. గుండ్రేవుల జలాశయాన్ని నిర్మిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీనిపై సమగ్రంగా చర్చించాలి.

గాజులదిన్నె ప్రాజెక్టులో ఈ ఏడాది 3 టీఎంసీల నీరు నిల్వ చేయకపోతే వచ్చే వేసవిలో మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హంద్రీనీవా కాల్వకు నీటిని విడుదల చేసినప్పటి నుంచే రోజుకు 250– 300 క్యూసెక్కుల వరకు విడుదల చేసి ఈ ప్రాజెక్టులో నిల్వ చేయాలి. హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో కర్నూలు జిల్లాలో 60 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. పందికోన జలాశయం కింద 46 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల నిలిచిపోయింది. ఈ అంశాలపై చర్చించాలి. హంద్రీనీవా కాల్వ నుంచి 68 చెరువులు నింపే ప్రాజెక్టు నిర్వహణ రూ.1.60 కోట్లు విడుదల చేయాలి.

# దారి చూపితేనే.. ప్రగతి పరుగు..!

జంగారెడ్డిగూడెం : గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెంబడి ఉన్న పొలాలకు సరైన కల్వర్టులు, దారులు ఇవ్వకపోవడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పుట్లగట్లగూడెం, లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం, దేవులపల్లి తదితర గ్రామాల్లో పొలాల మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడంతో ఆయా పొలాలు రెండుగా చీలిపోయాయి. దీంతో పంట సాగు విషయంలో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని కర్షకులు వాపోతున్నారు.

**బాట లేక.. కల్వర్టులు చాలక..**

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద దిగువకు వెళ్లే వీలు లేక తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని చిన్న, సన్నకారు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొలాలకు అనుకుని పంట బోదెలు ఉండటంతో వచ్చిన వర్షపు నీరు దిగువకు వెళ్లిపోయేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. హైవేకు ఇరువైపులా పంట పొలాలకు వెళ్లేందుకు దారి నిర్మిస్తామని చెప్పి తమ భూములను తీసుకున్నారని.. నేడు హైవే పనులు పూర్తి కావస్తుండటంతో ఆ ఊసే లేదని రైతులు చెబుతున్నారు. కలెక్టర్‌తో పాటు హైవే అధికారులకు తమ సమస్యలపై పలుమార్లు వినతులు సమర్పించినా.. ఫలితం లేదని గగ్గోలు పెడుతున్నారు.

**25 కిలోమీటర్ల తిరిగి వెళ్తున్నా..**

'నా పొలంలో హైవే నిర్మాణానికి రెండెకరాలు ఇచ్చా. హైవే రాక మునుపు ఇంటి నుంచి పొలం వెళ్లాలంటే కిలోమీటరు ఉండేది. ఇప్పుడు సర్వీసు దారి ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి జంగారెడ్డిగూడెం, సీతంపేట, తిరుమలాపురం మీదుగా 25 కి.మీ. తిరిగి పొలానికి వెళ్లాల్సి వస్తోంది.'

వందనపు సాయిబాబు, పంగిడిగూడెం

**కూలీలు రావడం లేదు..**

'పంట చేలకు రావాలంటే దారి లేకపోవడంతో కూలీలు వ్యవసాయ పనులకు సరిగా రావడం లేదు. పంట ఉత్పత్తులు ట్రాక్టర్లలో తరలించాలంటే యాతన పడుతున్నాం.'

గోలి నర్సిరెడ్డి, పేరంపేట

# సొమ్ము సామాన్యులది.. సోకు దళారులది..!



విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థలో దళారుల హవా కొనసాగుతోంది. రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వకుండా తిప్పించుకుంటున్న అధికారులు, స్థలాలతో సంబంధంలేని దళారులకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారు. వారిచ్చే కమీషన్ల కోసమే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నగరంపాలెం, రేవళ్లపాలెం పరిధిలో కొన్నేళ్ల కిందట రహదారులు నిర్మించినప్పటికీ ఇప్పుడు టీడీఆర్‌లు మంజూరు చేయిస్తుండటం గమనార్హం. మరికొన్నింటికి రోడ్ల విస్తరణలో తక్కువ పరిహారం ఇచ్చారని, తాజా నిబంధనల ప్రకారం పెంచి ఇవ్వాలంటూ దళారులు స్థలాల హక్కు పత్రాలతో నిత్యం ప్రధాన కార్యాలయంలో దర్శనమిస్తున్నారు.

**అమాయకులను బెదిరించి ఒప్పందం:** 'మీ స్థలం రోడ్డు విస్తరణలో పోతుంది. టీడీఆర్ కోసం మీరు తిరగలేరు. ఇదంతా పెద్ద తతంగం' అని స్థలం యజమానిని దళారులు భయపెడుతున్నారు. తాము ఆ పని చేసిపెడతామని ఒప్పందం చేసుకుంటున్నారు. అధికారులకు లంచాలని, తమకు కమీషన్ అని.. రూపాయి విలువ ఉన్న టీడీఆర్‌కు కేవలం రూ.25పైసలు ఇచ్చేలా ముందస్తుగా అడ్వాన్సు చెల్లిస్తున్నారు.

తర్వాత కార్యాలయాల్లో అధికారులను కలిసి బేరం కుదుర్చుకుంటున్నారు. బాండ్లు మంజూరు కాగానే టీడీఆర్ రైట్స్ సైతం దళారుల పేరుపై మార్చుకుంటున్నారు. వాటిని ఎక్కువ మొత్తానికి గుత్తేదారులు, బిల్డర్లకు అమ్మేసుకుంటున్నారు.

**ఆఫ్‌లైన్‌లో అక్రమాలకు తెగింపు**

ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జీవీఎంసీ టీడీఆర్‌లు మంజూరు చేస్తోంది. దీంతో బాధితులకు తెలియకుండా వారి స్థలాల సర్వే నెంబర్లను దళారులను సేకరిస్తున్నారు. వాటికి తమ ఆధార్, ఫోన్ నెంబరుతో వాలిడేషన్ చేయించి టీడీఆర్‌లు కొట్టేస్తున్నారు. అసలైన యజమానులు తమ ఫోన్, ఆధార నెంబర్లను వాలిడేషన్ చేయించడానికి వెళితే అప్పటికే టీడీఆర్ ఇచ్చేశారని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. 'మా టీడీఆర్ మాకివ్వండి.. మీరు ఎవరికిచ్చారో మాకు తెలియదు' అంటూ కార్యాలయం చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

**230 టీడీఆర్‌లకు 4రెట్లు అదనం..:** ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధిలో ఐదు మురికివాడలకు టీడీఆర్‌లు మంజూరు చేశారు. నిబంధనల ప్రకారం మురికివాడలకు 1:1 నిష్పత్తిలో టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా, దళారులు పైరవీలు చేసి నాలుగు రెట్లు అదనంగా మంజూరు చేయించుకున్నారు. ఇటీవల ఓ దేవస్థానికి ప్రత్యామ్నాయ స్థలం జీవీఎంసీ ఇచ్చినప్పటికీ, వాటికి ఆక్రమణదారుల పేరిట మళ్లీ టీడీఆర్ బాండ్లు ఇవ్వడం వివాదాస్పదమైంది. మొత్తం 230 టీడీఆర్‌లను నాలుగు రెట్ల ఎక్కువకు కట్టబెట్టిన విషయం బయటకు రావడంతో హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం వాటిని తిరిగి దక్కించుకోవడానికి దళారులు పావులు కదుపుతున్నారు. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్‌గార్గ్ దళారులకు అడ్డుకట్ట వేసి అర్హులకు టీడీఆర్‌లు దక్కేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పదేళ్లలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లు: 1035 (2024 డిసెంబరు నాటికి)

వాటి విలువ: రూ.2500కోట్లపైగా

గత వైకాపా హయాంలో ఇచ్చినవి: 700పైగా

వాటి విలువ రూ.1600కోట్లపైగా

# ద్రవిడ.. కష్టాలు గట్టెక్కేదెలా?



కుప్పం : ద్రావిడ భాషలపై విస్తృత పరిశోధనలు జరిపి ద్రవిడ సంస్కృతి.. సంప్రదాయాలను పరిరక్షించాలనే లక్ష్యంతో కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్న వర్సిటీ కొందరు పాలకుల ఇష్టారాజ్యంతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. ఆర్థిక వనరులు లేక కనీసం అక్కడ పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. వారికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి జీతాలు చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కొత్తగా రాబోయే వీసీ ద్రవిడ కష్టాలను ఏ విధంగా అధిగమిస్తారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఏడాది తర్వాత..**

కుప్పం ద్రవిడ వర్సిటీలో వైకాపా హయాంలో వీసీగా నియమితులైన ఆచార్య మధుజ్యోతి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతేడాది జులై 18న రాజీనామా చేశారు. గ్రంథాలయశాఖాధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య దొరస్వామిని ఇన్‌ఛార్జి వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు ఏడాది తర్వాత కూటమి ప్రభుత్వం ద్రవిడ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీని నియమించింది.

**పోస్టుల నియామకంలోనూ జాప్యం**

ద్రవిడలో 79 టీచింగ్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 56 మంది ఉన్నారు. 55 నాన్ టీచింగ్ పోస్టులుండగా.. 43 మంది పని చేస్తున్నారు.

**నిధులు ఖాళీ..** విశ్వవిద్యాలయంలో 28 మంది పొరుగు సేవల ఉద్యోగుల నియామకాలకు సంబంధించి మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. అయినా.. గత పాలకులు 254 మందిని పొరుగు సేవల కింద నియమించుకున్నారు. వీరందరికీ దూరవిద్య ద్వారా వచ్చే నిధుల నుంచి వర్సిటీ జీతాలను చెల్లించుకుంటూ వచ్చింది. ఈ విభాగాన్ని యూజీసీ రద్దు చేయడంతో ఉన్న నిధులు ఖాళీ అయ్యాయి. నాలుగేళ్లుగా జీతాల కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. జీతాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ద్వారా ఆరాతీసి నివేదికను అందించినా.. దానిపై ఇన్‌ఛార్జి వీసీ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఈ విషయమై కొత్త వీసీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

# పంచాయతీల్లో.. పన్ను దొంగలు

పుత్తూరు : తిరుచానూరు మేజరు పంచాయతీలో బిల్లు కలెక్టర్ రమేష్ నాయుడు ఏకంగా రూ.22 లక్షల వరకు పన్ను మొత్తం పక్కదారి పట్టించి ఇటీవల అడ్డంగా దొరికిపోయారు. సదరు బిల్‌కలెక్టర్ గతంలోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడి వేటుకు గురైనా తీరు మార్చుకోలేదు. ఈ పంచాయతీలో ఏటా రూ.2 కోట్ల వరకు పన్ను వసూళ్లు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమచేయాల్సి ఉన్నా చేయలేదు. కార్యదర్శి సైతం పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

చిత్తూరు జిల్లా వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. నిధులు వాడుకున్నట్లు రుజువు కావడంతో ఇద్దరిపైనా వేటు వేశారు.

పంచాయతీల్లో పన్ను వసూళ్లు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సాంకేతిక మార్పులు తీసుకొస్తున్నా అక్రమాలకు తెరపడటం లేదు. మేజరు పంచాయతీల్లో ఈతంతు మరీ ఎక్కువగా ఉంటోంది. కొన్నిచోట్ల కార్యదర్శులు, బిల్లు కలెక్టర్లు మిలాఖత్ కావడంతో అక్రమాలు బయటకు పొక్కడం లేదు. మరికొన్నిచోట్ల ఉన్నతాధికారులకు తెలిసినా సర్దుబాటు చేయడం, నోటీసులతో సరిపెట్టడం వంటివి కొనసాగుతుండటంతో అక్రమాల పర్వం కొనసాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవున్నాయి.

**'మేజర్'.. పాళ్లు ఇక్కడే..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేజర్ పంచాయతీలు 30 వరకు ఉన్నాయి. కాణిపాకం, తిరుచానూరు, సత్యవేడు, నాగలాపురం, నారాయణవనం, చంద్రగిరి, కార్వేటినగరం, జీడీనెల్లూరు, బంగారుపాళ్యెం, రేణిగుంట తదితర వాటిలో రూ.కోట్లలో ఆదాయం ఉంటోంది. ఇక్కడ గ్రేడ్–1 కార్యదర్శులను నియమించాల్సి ఉన్నా రాజకీయ పలుకుబడితో ఏళ్లతరబడి ఇన్‌ఛార్జులు కొనసాగడంతో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

**సొంత సిబ్బందితో..**

అధిక ఆదాయం వచ్చే పలు పంచాయతీల్లో సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ కింద పన్ను వసూలు సిబ్బందిని నియమించుకునే అవకాశం గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో సొంత అనుచర గణంతో ఆ విభాగాన్ని నింపేసి మన్ని మదింపు నుంచి వసూళ్ల వరకు చేతివాటానికి పాల్పడుతున్నారు. రెగ్యులర్ బిల్లు కలెక్టర్లు వారికి దారులు చూపుతున్నారు. చివరకు ఎవరూ గుర్తించకపోతే దొంగ బిల్లులతో లెక్కా పద్దులు




సరిచేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**పర్యవేక్షణ లేకనే..**

ప్రధానంగా మేజర్ పంచాయతీలపై ఈవోఆర్డీలు, డీఎల్‌పీవోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, పన్ను వసూళ్లు వంటి వాటిపై దృష్టి సారించడం చేపట్టాలి. అయితే ఆదిశగా దృష్టి సారించకపోవడం, ఇక్కడి ఆదాయాలపైనే అందరి కళ్లు ఉండటంతో అక్రమాలకు తెరపడటం లేదన్న ఆరోపణలున్నాయి.

**పకడ్బందీ చర్యలతో ముందుకు**

తిరుచానూరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఇటీవలే విచారణ పూర్తయింది. వాస్తవాలు నిర్ధారించుకుని బిల్లు కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. ఇకపై తరచూ మేజర్ పంచాయతీల్లో తనిఖీ చేపట్టి ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతాం. సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారిణి, తిరుపతి

**2024–25లో వసూళ్లు ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు : 1471

పన్ను డిమాండు : రూ.54 కోట్లు

వసూళ్లు : రూ.48.75 కోట్లు

బకాయిలు : రూ.5.25 కోట్లు

# ఇదే మెనూ.. పెట్టిందే తిను

నంద్యాల : ఉమ్మడి జిల్లాలోని బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన మెనూ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారుల పర్యవేక్షణ లేక ఆహారంలో నాణ్యత కరవవుతోంది. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రి వేళల్లో చికెన్ ఇవ్వాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాములు పెట్టాలి. కానీ కొన్ని ప్రాంతాల్లో సగటున ఒక్కో విద్యార్థికి 70 నుంచి 80 గ్రాముల మధ్యే ఇస్తున్నారు.

**నాణ్యత అంతంతే**

చాలా వసతిగృహాల్లో చికెన్ బిర్యానీకి బదులు కర్రీతోనే సరిపెడుతున్నారు. ఎక్కడా చికెన్ బిర్యానీ ఇవ్వడం లేదు. బిర్యానీకి తగ్గట్టు ఆహార పదార్థాల సరఫరా లేకపోవడంతో చికెన్, పలావ్ అన్నంతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో నాసిరకంగా వడ్డిస్తూ 'ఆదా' చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చికెన్ బిర్యానీతోపాటు రైతా ఇవ్వడం లేదు. కేవలం గోంగూర చట్నీతో మమ అనిపించేస్తున్నారు.

**కానరాని పరిశుభ్రత**

వసతి గృహాల్లోని వంట గదుల్లో శుచి శుభ్రత కానరావడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం వండుతున్నారు. నంద్యాలలోని బీసీ బాలుర వసతిగృహంలో భవనాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరుకోగా



ఇక్కడే భోజనాలు తయారవుతున్నాయి. దుమ్ము కొట్టుకుపోయిన గదుల్లో ఆహారం సిద్ధం చేస్తున్నారు. వంట గదుల్లో పరిశుభ్రత కానరావడం లేదు. అద్దె భవనాల్లోని వసతి గృహాల్లో పరిస్థితులు మరింత అధ్వానంగా ఉంటున్నాయి.

**కేవలం 26 మందే..**

డోన్ పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో 396 మంది ఉంటున్నారు. హాస్టల్‌ను ఆదివారం పరిశీలించగా 28 మంది విద్యార్థినులు కనిపించారు. 26 మంది బాలికలు భోజనం చేశారు. 30 మంది హాజరైనట్లు వసతిగృహం ఇన్‌ఛార్జి సంరక్షకురాలు తెలిపారు. చికెన్ బాగానే ఉన్నా అన్నం కాస్త మెత్తగా ఉండటంతో పిల్లలు సరిగా తినలేని పరిస్థితి నెలకొంది.

**గదుల కొరతతో ఇబ్బందులు**

వసతిగృహంలో గదుల కొరత తీవ్రంగా ఉంది. కనీసం సామగ్రి పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో గతంలో నిర్మించిన 12 మరుగుదొడ్ల సమూహం నిరుపయోగంగా ఉంది. వాటిని కూల్చేసి కొత్తవి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థినుల సంఖ్యకు తగ్గట్టు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. డోన్ పట్టణం

# రూ.కోట్లు ఖర్చు.. నీళ్లిస్తే ఒట్టు

డోన్ : డోన్ నియోజకవర్గ పరిధిలోని 131 గ్రామాలతో పాటు వెల్దుర్తి మండలంలో 4, బనగానపల్లి.. 2 గ్రామాలు, పాణ్యం మండల పరిధిలో ఒక గ్రామానికి గోరకల్లు జలాశయం ద్వారా తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ పథకాన్ని రూపొందించారు. 2021లో పనులకు శ్రీకారం చుట్టారు. రూ.351 కోట్లతో పైపులైను పనులు చేపట్టగా రూ.230 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. నిబంధనల ప్రకారం ఈ ఏడాది నవంబరు చివరి నాటికి గుత్తేదారుడు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఆలస్యంగా జరుగుతుండటంతో వచ్చే వేసవి నాటికైనా పూర్తవుతాయా అన్నది సందేహంగా మారింది. సుమారు 591 కిలోమీటర్ల మేర పైపులైను వేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 410 కి.మీ.ల వరకు వేశారు. ఇంకనూ 181 కి.మీల. మేర పూర్తి చేయాల్సి ఉంది.

**అటవీ అనుమతులు రాక..**



డోన్ మండలంలోని పలు ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకుగాను పైపులు సరఫరా వేశారు. రహదారి పక్కనే అలానే ఉంచేశారు. డోన్ సమీపంలోని నగరవనం, డోన్ కొండతోపాటు పలుచోట్ల అటవీ అనుమతులు రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం బేతంచెర్ల మండలంలోని బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాలకు మాత్రమే గోరకల్లు నీరు సరఫరా అవుతోంది. సిద్ధనగట్టు, గార్లదిన్నె, ఏనుగుమర్రి తదితర ప్రాంతాల్లో ట్యాంకుల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. 2023లోనే పనులు పూర్తి చేసి తాగునీరు అందించాల్సి ఉండగా ఇంకనూ సాగుతూనే ఉండటం గమనార్హం.

**గడువు పెంచుకుంటూ..**

పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికి 135 లీటర్లు, గ్రామాల్లో 100 లీటర్ల మేర తాగునీరు ఇవ్వాల్సి ఉంది. గోరకల్లు జలాశయం నుంచి 0.50 టీఎంసీని తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. వాస్తవానికి పనులు ఎప్పుడో పూర్తవ్వాల్సి ఉండగా.. గడువు పెంచుకుంటూనే వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చురకలు



## మహిళా సంఘాల్లో.. మొబైల్ బుక్‌కీపింగ్ అమలు!

అనంతపురం : లెక్కల్లో పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో కచ్చితత్వం ఉండాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల్లో మొబైల్ బుక్ కీపింగ్ విధానం అమలు చేసే యోచనలో ఉన్నారు. గతంలో బుక్ కీపర్లు సక్రమంగా వివరాలు నమోదు చేయకపోవడంతో పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ సొమ్ము స్వాహా చేయడంతో సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. అనంతపురం జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదట ఐదు గ్రామైక్య సంఘాలకు మొబైల్ బుక్‌కీపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ విధానం కొనసాగించే అంశం, లోటుపాట్లు తదితర అంశాలను చర్చించడానికి సెర్ఫ్ ఆధ్వర్యంలో ఈ నెలలో తిరుపతిలో సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.



**యాప్‌లో అనుసంధానం**

యాప్‌లో సంఘానికి సంబంధించి లావాదేవీలు అన్నీ అనుసంధానం చేయడంతో ప్రతి పైసా గురించి సభ్యులు అందరికి తెలుస్తుంది. తన చరవాణిలోనే ఎంత చెల్లించింది ఇంకా ఎంత అప్పు ఉన్నదో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. **పారదర్శకతకు అవకాశం ఉంటుంది.** సంఘం ప్రతి నెలా ఎక్కడ కూర్చొని సమావేశాలు నిర్వహిస్తారో అందుకు సంబంధించిన లొకేషన్, ఫేసియల్ రికగ్నేషన్ సమాచారం తెలుసుకోవచ్చు. తీసుకున్న రుణం, చెల్లింపులు, కొత్త రుణం వివరాలన్నీ చరవాణిలోనే చూసుకోవచ్చు. గతంలో మహిళా సంఘాల రుణాలు స్వాహా చేస్తే ఆలస్యంగా వెలుగులోకి వచ్చి పూడ్చుకోలేని నష్టం జరిగేది. ఈ విధానం వల్ల ఏదైనా లోటుపాట్లు, తప్పిదాలు, సొమ్ము అతిక్రమణల వివరాలన్నీ అధికారులు వేగంగా పరిశీలించి రికవరీ చేయవచ్చు.

## దిమ్మెలు తొలగించేదెన్నడు?

అనంతపురం : రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు మారడానికి పాతవంతెన స్థానంలో నూతన వంతెనను ఏర్పాటు చేశారు. ఈ వంతెన ఏడాది క్రితమే ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఉన్న పాత వంతెనను ఇటీవల కొంతమేర తొలగించారు. పాత వంతెన కోసం ఏర్పాటు చేసిన ఇనుప దిమ్మెలను ఇప్పటికీ తొలగించలేదు. ఈ దిమ్మెలు నాలుగు, మూడు ప్లాట్‌ఫారంపై అధిక స్థలాన్ని ఆక్రమించాయి. దీనికి తోడు పాత వంతెన దిమ్మెలు అడ్డుగా ఉండటంతో నూతనంగా ఏర్పాటు చేసిన వంతెన కూడా సరిగా కనిపించడం లేదు. కొత్తగా వచ్చిన ప్రయాణికులు వంతెన ఎక్కడుందో వెతుక్కోవాల్సిన



పరిస్థితి నెలకొంది. పాత వంతెన దిమ్మెలను తొలగించాలని పలుమార్లు పర్యటనల్లో భాగంగా డివిజన్ స్థాయి అధికారులు ఇంజినీర్లకు ఆదేశించారు. ఆరు మాసాలు గడుస్తున్నా ఇప్పటికీ వీటిని తొలగించలేదు. స్టేషన్‌లో పాత వంతెన దిమ్మెలు దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. వీటిని తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కృష్ణమ్మకు.. మరింత ఒరవడి

చిత్తూరు : కరవు ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) పెండింగ్ పనులపై ప్రధానంగా దృష్టి సారించింది. మొదటి ఏడాదిలో పుంగనూరు, కుప్పం కాలువలకు నిధుల వరద పారించింది. ఇప్పుడు ప్రధాన, నీవా కాలువల్లోని అసంపూర్తి నిర్మాణాలతోపాటు లైనింగ్‌కు పచ్చజెండా ఊపింది. తెలుగుదేశం హయాంలో 2014–19 మధ్య హంద్రీ– నీవా ప్రధాన కాలువ



185.32 కి.మీ. మేర తవ్వించి 90 శాతం పూర్తిచేసింది. అప్పట్లో 500 మీటర్లు మాత్రమే పెండింగ్ పనులున్నాయి. వాటిలో అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం పడమటికోన వద్ద 200, కలకడ దగ్గర 300 మీటర్లు మాత్రమే తవ్వాలి. కలకడ మండలం దొడ్డిపల్లి సమీపంలో మూడు కాంక్రీట్ నిర్మాణాలు, మరికొన్ని స్ట్రక్చర్లు, అక్విడక్టుల నిర్మాణం చేపట్టాలి. ఇవి పూర్తి చేసేందుకు ఆరునెలల సమయం సరిపోతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 60 నెలలూ వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. **బకాయిలు, పనులకు రూ.156 కోట్లు**

ప్రధాన కాలువ కింద గతంలో చేసిన పనులకుగాను రూ.61.06 కోట్ల బిల్లులు చెల్లించాలి. పెండింగ్ నిర్మాణాలకు మరో రూ.45.59 కోట్లు అవసరం. శ్రీసత్యసాయి జిల్లాలోనూ బకాయిలు, అసంపూర్తి పనులకు రూ.50 కోట్లు కావాలి. మొత్తంగా రూ.156 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావాలి. ఇప్పటికే హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించారు. నీవా బ్రాంచి కాలువకు మరో రూ.65 కోట్ల వ్యయమవుతుంది. ఇవి పూర్తయితే పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో దాదాపు 97 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చిత్తూరు నగర ప్రజల తాగునీటి ఇక్కట్లు తీరుతాయి.

**రెండేళ్లలో జలాలు వచ్చేలా**

హంద్రీ– నీవా ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువ లైనింగ్ అంచనా లు రూపొందించి ప్రభుత్వానికి పంపితే ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదించి నందున వెంటనే అనుమతులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లలో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# నకిలీ మకిలీ



ఎలమంచిలి : ఉమ్మడి విశాఖ జిల్లాలో నకిలీ మద్యం, సిగరెట్ల తయారీ యథేచ్ఛగా నడుస్తోంది. కంపెనీ బ్రాండ్లను తలపించేలా తయారు చేస్తున్నారు. ఎవరూ గుర్తించలేనంతగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ నుంచి స్పిరిట్ తదితర మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుని పరవాడలో నకిలీ మద్యం తయారు చేసి అచ్యుతాపురం మండలంలో విక్రయిస్తున్నారు.

ఒడిశా నుంచి ముడి సరకు తెచ్చి విశాఖలో నకిలీ సిగరెట్లను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. రూ.280 విలువ చేసే గోల్ట్‌ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్ ప్యాకెట్ దుకాణదారులకు రూ.80కే విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని ఐటీసీ ప్రతినిధులు గుర్తించి దుకాణాలపై దాడులు చేసి నకిలీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రాకెట్ నడుపుతున్న వ్యక్తులను పీఎం పాలెం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. అనకాపల్లి జిల్లాలోని పలు ప్రాంతాలకు నకిలీ సిగరెట్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. అచ్యుతాపురం పారిశ్రామికవాడను లక్ష్యంగా చేసుకుని అక్రమ మద్యం తయారీ ముఠాలు పనిచేస్తున్నాయి. గొలుసు దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఏది అసలు మద్యం, ఏది నకిలీ అనేది తెలుసుకోలేనంతగా మార్కెట్‌ను ముంచెత్తుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏసీ ప్రీమియం బ్లాక్ ఎక్కువ వినియోగంలో ఉంది. దీన్ని గమనించిన ముఠా ఈ బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ఇద్దరు వ్యక్తులు పెద్ద ఎత్తున మద్యం రాకెట్ నడుపుతున్నారంటే వీరి వెనుక పెద్ద తలకాయలే ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొలుసు దుకాణాలకు అచ్యుతాపురంలోని లైసెన్స్‌దుకాణాల నుంచే మద్యం సరఫరా అవుతోంది. వీరి కనుసన్నల్లోనే వ్యాపారం జరుగుతోంది. బయట నుంచి మద్యం వచ్చిందని తెలిస్తే వీరే దాడులు చేయిస్తారు. అలాంటిది లైసెన్స్ దుకాణాల యజమానులు నకిలీ మద్యం విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

అచ్యుతాపురంలో గతంలో నకిలీ మద్యం తయారు చేస్తూ దొరికిపోయిన వారున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పరవాడ కేంద్రంగా తయారీ ప్రారంభించి ఇక్కడ అమ్మకాలు చేపట్టారు. గతంలో ఇక్కడ చీప్ లిక్కర్‌ను ఖరీదైన లిక్కర్‌లో కలిపి మోసం చేసేవారు. ఇప్పుడు ఏకంగా తయారీనే ప్రారంభించారు. తాజాగా పట్టుబడిన నిందితుల్లో ఒకరు నకిలీ మద్యం అమ్మకాల కేసులో పాత నేరస్థుడిగా అధికారులు గుర్తించారు. వీరి వెనుక ఎవరున్నారన్న దానిపై పోలీసులు కూపీలాగుతున్నారు. పరవాడ, అచ్యుతాపురంలలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో రికార్డు స్థాయిలో కార్మికులు పనిచేస్తున్నారు. అమెరికాను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలకు అచ్యుతాపురం వేదికగా మారింది. ఈ కేసు మరిచిపోక ముందే నకిలీ మద్యం కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఎలమంచిలి ఎక్సైజ్ పోలీసులు రెండు రోజుల కిందట ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

# అరికడతారా.. వెలకడతారా..!



అనకాపల్లి: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. క్వారీ రాళ్లు, కంకర, మట్టి అధిక లోడుతో రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. అడపాదడపా జరిమానాలు విధిస్తూ సరిపెడుతున్నారు. బడాబాబుల కనుసన్నల్లో మైనింగ్ జరుగుతుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లారీల్లోంచి బండరాళ్లు జారి పడుతుండటంతో వెనుక వచ్చే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి రాంబిల్లి శివారు ప్రాంతానికి చెందిన ఈరుగుల కృష్ణ అచ్యుతాపురం వైపు వెళ్తుండగా.. జంగాలపాలెం వద్ద బండరాళ్ల లోడు లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అనకాపల్లి, రావికమతం, రోలుగుంట మండలాల్లో రాతి క్వారీలు అధికంగా ఉన్నాయి. వాటి నుంచి పరిమితికి మించిన లోడుతో బండరాళ్లను లారీల్లో తరలిస్తున్నారు. ఒక టిప్పరు 25 టన్నుల రాళ్లనే తీసుకెళ్లాలి. ఇందుకు భిన్నంగా అధిక బరువుతో రేయింబవళ్లు వందల సంఖ్యలో లారీలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో అధిక శాతం లారీలు పొరుగు జిల్లాలు నుంచి వచ్చేవే ఉంటున్నాయి. వాటిని ఒక్కసారీ ఆపి అధికారులు తనిఖీలు చేయడం లేదు. అచ్యుతాపురం పరిసరాల్లో రాత్రయితే రిజిస్ట్రేషన్ నంబర్లు లేని లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. రాంబిల్లి పరిసరాల్లో చీకటి పడితే కొంత మంది ముఠాగా ఏర్పడి సమీపంలోని కొండలను, చెరువుల నుంచి ప్రైవేటు లేఅవుట్లకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రవాణా శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా క్వారీ రాళ్లు, మట్టి తరలిస్తున్న వాహనాలపై ఈ ఏడాది 293 కేసులు నమోదు చేశారు. లారీలు, ట్రాక్టర్ల యజమానుల నుంచి జరిమానా వసూలు చేసి వదిలేశారు. నిబంధనల ప్రకారం రెండుసార్లకు మించి పట్టుబడినా, కాలం చెల్లిన వాహనాలు రోడ్డెక్కినా వాటిని శాశ్వతంగా సీజ్ చేయవచ్చు. ఇప్పటివరకు ఒక్క వాహనాన్నీ అలా సీజ్ చేయలేదు. వాహనం పట్టుబడితే నిమిషాల్లో నేతల నుంచి ఫోన్లు వస్తుండటంతో.. కంటితుడుపుగా జరిమానా వేసి వదిలేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్‌ను సంప్రదించగా.. 'అధిక లోడ్‌తో రాకపోకలు సాగించే లారీలపై కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానా విధిస్తున్నాం. కాలం తీరిన వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తా'మని చెప్పారు.

# కొండంత సమస్యలు..!



బోయకొండ : భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన చోట మరుగుదొడ్లు, కొండ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రోజుకో సేవ నిర్వహించి కొండపై ఆధ్యాత్మికతను పెంచి భక్తులను ఆకట్టుకోవాలని ఇటీవల దేవాదాయ శాఖ కమిషనరు ఆలయాన్ని సందర్శించిన సందర్భంలో ఆలయాధికారులకు సూచించారు. అయితే కమిషనరు వచ్చి రోజులు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు వేయలేదు. మరో వైపు ఆషాఢమాసం మొదటి ఆదివారం గడిచిపోయింది. సమస్యలు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

రాష్ట్రంలోని శక్తిక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన దేవస్థానం బోయకొండ గంగమ్మ ఆలయం. కొండకు సాధారణ సమయంలో కంటే ఈ ఆషాఢ మాసంలోనే ఎక్కువగా వస్తారు. అదే స్థాయిలో ఆదాయం సమకూరుతుంది. అయితే కొండపై కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**సమస్యలివే..**

కొండ కింద రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లోపం కారణంగా వినియోగానికి దూరంగా ఉన్నాయి. తగినన్ని మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గాలిగోపురానికి సమీపంలోని మరుగుదొడ్లు ఉన్నా వాటికి ఎప్పుడు తాళం వేసి ఉండటం గమనార్హం. అలాగే దేవస్థాన వసతి గృహాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉంటోంది. కల్యాణ కట్ట, రణబేరి గంగమ్మ ఆలయం పక్కన, పుష్కరిణి, దేవస్థానానికి దక్షిణ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి.

**పార్కింగ్ స్థలం కొరత**

అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను నేరుగా కొండపైకి తీసుకెళ్తారు. అక్కడ స్థలం కొరత ఉండటంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. టోల్ గేటు చెల్లిస్తున్నా వాహనాలు నిలుపుకోవడానికి స్థలం కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా భక్తులు తిరగడానికి ప్రధాన మెట్లు మినహా ఏ దారి లేదు.

**ఉన్న స్థలం నిరుపయోగం**

అటవీశాఖ నుంచి పార్కింగ్ స్థలానికి సేకరించిన స్థలం నిరుపయోగంగా ఉంది. ఆలయ అధికారులు, పోలీసులు సమన్వయం లేకపోవడంతో వచ్చిన వాహనాలను ఈ స్థలానికి మళ్లించడం లేదు. ఇష్టారీతిన వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

**చర్యలు తీసుకుంటాం..** కొండపై నెలకొన్న సమస్యలు వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం. ఏకాంబరం, ఈవో, బోయకొండ

## బడి బాగుచేసుకోండి..

చిత్తూరు : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విద్యాసంవత్సరం పునఃప్రారంభమైన 15 రోజులకే నిధులు కేటాయించింది. పాఠశాలల్లో మరమ్మతులు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, తదితరాల కొనుగోలు, విద్యుత్తు బకాయిలు తదితరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు. నిర్వహణ నిధులు విద్యా సంవత్సరంలో రెండు విడతలుగా విడుదల చేస్తారు. గత వైకాపా పాలనలో ఈ నిధులు విడుదల కాలేదు. దీంతో పాఠశాలల్లో ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులు పునరుద్ధరించి గత విద్యా సంవత్సరం నుంచే మంజూరు చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మొదటి విడతగా జిల్లాలోని 2,444 పాఠశాలలకు రూ.2.86 కోట్లు విడుదల చేసింది. పాఠశాలల బ్యాంకు ఖాతాలో నిధులు జమయ్యాయి. జిల్లాకు



మొత్తం రూ.5.16 కోట్లు అందులో మొదటి విడతలో పై మొత్తం విడుదలయ్యాయి.

**విద్యార్థుల సంఖ్య ఆధారంగా..**

నిర్వహణ నిధులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకటి నుంచి 30 మందికి రూ.10 వేలు, 31 నుంచి 100 మందికి రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251నుంచి వెయ్యి మంది వరకు రూ.75 వేలు ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష వరకు నిధులు ఇస్తారు.

## ఆర్పీలకు ఉద్యోగ భద్రత!

అనంతపురం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లోని రిసోర్స్ పర్సన్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు) మూడు సంవత్సరాలు మాత్రమే విధుల్లో ఉండాలనే నిబంధనలు విధించారు. దాంతో ఎప్పుడు తొలగిస్తారో అన్న భయం ఆర్పీలను వెంటాడేది. వైకాపా నేతలకు భయపడి వారు చెప్పినట్లే ఆయా సంఘాలకు పని చేసే దయనీయ పరిస్థితి ఉండేది. ఎన్నికల సందర్భంగా ఆర్పీల బాధకు ఉపశమనం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మూడేళ్ల కాలపరిమితి నిబంధనను తాజాగా తొలగిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.



ఉద్యోగ భద్రతతో పాటు భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో ఆర్పీల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

**మహిళా సంఘాల సమన్వయంలో ప్రధాన భూమిక**

ఆర్పీలు ఆయా నగర, పురపాలికల్లోని స్వయం సహాయక సంఘాలకు సంధానకర్తగా పని చేస్తారు. మహిళలను సంఘటితం చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో సంఘాలను సమన్వయం చేస్తారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, ఒనగూరే ప్రయోజనాలను ఒక్కో ఆర్పీ కనీసం 25 నుంచి 30 సంఘాల్లోని సభ్యులకు వివరిస్తారు. మెప్మా ద్వారా రూ.8 వేలు, సంఘాలు పొందిన ఆదాయం నుంచి రూ.2 వేలు ప్రతి నెలా గౌరవ వేతనం అందజేస్తారు.

## పల్లెకు పండగొచ్చింది.. ఉపాధి బిల్లు విడుదలైంది

చిత్తూరు : ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో సీసీరోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనులు చేపట్టిన వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పల్లె పం డుగ పనుల బిల్లులు సుమారు ఎనిమిది నెలల నుంచి పెండింగులో ఉన్నాయి.. ఆ పనుల తాలూకా బిల్లులు నిధులు రూ.45 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేశాయి.. పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో చెల్లింపులు జరుగుతున్నాయి.

**పాత బకాయిలు..**

నిధుల విడుదలతో గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు వేగం పుంజుకోనున్నాయి. 2014–19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేసిన పనుల తాలూకా బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపివేసి తీవ్ర ఇబ్బందులు పెట్టింది. చిత్తూరులో రూ.1,81,84,376, తిరుపతిలో రూ.2,42,11,799



బిల్లులు చెల్లించలేదు. ఆ బకాయిలు ఇప్పుడు విడుదల చేయడంతో అప్పట్లో పనులు చేసిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

**చెల్లింపులు జరుగుతున్నాయి..**

పాడి పోషణ ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాల్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 90 శాతం రాయితీ, 10 శాతం రైతుల వాటాతో షెడ్లు నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యానికి చేరువయ్యారు. వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.20.76 కోట్లు బిల్లుల చెల్లింపులకు వివరాలు అప్‌లోడ్ చేశారు. అందులో ఇప్పటి వరకూ రూ.6 కోట్ల మేర లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో జమ కాగా, త్వరలో మిగిలిన వారికీ జమవుతుందని అధికారులు అంటున్నారు.

**బకాయిలు జమవుతున్నాయి..**

చిత్తూరు జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీరోడ్లు, బీటీ దారులు, గోకులం షెడ్లు తాలూకు బిల్లులు రూ.57 కోట్లు అప్‌లోడ్ చేశాం. అందులో 50 శాతం ఇప్పటి వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యింది. మిగిలిన మొత్తం త్వరలో జమవుతుంది. రవికుమార్, పీడీ, డ్వామా

# కాపలాదారులకు కల్పతరువు

పాణ్యం : ఆర్థిక నష్టాలతో మూతపడిన పరిశ్రమ కొందరికి కాసులు కురిపిస్తోంది. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి మేలు చేసేలా ఏర్పాటు చేసిన నూలు పరిశ్రమ ఏళ్ల కిందట మూతపడింది. అక్కడ విలువైన సామగ్రి ఉండటంతో రక్షణ బాధ్యతలు ఓ ఏజెన్సీకి అప్పగించారు. వారి కన్ను అక్కడున్న చెట్లపై పడింది. గత 20 రోజులుగా సుబాబుల్, తుమ్మ, వేప తదితర విలువైన చెట్లు కొట్టేయిస్తున్నారు. సుబాబుల్ టన్ను ధర రూ.7 వేలు ఉంది. ఇతర కలప టన్ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు బేరం పెట్టారు. నిత్యం 40 నుంచి 50 టన్నుల కలపను తరలిస్తున్నారు. గత 20 రోజులుగా రూ.50 లక్షల వరకు వెనకేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**చిట్టడవిలా మిల్లు ప్రాంగణం**

పాణ్యం మండలం రైతులకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో 1986లో సహకార నూలుమిల్లుకు పునాది వేశారు. కర్నూలు-కడప జాతీయ రహదారి పక్కన 60 ఎకరాల్లో నిర్మించారు. నష్టాలు రావడంతో 1996లో లేఆఫ్ ప్రకటించారు. కొన్నాళ్లకు శాశ్వతంగా మూతపడటంతో 500 కుటుంబాల వరకు రోడ్డున పడ్డాయి. విలువైన యంత్రాలు తుప్పుపట్టాయి. భవనం శిథిలావస్థకు చేరింది.. పరిశ్రమ ప్రాంగణంలోకి ఖాళీ స్థలంలో చెట్లు పెరిగాయి. యంత్రాలను కొందరు ఎత్తుకుపోయారు. దీంతో జౌళీ శాఖకు చెందిన సిబ్బందిని కాపలాగా నియమించారు.

**పరికరాలకు పాత సామగ్రికి**

నూలుమిల్లు లోపల విలువైన యంత్రాలున్నాయి.. చాలా కాలం నుంచి వినియోగించకపోవడంతో తుప్పుపట్టాయి. స్థానికులు కొందరు



లోపలికెళ్లి ఎక్కడికక్కడ భాగాలు విడదీసి బేరం పెడుతున్నారు. గుజరీ దుకాణం వారికి విక్రయిస్తున్నారు.. కిలోల చొప్పున అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు.. ఇప్పటికే రూ.కోట్ల విలువైన ఇనుప సామగ్రి మాయమైంది. మిల్లుకు సంబంధించిన రుణ బకాయిల అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది.

**భద్రాచలానికి తరలింపు**

మిల్లు ప్రాంగణంలో ఏపుగా పెరిగిన చెట్లను గత 20 రోజులు కొట్టేస్తున్నారు.. వాటిని లారీల్లో తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. కాగితం తయారీకి సంబంధించి కలపను తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని ఓ మిల్లుకు తరలించారు. చెట్ల నరికివేత పట్టపగలే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎక్కడైనా చెట్లు తొలగించాలంటే అటవీ శాఖ అనుమతి తీసుకోవాలి.. ఇక్కడ ఎవరి అనుమతి తీసుకోలేదు. జౌళీ శాఖకు చెందిన కొందరు సిబ్బంది దగ్గరుండి చెట్లను కొట్టేయిస్తున్నారు. ఏకంగా యంత్రాలు పెట్టి పదుల సంఖ్యలో కూలీలతో తొలగిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు**

– నాగరాజరావు, ఏడీ, జౌళీ శాఖ

నూలుమిల్లులో చెట్లు తొలగించడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. విలువైన సామగ్రి దొంగలపాలవుతోందని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. చెట్ల తొలగింపు అంశం మా దృష్టికి రాలేదు.. వెంటనే అక్కడికెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# వైద్య విద్యకు తరగది కొరత

నంద్యాల : నంద్యాల మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు నాలుగేళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ చాలా భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. వసతిగృహాలు, తరగతి గదులు పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సరిపడా వసతులు ఉన్నాయి. మరో మూడు నెలల్లో మొదటి ఏడాదిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. వారు కళాశాలలో చేరేలోగా వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది విద్యార్థులు అవస్థలు పడాల్సిందే.

**నాలుగేళ్లుగా నత్తనడకన**

నంద్యాల మెడికల్ కళాశాల భవనాలను 2022 నుంచి నిర్మిస్తున్నారు. 2023లో తాత్కాలిక భవనాలు మాత్రమే చేపట్టి కళాశాలను ప్రారంభి



ంచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వసతిగృహాల నిర్మాణం మాత్రమే చేపట్టారు. మొత్తం రూ.450 కోట్లకు గాను ప్రస్తుతం రూ.100 కోట్ల పనులే చేశారు. గత ప్రభుత్వంలో విడుదలైన నిధులే ఖర్చు కాలేదని, వాటికి ఖర్చులు చూపితే మరిన్ని నిధులు కేటాయిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇటీవల నంద్యాలకు వచ్చినప్పుడు చెప్పారు. గతంలో తాత్కాలిక భవనాలు మాత్రమే నిర్మించడంతో ప్రస్తుతం విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**పాత భవనాలే దిక్కయ్యాయి**

వైద్య కళాశాలకు కేటాయించిన స్థలంలో ఆర్ఏఆర్ఎస్‌కు సంబంధించిన మూడు భవనాలు ఉన్నాయి. వాటిలో రెండింటిని వసతిగృహాలకు, మరో భవనాన్ని ఎగ్జామినేషన్‌కు ఉపయోగిస్తున్నారు. అవి లేకపోతే వసతిగృహాలు, ల్యాబ్‌లకు ఇతర అవసరాలకు భవనాలను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది.

**బోధనకు ఇబ్బందులు**

మెడికల్ కళాశాల కోసం నిర్మించిన తాత్కాలిక భవనాల్లో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 300 మంది చదువుతున్నారు. త్వరలో వీరు ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో అడుగుపెడతారు. మొదటి ఏడాదిలో మరో 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందనున్నారు. అప్పుడు మూడు తరగతి గదులు అవసరం అవుతాయి. ప్రస్తుతం రెండు తరగతి గదులు మాత్రమే ఉండటంతో ఇబ్బందులు తప్పేలా లేవు. తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులకు సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్ కేటాయిస్తే ప్రొఫెసర్లు ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి కళాశాలకు వెళ్లాలంటే కిలోమీటరు ప్రయాణించాల్సి వస్తుంది. దీనివల్ల సమయం వృథా అయ్యే ఆస్కారం ఉంది. నిర్మాణాలు త్వరగా పూర్తిచేస్తేనే విద్యా బోధన సాఫీగా సాగుతుందని ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు.

# సెంట్రల్ వర్సిటీలో ప్రవేశాలకు వేళాయె



బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద 492 ఎకరాల్లో ఏర్పాటైన సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకోవాలనే విద్యార్థులకు ఎనిమిది యూజీ, 17 పీజీ కోర్సులు, పీహెచ్‌డీలో 6 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి 15 డిప్లొమా కోర్సులు ప్రవేశ పెడుతున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్సిటీలో చదువుకోవడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించి, ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వర్సిటీలో ప్రవేశాలు కల్పిస్తారు.

**జులై చివరి వరకు ప్రవేశాలు**

జులై నెలాఖరు వరకు ప్రవేశాలు కొనసాగుతాయి. మిగిలిన సీట్లకు వర్సిటీలోనే విద్యార్థులకు తక్షణ ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రతి కోర్సుకు గరిష్ఠంగా 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. వర్సిటీలో చదువుకునే విద్యార్థులకు బాలికలు, బాలురకు వేరువేరుగా వసతిగృహాలు అందుబాటులో ఉంటాయి.

అనంతపురం పాతూరు నుంచి వర్సిటీకి నేరుగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. విద్యార్థులు నేరుగా వర్సిటీకి వచ్చి వివరాలు తెలుసుకోవచ్చని, ఆన్‌లైన్‌లో ఈనెల 20న దరఖాస్తు చేయడానికి ఆఖరు అని వర్సిటీ వర్గాలు తెలిపాయి. సీయూఏపీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వర్సిటీ ప్రొఫెసర్ కెనడీ తెలిపారు.

**ఎనిమిది యూజీ(డిగ్రీ) కోర్సులు**

డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు 8 కోర్సులు అందబాటులో ఉన్నాయి. బీఏ (పొలిటికల్‌సైన్స్), బీఏ (ఇంగ్లిష్), బీఎస్సీ(ఎకనామిక్స్), బీఎస్సీ (సైకాలజీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్-ఏఐ), బీకాం బీబీఏ, బీఎస్సీ రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు ఈ ఏడాది బీటెక్ (ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్) కొత్తగా అందుబాటులోకి వచ్చాయి.

**పీజీలో.. :** డిగ్రీ పూర్తి చేసి పీజీ చదవాలనుకునే విద్యార్థులకు 17 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఎంఏ(ఇంగ్లిష్), ఎంఏ (గవర్నెన్స్, పబ్లిక్ పాలసీ), ఎంఏ (హిందీ), ఎంఏ (పొలిటికల్ సైన్స్), ఎంఏ (తెలుగు), ఎంఎస్సీ (సైకాలజీ), ఎంఎస్సీ (ఏఐ) ఎంఎస్సీ (క్లినికల్ సైకాలజీ), ఎంఎస్సీ (కంప్యూటేషన్ సోషియల్ సైన్స్), ఎంఎస్సీ (ఎకనామిక్స్), ఎంఎస్సీ (ఎకనామిక్స్, డేటా అనాలసిస్), ఎంఎస్సీ (జాగ్రఫీ), ఎంఎస్సీ (మ్యాథమాటికల్, కంప్యూటింగ్), ఎంఎస్సీ (బయాలజీ), ఎంఎస్సీ (స్పేస్ సైన్స్, టెక్నాలజీ), ఎంబీఏ, ఎంకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. **పీహెచ్‌డీలో.. :** పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఆరు కోర్సులకు వర్సిటీ యాజమాన్యం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీటిలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ కోర్సు, తెలుగు, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులు ఉన్నాయి.

# వనాలు కొట్టెయ్.. భూములు పట్టెయ్!!



ఆనందపురం : ఆనందపురం మండలంలోని ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమార్కుల కన్ను పడింది. మొన్న దబ్బందలో దర్జాగా 80 అడుగుల రోడ్డు వేయగా ..తాజాగా రామవరంలో డి-పట్టాల పేరిట ప్రభుత్వ భూమిలోకి చొరబడేందుకు యత్నిస్తున్నారు. ఇందుకు వీలుగా సుమారు 21 ఎకరాల్లో ఖరీదైన చెట్లను అక్రమంగా నరికి కలపను తరలిస్తున్నారు.

రామవరంలోని ఓ సర్వే నంబర్‌లో 21 ఎకరాల గెడ్డ వాగు ఉంది. దీనిలో ఆరు కుటుంబాలకు 1987లో 7 ఎకరాల భూమిని డి-పట్టాల కింద ఇచ్చారు. పెద్ద పెద్ద గెడ్డలతో కూడిన వాగు కావడంతో వాటిని రద్దు చేసి.. సదరు వ్యక్తులకు మళ్లీ 1997లో మరో సర్వే నంబర్‌లో రెట్టింపు భూమిని డి-పట్టాల కింద అందజేశారు. అయితే.. ఆ భూములోకి ఎవరూ సాగులోకి రాలేదు. సహజ సిద్ధంగానే అక్కడ ఆకేష్, టేకు, వేప వంటి తదితర చెట్లతో పెద్ద తోటగా మారింది.

రాష్ట్ర విభజన సమయంలో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు రావడంతో విశాఖలో స్థిరపడిన ఓ పోర్టు గుత్తేదారుడి కన్ను వాటిపై పడింది. 1987 నాటి డీఆర్ ఫైల్‌లో ఆ వ్యక్తుల పేర్లు తొలగించకపోవడాన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ శాఖలో ఉన్న పలుకుబడితో 2017లో కొత్తగా తయారు చేసిన డీఆర్ ఫైల్‌లోకి సదరు వ్యక్తుల పేర్లను చేర్పించాడు.

ఇటీవల డి-పట్టాల ఫ్రీహోల్డ్ సమయంలో సదరు వ్యక్తులతో దరఖాస్తు చేయగా ఈ విషయాన్ని పసిగట్టిన అప్పటి రెవెన్యూ అధికారులు నిరాకరించారు. ఈ క్రమంలో డి-పట్టాలతో చొరబడేందుకు వీలుగా తొలుత పెద్ద పెద్ద వృక్షాలతో కూడిన తోటను దర్జాగా నరికి తరలిస్తున్నారు.

**అక్కడ వారి సహాయంతో...**

ఈ భూముల్లో పెరిగిన ఆకేష్, టేకు తరలించడానికి అటవీ శాఖ అనుమతులు కావాలి. కానీ కొందరు అధికారుల సహాయంతో వారం రోజులుగా చెట్లను తొలగిస్తున్నట్లు ఆరోపణ లొచ్చాయి. ఓ దశలో గ్రామస్థులు అడ్డుకోవడంతో కూటమి ప్రభుత్వంలో కీలక వ్యక్తినని, ఇక్కడ బీటీ రోడ్డును తానే వేయించానని గ్రామస్థులకు చెబుతూ చలామణి అవుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు.

ఒక వేళ ఈ భూముల్లో పట్టాలు ఇస్తే 1987 నుంచి ఇంతవరకు సాగులోకి ఎందుకు రాలేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతున్నారు.

# రైతు వేదిక... వ్యాపారి వేడుక



కర్నూలు : "నగరంలో చిన్న గోదాము అద్దె నెలకు రూ.లక్షకు తక్కువ ఉండదు.. అలాంటిది కర్నూలు మార్కెట్‌లో ఒక గోదాముకు రూ.44 వేల అద్దె నిర్ణయించారు. బాడుగ తక్కువగా ఉండటంతో కొందరు పైరవీలు చేసి దక్కించుకొని వాణిజ్య కేంద్రంగా మార్చుకొంటున్నారు."రైతులకు సేవలందించాల్సిన మార్కెట్ కమిటీలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. నిబంధనలు తుంగలో తొక్కి.. అక్రమ మార్గాల్లో పయనిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్లలో వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను బహిరంగ మార్కెట్ కంటే అతి తక్కువ ధరలతో వ్యాపారులకు అప్పగించారు. కొందరు వ్యాపారులు రాజకీయ పలుకుబడితో.. మరికొందరు అధికారులకు పెద్దఎత్తున ముడుపులిచ్చి గోదాములను దక్కించుకున్నారు.జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 36,540 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 33 గోదాములు ఉన్నాయి. ఇందులో 20 బాడుగకు ఇచ్చారు. మరో 13 నిరుపయోగంగా ఉన్నాయి. కర్నూలు మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నచందంగా మారింది. రైతులకు ఉపయోగపడాల్సిన షెడ్డు.. వ్యాపారుల సొంతమవుతున్నాయి. వ్యాపారులు బయట దుకాణాలను అద్దెకు తీసుకుంటే ఒక నెలకు రూ.5-6 వేల అవుతుంది. అలాంటిది మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు నామమాత్రపు అద్దెలతో చేజిక్కించుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల్లోనే షెడ్డు కాస్త.. వ్యాపారుల దుకాణాల సముదాయంగా మారుతోంది.కర్నూలు నగర నడిబొడ్డులో కొత్త బస్టాండు సమీపంలో పుచ్చలపల్లి సుందరయ్య జంక్షన్ వద్ద రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములున్నాయి. మూడు గోదాముల్లోనే ఎరువుల నిల్వలున్నాయి. ఒకటి గోనె సంచుల వ్యాపారి కేటాయించగా.. మరో నాలుగు గోదాములను వ్యాపారులకు కేటాయించారు. ఎరువుల గోదాములు.. వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారాయి.కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో రైతుల ఉపయోగార్థం ఏర్పాటుచేసిన గోదాములు వ్యాపారులు, ప్రైవేటు వ్యక్తుల పరమయ్యాయి. గతేడాది డిసెంబరులో ఓ గోదామును సోలార్ ప్యానల్స్ ఏజెన్సీకి అద్దెకు ఇచ్చారు. నెలకు రూ.44 వేలు అద్దె నిర్ణయించారు.

**రైతుల షెడ్డు.. మిర్చి వ్యాపారం**


కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని కూరగాయల మార్కెట్‌లో ఒకటో నంబరు గోదాము(షెడ్డు) ఎండుమిర్చి వ్యాపారుల సొంతమైంది. రాష్ట్రంలో ఎక్కడా వ్యాపారులకు దుకాణాల షెడ్లు కేటాయించిన దాఖలాలు లేవు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులకు నామమాత్రపు అద్దెలకు దుకాణాలు కేటాయించారు. షెడ్డు లోపల, బయట కలిపి మొత్తం 20 దుకాణాలకు వేలం పాట నిర్వహించి వ్యాపారులకు అప్పగించారు. నిబంధనల ప్రకారం దుకాణాల కోసం స్థలం కేటాయించాలన్నా.. బహిరంగ వేలం నిర్వహించాలన్నా.. వారం పది రోజుల ముందు ప్రకటన జారీ చేయాలి. ఆ తర్వాతే వేలం నిర్వహించి దుకాణాల కేటాయింపు చేయాలి. అలాంటివేమీ చేయకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు మిర్చి వ్యాపారులకు షెడ్డులో స్థలాలు కేటాయించారు. పెద్ద దుకాణాలకు ప్రతి నెలా అద్దె రూ.1,800 నుంచి రూ.1,900, చిన్న దుకాణాలకు రూ.1,300-రూ.1,500 వరకు ఖరారు చేసి వ్యాపారులకు అప్పగించారు.

# రండి.. మేం చూసుకుంటాం

భీమవరం: ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశాలకు ఇంకా కౌన్సెలింగ్ షెడ్యూలు విడుదల కాలేదు. కాని చాలా కళాశాలల్లో సీట్లు భర్తీ చేసుకునే పనిలో యాజమాన్యాలు నిమగ్నమయ్యాయి. ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల కావడంతో కళాశాలలు సీట్ల భర్తీకి తెరదీశాయి. ఇదే అదనుగా కావాల్సిన కళాశాలలో కోరిన కోర్సుల్లో సీట్లు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు సిద్ధమైపోయారు. కొంచెం పేరున్న కళాశాలల్లో చాలావరకు కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈసీఈ బ్రాంచీల్లో సీట్లు ఇప్పిస్తామంటూ మాయ చేస్తున్నారు.

గతేడాది తణుకు పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తన కుమార్తెకు ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ సీటు కోసం మధ్యవర్తిని ఆశ్రయించి మోసపోయారు. జంగారెడ్డిగూడెంలో ఓ ప్రైవేటు ఉద్యోగి ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నా, చాలామంది తల్లిదండ్రులు ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు. భీమవరంలో రెండేళ్ల కిందట ఇంజినీరింగ్‌లో సీట్లు ఇప్పిస్తామంటూ ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి రూ.లక్ష వరకు మోసం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో ఏపీ ఈఏపీసెట్ లో ఇంజినీరింగ్ 8,330,



అగ్రికల్చర్ 3,360 మంది, ఏలూరు జిల్లాలో ఇంజినీరింగ్‌లో 3,409, అగ్రికల్చర్‌లో 1726 మంది అర్హత సాధించారు. కౌన్సెలింగ్ ప్రారంభమైన తర్వాత ర్యాంకు రాకపోతే, కోరుకున్న కళాశాలలో సీటు దక్కదని.. అప్పుడు బాధపడినా ప్రయోజనం ఉండదని విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. యాజమాన్యాలతో మాట్లాడుకుంటే ర్యాంకు వస్తే ఆ కోటాలో సీటు ఖరారు చేసుకోవచ్చని, లేకపోతే దాన్ని మేనేజ్‌మెంట్ కోటా లేదా ఎన్నారై కోటాకు మార్చుకోవటానికి అవకాశం కల్పిస్తామంటూ మధ్యవర్తులు మభ్యపెడుతున్నారు. యాజమాన్యాలు సైతం సీట్లకు డొనేషన్లు, ఫీజులు వసూలు చేసుకునే పనిలో పడ్డాయి.

**ముందస్తు పేరుతో..** ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుందామని వేచిచూస్తే కోరుకున్న కళాశాలలో సీటు దొరక్కపోతే పరిస్థితి ఏంటనే సందిగ్ధతను తల్లిదండ్రుల్లో లేవనెత్తుతున్నారు. ముందస్తుగా కొంత అడ్వాన్స్ ముట్టచెబితే ఆయా కళాశాలల్లో సీటు సొంతమవుతుందని నమ్మబలుకుతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, వ్యవసాయ కోర్సులు చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి బేరసారాలు చేస్తున్నారు. అడ్వాన్స్ ఇస్తే సీటు రిజర్వు చేస్తామంటూ మాయ చేస్తున్నారు.

# గండం గట్టెక్కినట్లే!

పాలకొల్లు : జిల్లాలో గోదావరి తీరాన పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాలు ఉన్నాయి. శివారునున్న యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లో గట్టు బలహీనంగా ఉండటంతో పలు ప్రాంతాలను ప్రమాదకర ప్రదేశాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో గట్టును పటిష్ఠ పరచాలని 2020లోనే అధికారులు నివేదికలు తయారు చేసినా గత వైకాపా ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడతగా యలమంచిలి మండలంలో గట్టు ఎత్తు పెంచి పటిష్ఠ పరచడానికి రూ.8 కోట్లు మంజూరు చేసింది. గడిచిన మూడు నెలల్లో ఆయా పనులు 80 శాతానికి పైగా పూర్తిచేశారు. మిగిలిన పనులకు నిధుల మంజూరు కోసం నిరీక్షిస్తుండగా తాజాగా విడుదలయ్యాయి.

యలమంచిలి మండలం బూరుగుపల్లి నుంచి దొడ్డిపట్ల వరకు పలుచోట్ల ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో వరదల వేళ స్థానికులు కంటిమీద కునుకు లేకుండా కాపలా కాసేవారు. 2022, 2023 సమయంలో వచ్చిన వరుస వరదలకు గోదావరి నీరు పొంగుతూ ఏటిగట్టుపైకి చేరుతుంటే ప్రజలు శ్రమదానం చేసి ఇసుక మూటలు కట్టి వరదను నిలువరించారు. వరదొస్తుందంటే తీరానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఏటా ఆందోళన కనిపించేది. కూటమి ప్రభుత్వం



వచ్చాక దశలవారీగా ఏటిగట్టు పటిష్ఠ పనులు నిర్వహించడం ఊరటనిస్తుంది.

**రెండో విడతలో రూ. 8.94 కోట్లు**

మొదటి విడతలో కె.ఎస్.పాలెం నుంచి అబ్బిరాజుపాలెం వరకు పనులు చేయడానికి నిధులు మంజూరు చేశారు. రెండో విడతలో అబ్బిరాజుపాలెం నుంచి ఏనుగువానిలంక వరకు గట్టు బలహీన ప్రాంతాల్లో పటిష్ట పరచడానికి రూ.8.94 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 9న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నిధులు వినియోగించి లక్ష్మీపాలెం, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక ప్రాంతాల్లో పనులు చేయనున్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో పనులు పూర్తయితే వరద గండం నుంచి బయటపడవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

**వంతెనకు రూ.28 లక్షలు**

అబ్బిరాజుపాలెంలో బ్యాంకు కెనాల్ పైనుంచి ఏటిగట్టు వైపునకు వంతెన నిర్మాణానికి రూ.28 లక్షలు మంజూరయ్యాయి. ఆయా పనులకు టెండర్లు పిలిచి పనులు అప్పగించాల్సి ఉంది. దీనిపై ధవళేశ్వరం సెక్షన్ డీఈ సుబ్బారావును సంప్రదించగా గతంలో చేసిన ప్రతిపాదనలకు నిధులు విడుదలయ్యాయన్నారు. పనులు పూర్తయితే వరదలు నిలువరించగలిగే స్థితికి ఏటిగట్టు తయారవుతుందన్నారు.

# ఇప్పటికింతే..!

చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్.. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నా వారి వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. విదేశాలకు పెద్దగా ఎగుమతులు లేవని, ఉన్న గుజ్జునే తక్కువ ధరకు అమ్ముకున్నా కొనుగోలు చేసిన వ్యాపారుల నుంచి డబ్బులు రాలేదని నిర్వాహకులు అధికారులకు సమాధానమిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టన్నుకు రూ.6-7 వేలే ఇవ్వగలమని తెగేసి చెబుతున్నారు. మూడు- నాలుగు రోజుల తర్వాతే సర్కార్ ఆదేశించినట్టు టన్నుకు రూ.8 వేలు వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని గుజ్జు పరిశ్రమలు ఇప్పుడిప్పుడే ఉత్పత్తి ప్రారంభిస్తుండటంతో తోతాపురి రైతులు కర్మాగారాల బాట పడుతున్నారు. మార్కెట్‌లో అంతగా డిమాండ్ లేదని పదే పదే యాజమాన్యాలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ధరలు పడిపోకుండా యంత్రాంగం కదిలింది. అన్నదాతలకు ప్రభుత్వం నుంచి అదనంగా టన్నుకు రూ.4 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం వివరాలు సేకరిస్తోంది. పక్వానికి వచ్చే కాయలే పరిశ్రమలకు తేవాలని రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిఅవగాహన కల్పిస్తున్నారు. నెలాఖరు వరకు ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తేనే అన్నదాతలకు నష్టం వాటిల్లదు. మిగిలిన గుజ్జుపరిశ్రమలూ వీలైనంత త్వరగా తెరిస్తే మరికొంత గిట్టుబాటు ధర లభిస్తుంది.

**41కు 21 చోట్లే కార్యకలాపాలు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 41 గుజ్జు పరిశ్రమల్లో దాదాపు 20 ప్రారంభమయ్యాయి. మిగిలిన 21 కూడా త్వరగా కార్యకలాపాలు ప్రారంభించాలి. వీలైనంత త్వరగా ఇవి మొదలైతే రైతులకు పడిగాపులు పడే పరిస్థితి తప్పుతుంది. తమిళనాడులోని క్రిష్ణగిరి, ధర్మపురితోపాటు



మరో ఐదు జిల్లాల్లో ఈ నెలాఖరుతో తోతాపురి కోతలు ఆగిపోతాయి. అప్పటివరకు ధరలు పడిపోకుండా చూడాలి. తర్వాత పరిశ్రమల యాజమాన్యాలే తమకు మామిడి కావాలని రైతులను అడిగే పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జులైలో 15 రోజుల పాటు కోతలు ఉంటాయి. ఆ సమయంలో ధరలు అధికంగా ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**తేవాల్సినవి ఇవే..**

పరిశ్రమల వద్దకు తోతాపురి మామిడి తెచ్చే రైతులు వెంట ఆధార్ కార్డు జిరాక్సు, 1బీ/ పట్టాదారు పాస్ పుస్తకం/ అడంగల్ జిరాక్సు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకురావాలి. అప్పుడే ప్రభుత్వం అదనంగా ప్రకటించిన టన్నుకు రూ.4 వేల నగదు వారి ఖాతాలో జమ అవుతుంది.

**ర్యాంపుల వద్ద ఎలా?**

చిత్తూరు జిల్లాలో 35 ర్యాంపులున్నాయి. ఉమ్మడి జిల్లాలో వీటి సంఖ్య 50. పరిశ్రమలు, మండీలతో పోలిస్తే ఇక్కడ ధరలు మరింత తగ్గిస్తారు. వెంటనే డబ్బులు ఇస్తారనే ఉద్దేశంతో కొందరు ఇక్కడ విక్రయించేందుకు ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ఇక్కడ గిట్టుబాటు ధర లభించేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలా? అని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రస్తుతానికి రెవెన్యూ యంత్రాంగాన్ని గుజ్జు పరిశ్రమల వద్ద మోహరించారు. రెండు- మూడు రోజుల అనంతరం ఇక్కడ కూడా సిబ్బందిని నియమించనున్నారు. వీలైనంత త్వరగా ఉంచితే నిర్వాహకులకు ఎంతోకొంత భయం వస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ధరతో కలిపి టన్నుకు కనీసం రూ.10-11 వేలు లభిస్తుంది.

**తోతాపురికి రూ.6-7 వేలు**

మిగతా గుజ్జు పరిశ్రమలు తెరిస్తేనే గిట్టుబాటు

పకడ్బందీ చర్యలతోనే రైతులకు ఉపశమనం

# మా పంచాయతీలు బంగారం

చిత్తూరు : గ్రామ పంచాయతీలు స్వర్ణమయంగా మారనున్నాయి. అన్ని కుటుంబాలకు ఆధార్ సంఖ్యతో అనుసంధానిస్తున్నారు. పౌరులు చెల్లించే పన్నుల వివరాలు డిజిటలైజ్ చేయిస్తున్నారు. అన్ని చోట్లా ఇంటర్నెట్ సౌకర్యం ఉండటంతో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగవంతం చేసింది. గతంలో ఆదాయాన్ని కొందరు పంచాయతీ కార్యదర్శులు దారి మళ్లించేవారు. ఫలితంగా వారి చెక్ పవర్ రద్దయి, అభివృద్ధి పనులు కుంటుపడేవి. ప్రస్తుతం ఆధార్‌తో అనుసంధానం చేస్తే అన్ని రకాల పన్నుల వివరాలు పారదర్శకం అవుతాయి. పంచాయతీల్లో జరిగే ప్రతీ పని అందరికీ తెలుస్తుంది. జిల్లాలో స్వర్ణ పంచాయతీల ప్రక్రియ సాగుతోంది. 696 పంచాయతీల్లో 3,09,783 కుటుంబాలను ఇంటి యజమాని ఆధార్ నంబరుతో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇంటి పన్ను చెల్లించాలని గుమాస్తాలు,



కార్యదర్శులు ఇంటింటికి తిరిగేవారు. డిమాండ్ నోటీసులు జారీ చేసేవారు. ఇకపై ఆ ఇబ్బందులు తప్పనున్నాయి.

**30 రకాల సేవలు..** అన్ని సేవలు ఆన్‌లైన్‌లో లభించనున్నాయి. పౌరులు ఆన్‌లైన్‌లోనే బకాయి వివరాలు తెలుసుకుని ఇంటి, కుళాయి పన్ను, లైసెన్స్ ఫీజు చెల్లించవచ్చు. పంచాయతీల్లో పన్నుల వసూళు వేగవంతం చేయడానికి, జవాబుదారీతనం కోసం ఇలా ఆన్‌లైన్ ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేస్తున్నారు. ఇంటి స్థలం సరిహద్దులు తదితర 30 రకాల వివరాలు స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తున్నారు. ఫలితంగా పౌరసేవల్లో వేగం, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా వస్తాయి.

**చిత్తూరు జిల్లా గణాంకాలు**

కుటుంబ యజమానులు: 2,82,970

ఆధార్‌తో అనుసంధానం:2,47,358 (87.41 శాతం)

ఉమ్మడి కుటుంబాల యజమానులు: 23,766

ఆధార్‌తో అనుసంధానం :15,423(64.9)

ప్రభుత్వ ఉద్యోగుల్లో యజమానులు : 3,117

ఆధార్‌తో అనుసంధానం : 1,845(59.19)

# కూటమి పాలనలో పరిశ్రమల పరంపర



పెనుకొండ : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కుల్లో 41 నూతన పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులకు 1453.02 ఎకరాల భూమిని కేటాయించారు. జిల్లాలో ఐపీ(ఇండస్ట్రియల్ పార్క్), యూడీఎల్(అన్‌డెవలప్డ్ ల్యాండ్), ఎంఎస్‌ఎంఈ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పేరుతో ఏపీఐఐసీ భూములు అభివృద్ధి చేసి, మడకశిర, గుడిపల్లి, ఆర్.అనంతపురం, అమ్మవారిపల్లి, ఎర్రమంచి, కప్పలబండ, గోళ్లాపురం, కొటిపి 8 పారిశ్రామిక వాడల్లో నూతన పరిశ్రమల కోసం స్థలం సిద్ధంగా ఉంచారు.

**యువతకు ఉపాధి అవకాశాలు**

జిల్లాలో రానున్న 41 నూతన పరిశ్రమల ద్వారా 6,192 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఇది పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే పలుచోట్ల పరిశ్రమలు నిర్మాణంలో ఉన్నాయి. మరికొన్ని పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూములకు నగదు చెల్లించి, పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన పరిశ్రమల ద్వారా జిల్లాకు రూ.4497.83 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. పరిశ్రమల రాకతో వలసలు తగ్గిపోయి స్థానికంగానే ఉపాధి పొందే అవకాశాలు మెరుగయ్యాయి. ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడంతో చిన్నతరహా పరిశ్రమలు స్థా.పించేందుకు, చిరువ్యాపారులే పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి మంచి అవకాశం లభించింది. పెనుకొండ నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కోసం సీడ్‌యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి పరిశ్రమలు స్థాపింపజేసి పారిశ్రామిక వేత్తలగా తయారు చేయనున్నారు.

**చిరు వ్యాపారులకు సైతం ఆదాయం**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క పరిశ్రమ రాలేదు. ప్రస్తుతం నూతన పరిశ్రమలు రావడం వల్ల సొంతూళ్లలోనే యువతకు ఉపాధి లభిస్తుంది. ఉపాధితో పాటు స్థానికంగా వ్యాపారాలు, భూమి ధరలు, ఇళ్ల అద్దెలు, వాహనాలు, స్థలాల అద్దెలు పెరుగుతాయి. చిరువ్యాపారులకు సైతం ఆదాయం పెరుగుతుంది. పరిశ్రమలు రావడం సంతోషంగా ఉంది. ప్రశాంత్, పెనుకొండ

# దివ్యమైన ప్రయోజనం!




అనంతపురం : దివ్యాంగులు, వయోవృద్ధులకు దివ్యమైన ప్రయోజనం చేకూర్చే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపింది. 2019 తర్వాత దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు ఇవ్వడానికి ఎంపిక శిబిరాలు నిర్వహించలేదు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలిమ్‌కో) ద్వారా సహాయ పరికరాలు అందివ్వాలని నిర్ణయించారు. అనంతపురం జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో ఒకరోజు చొప్పున ఈనెల 12న ప్రారంభమైన శిబిరాలు 18 వరకు కొనసాగించనున్నారు. అనంతపురం జిల్లాలో 50వేల మంది వరకు వివిధ రకాల కేటగిరీలకు చెందిన దివ్యాంగులు ఉన్నారు. ఇందులో కనీసం 6 వేల నుంచి 7 వేల మంది వరకు సహాయ పరికరాలు అవసరం ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమశాఖ అంచనా వేసింది.


**సహాయ పరికరాలు ఇవే**

పలురకాల దివ్యాంగులకు సహాయ పరికరాలు ఇవ్వడానికి గుర్తిస్తారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్లు, రోలేటర్స్, ఎం.ఎస్.కిట్లు, అంధులకు చేతి వాచీ, చేతి కర్రలు, వాయిస్ ఫోన్, ఎల్బో క్రచస్, లెప్రసీ బాగైన వ్యాధిగ్రస్థులకు కిట్లు, డైసీ ప్లేయర్, యం.యస్.ఐడీ కిట్స్, స్మార్ట్ కేన్, కృత్రిమ అవయవాలు తదితర ఉపకరణాలు ఇవ్వడానికి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. ఎంపిక అనంతరం మళ్లీ ప్రత్యేకంగా క్యాంపు నిర్వహించి ఉచితంగా అందజేస్తారు.

**అర్హతలు.. అవసరమైనవి..**

క్యాంపులకు హాజరయ్యే వారు యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ, రేషన్‌కార్డు తదితరాలను రెండుసెట్ల జిరాక్స్ తీసుకొని రావాలి. ఫోటోలు-4, మొబైల్ నంబరు ఇవ్వాల్సి ఉంటుంది. దివ్యాంగులు, వయోవృద్ధులు వారి అనుకూలతను బట్టి నిర్ణీత తేదీల్లో ఏ నియోజకవర్గంలో అయినా హాజరు కావడానికి వెసులుబాటు ఉందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు వినోద్ పేర్కొన్నారు.

# భారీ స్థాయిలో బదిలీలు



అనంతపురం : ముఖ్య శాఖల్లో అధికారులను భారీ స్థాయిలో బదిలీ చేశారు. ఈమేరకు ఆయా అయా శాఖల నుంచి ఉత్తర్వులు అందాయి.

**పట్టుపరిశ్రమ శాఖలో**

ఉమ్మడి జిల్లాలో జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు ఈ మేరకు ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి ఆంజనేయులును కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలులో పనిచేస్తున్న విజయకుమార్‌ను నియమించారు. హిందూపురంలో డీడీఎస్‌గా శ్రీనివాసులును (సీడ్) కదిరికి, శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి గోవిందప్పను (సీడ్) హిందూపురానికి, శ్రీసత్యసాయి జిల్లాలో డీఎస్‌వోగా పనిచేస్తున్న ఈశ్వరప్పను ధర్మవరానికి బదిలీ చేశారు.

**సహాయ సంచాలకులకూ...**

హిందూపురం అలివేలమ్మను అనంతపురానికి, అనంతపురంలో పద్మావతిని నంద్యాలకు, ధర్మవరం నుంచి గౌరిని అనంతపురానికి, హిందూపురం బాలసుబ్రహ్మణ్యంను రాయచోటికి, పెనుకొండలో పనిచేస్తున్న నాగభూషణంను మడకశిరకు, పెనుకొండలో రాజేశ్వరిని ధర్మవరానికి, హిందూపురం ముక్తాశ్రీ అనంతపురానికి, మడకశిరలో నవీన్‌కుమార్‌ను మదనపల్లికి, పుట్టపర్తి రేణుకను అనంతపురానికి, హిందూపురం లక్ష్మిరెడ్డిని కడపకు, కదిరి రామకృష్ణను కుప్పంకు, మడకశిర ప్రతాప్‌నాయక్‌ను పలమనేరుకు, కదిరి హాజీజ్‌ను హిందూపురానికి పెనుకొండ జయచంద్రారెడ్డిని కుప్పంకు, మడకశిర రాజశేఖర్‌ను కదిరికి, కళ్యాణదుర్గం ఫిరోజ్‌బాషాను పలమనేరుకు, అనంతపురం ఓబుళేసును పెనుకొండకు, హిందూపురం రవినాయక్‌ను మదనపల్లికి బదిలీ చేశారు.

**ఉద్యానశాఖలో...**జిల్లా ఉద్యానశాఖ ఉప సంచాలకులు అండాల్‌ను విజయవాడకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కర్నూలులో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవిని నియమించారు. ఏడీఏహెచ్ నరసింహారావును నెల్లూరుకు ఏడీహెచ్ పల్లవిని కుప్పంకు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌ను కర్నూలుకు, అనంతపురానికి ఏడీహెచ్ దేవానందకుమార్‌ను, అనంతపురం మున్సిపాలిటీకి ఏడీహెచ్ రాధాకృష్ణారెడ్డిని బదిలీ చేశారు. హెచ్‌వోలు రాప్తాడుకు దివ్య, అనంతపురం గ్రామీణంకు రత్నకుమార్, నార్పలకు నెట్టికంటయ్య, ఉరవకొండకు యామినిని బదిలీ చేశారు.

**ఏవోల్లో ఉత్కంఠ** వ్యవసాయశాఖలో ఏవోలను బదిలీ జాబితా మంగళవారం ఉదయం జిల్లాకు చేరింది. మధ్యాహ్నం చిన్న చిన్న తప్పులు దొర్లాయి. సరిచేసి ఇస్తాం. అంతవరకు ఎవరినీ రిలీవ్ చేయొద్దు కొత్త స్థానాల్లో చేరకుండా చూడాలని జిల్లా జేడీఏకు సంక్షిప్త సందేశం రాష్ట్ర కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చింది. దీంతో ఏవోల్లో ఉత్కంఠ నెలకుంది.

**మత్స్యశాఖలో**ఎంపీఆర్ డ్యాం మత్స్య అభివృద్ధి అధికారి ఆసీఫ్ బైరవానితిప్ప ప్రాజెక్టుకు, బైరవానితిప్ప ప్రాజెక్టులో మత్స్యఅభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణను ఎంపీఆర్ డ్యాంకు బదిలీ చేశారు. జిల్లా మత్స్యశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసులును అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య జిల్లా మత్స్యశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు నాగరాజును అనంతపురం జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు.

**ముఖ్య ప్రణాళికశాఖ ఏఎస్‌వోల వివరాలు..**

గార్లదిన్నె రాజ్యలక్ష్మి రాప్తాడుకు, డి.హీరేహాళ్ నరసింహులు విడపనకల్లుకు, అనంతపురం చంద్రప్రసాద్ విజయవాడకు, శింగనమల శ్రీనాగలక్ష్మీ బుక్కరాయ సముద్రానికి యల్లనూరు నుంచి కల్పన తాడిపత్రికి, పుట్లూరు విజయకుమార్ గార్లదిన్నెకు, విడపనకల్లు పర్వతప్ప వజ్రకరూరుకు, కంబదూరు స్వప్న శెట్టూరుకు, గుత్తి శ్రీనివాసనాయక్ యాడికి, గుంతకల్లు సుభాషిణి శింగనమలకు, చిలమత్తూరు భార్గవి లేపాక్షికి, ముదిగుబ్బ చంద్రశేఖర్ నల్లచెరువుకు, రొద్దం వెంకటరమణ నంద్యాలకు, లేపాక్షి వలినాథ్‌రావు హిందూపురానికి బదిలీ చేశారు.**వ్యవసాయ శాఖలో**అనంతపురం ఆత్మా పీడీ మద్దిలేటిని నంద్యాల డీఆర్‌సీకి, అనంతపురం డీడీ(ఎస్సీ) శివప్రసాద్‌ను ఒంగోలు(ఎస్సీ) బదిలీ చేశారు. డివిజనల్ ఏడీఏలు వివరాలు.. హిందూపురం అల్తాఫ్ అలీఖాన్‌ను అనంతపురానికి, పుట్టపర్తి డీఆర్‌సీ సనావుల్లాను కదిరికి, రాయదుర్గం లక్ష్మానాయక్‌ను ధర్మవరానికి, ఉరవకొండ పద్మజను రాయదుర్గానికి, అనంతపురం రవిని తాడిపత్రికి, ధర్మవరం కృష్ణయ్యను హిందూపురానికి బదిలీ చేశారు.

# 'నాడు' విస్మరణ.. 'నేడు' అభివృద్ధి

బైరెడ్డిపల్లె : గ్రామీణ రోడ్ల అభివృద్ధిని నాటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పల్లె ప్రజలు ఐదేళ్లు కంకర రోడ్లపై నరక ప్రయాణం సాగించారు. కంకర దారుల్లో ప్రయాణం చేయలేకపోతున్నామని పాలకులు.. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. నిధులున్నా రోడ్లను అభివృద్ధి చేయలేక వదిలేయడంతో గ్రామీణ ప్రజల ప్రయాణ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మండల పరిధిలో 12 గ్రామాలకు వెళ్లే రోడ్లకు తారు నిర్మాణం చేపట్టాలని గత తెదేపా ప్రభుత్వం కంకర పరచి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల వైకాపా పాలనలో రోడ్లను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఏడాదిలోపు అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గత 15 రోజులుగా కంకర రోడ్లపై తారు నిర్మాణ




పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఐదు గ్రామాల ప్రజలకు సౌకర్యం.. ఏటిగడ్డిండ్లు నుంచి గాజీపేట మీదుగా పెద్దచెల్లారగుంట క్రాస్ వరకూ తారు రోడ్డు నిర్మాణానికి 2018లో ప్రభుత్వం రూ.3.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. తారు నిర్మాణానికి కంకర పనులు చేపట్టారు. వైకాపా పాలనలో విస్మరించింది. ఏటిగడ్డిండ్లు, తావడకుప్పం, మురారిపల్లె, గాజీపేట, పెద్దచెల్లారగుంట గ్రామాల ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం పది రోజులుగా తారు పనులు పూర్తి చేయడంతో ప్రజల కష్టాలు తీరాయి.

**కూటమి పాలనలో తారు నిర్మాణం..** లక్కనపల్లె క్రాస్ నుంచి బురిశెట్టిపల్లె క్రాస్ వరకూ తారు రోడ్డు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వం రూ. 3.09 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా కంకర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎన్నికలయ్యాక వైకాపా ప్రభుత్వం గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోగా రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఐదేళ్లు కంకర మార్గంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తారు నిర్మాణ పనులు చేపట్టింది.

# లక్ష్య సాధనకు పరుగులు

పుంగనూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో సామూహిక గృహ ప్రవేశాలు రెండు సార్లు వాయిదా పడ్డాయి. ఈసారి వాయిదాల పర్వం కాకుండా ప్రతిష్ఠాత్మకంగా గృహ నిర్మాణ శాఖ సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని ఈ నెల 12న ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 10 నాటికే 3 లక్షల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆ శాఖ కృత నిశ్చయంతో ఉంది. ఈ లక్ష్య సాధనకు అధికారులు నియోజకవర్గ, డివిజన్, మండలస్థాయిలో సమీక్షలు నిర్వహించడం, లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడం, అదనపు సాయం వివరించడం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా పుంగనూరు, చిత్తూరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 77,366 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 51,360 ఇళు



పూర్తి చేశారు. 7,699 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. 18,307 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. గడువు సమయం ముంచుకొస్తుండటంతో లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో అధికారులు ప్రయత్నిస్తున్నారు. వారి కష్టానికి ఫలితం ఎలా ఉంటుందో వేచి చూద్దాం.

**లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం** జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నాం, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న అదనపు సాయం వివరిస్తున్నాం. శాఖాపరమైన సహకారం అందిస్తూ నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం.గోపాల్ నాయక్, జిల్లా గృహనిర్మాణశాఖ, అధికారి, చిత్తూరు

# భవితకు నవోదయం !

పెదవేగి : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం.. పిల్లలకు విలువలు నేర్పడం.. వారిలో దాగున్న నైపుణ్యాలు పెంపొందించడం.. వీటన్నింటికీ నిలయం జవహర్ నవోదయ విద్యాలయం. ఇక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా బోధన సాగుతోంది. పెదవేగి నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 1న ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి గడువు జులై 29. ఈ ఏడాది డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

**అర్హులు వీరే...**విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 మధ్య అయిదో తరగతి చదివి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల కోటాలో చేరాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతుల్లో ఆయా ప్రాంతాల్లోనే విద్యాభ్యాసం చేసుండాలి. మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.


**వంద మార్కుల పరీక్ష..**

నవోదయలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు ప్రశ్నలుంటాయి. మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలకు 50 మార్కులు, అర్థమెటిక్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులు, లాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి.

**సౌకర్యాలు మెండు**కేంద్ర ప్రభుత్వం 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించి.. పెదవేగిలో నెలకొల్పింది. ఇక్కడ ప్రవేశం లభిస్తే విద్యార్థి భవిష్యత్తు మెరుగ్గా ఉంటుంది. 6 నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్యనందిస్తారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి సదుపాయం కల్పిస్తారు. విద్యా బోధనతోపాటు వసతి, ఆహారం, పుస్తకాలు, ఏకరూప దుస్తులు, పాదరక్షలు తదితరాలన్నీ ఉచితమే. కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం తదితర సౌకర్యాలన్నీ ఉన్నాయి.**ప్రతిభ ఆధారంగా..**సుధీర్‌కుమార్, ఇన్‌ఛార్జి ప్రధానాచార్యుడు, జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా సమయం సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ప్రశ్నాపత్రం తయారీ నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. ఎంపిక పారదర్శకంగా ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలుంటాయి.

# నల్ల చీర కట్టిన తెల్ల పిల్ల

చైల్డ్ ఆర్టిస్ట్‌గా బాలీవుడ్‌లో 1997లోనే ఎంట్రీ ఇచ్చిన ఫాతిమా సనా షేక్ 'దంగల్'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకుంది. ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలలో దంగల్‌లో కనిపించిన ఫాతిమా సనా షేక్ నటనతో మెప్పించింది. గీతా ఫోగట్ పాత్రకు ఫాతిమా సనా షేక్ చేసినట్లుగా మరే నటి న్యాయం చేసి ఉండక పోవచ్చు అనేది చాలా మంది అభిప్రాయం. దంగల్ సినిమాలో ఆమీర్ ఖాన్ కూతురు పాత్రలో నటించిన ఫాతిమా ఆ వెంటనే ఆయనకు జోడీగా హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఫాతిమా సనా షేక్ సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మాత్రమే కాకుండా, బోల్డ్ పాత్రల్లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుంది. రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. నెట్టింట ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఫాతిమా సనా షేక్ తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి బ్లాక్ చీర కట్టిన ఫాతిమా చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని ఇప్పటికే పలు సార్లు నిరూపితం అయ్యింది. ఎప్పుడూ మోడ్రన్ డ్రెస్‌లో ఆకట్టుకునే ఫాతిమా ఈసారి అంతకు మించి అన్నట్లుగా చీర కట్టులో కనిపిస్తుంది. ఫాతిమా సనా షేక్ నెట్టింట షేర్ చేసిన ఈ నల్ల చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లో ఫాతిమా సనా షేక్ ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. కొందరు హీరోయిన్స్ ఫోటో షూట్స్ చాలా హంగామాగా ఉంటాయి. కానీ ఫాతిమా సనా షేక్ ఫోటో షూట్స్ చాలా సింపుల్‌గా ఉంటాయి. అయినా కూడా వైరల్ కావడానికి ఆమె అందం కారణం. ఎలాంటి ఔట్ ఫిట్‌లో అయినా భలే అందంగా ఉందే అనిపించుకునే తరహా ఫిజిక్ ఫాతిమా సనా షేక్ ది అంటూ ఆమె అభిమానులు అంటూ ఉంటారు. ఈ మధ్య కాలంలో సినిమాల కంటే వివాదాలతో ఎక్కువగా వార్తల్లో ఉంటున్న ఫాతిమా సనా షేక్ ఇలా అప్పుడప్పుడు అందాల ఫోటోలతోనూ వైరల్ అవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 1992లో ముంబైలో జన్మించిన ఫాతిమా ఫోటోగ్రఫీలో ప్రావీణ్యం సొంతం చేసుకుంది. న్యూరోలాజికల్ పరిస్థితులపై అవగాహన పెంచడం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. తాను ఎదుర్కొన్న మూర్ఛ జబ్బు గురించి అవగాహన పెంచడం లో ఫాతిమా సనా షేక్ కీలక పాత్ర పోషించింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఫాతిమా సనా షేక్ మాట్లాడుతూ తాను విమాన ప్రయాణ సమయంలో పలు సార్లు మూర్ఛ జబ్బుతో బాధ పడినట్లు చెప్పుకొచ్చింది. ఆ సమయంలో తనకు సిబ్బంది తో పాటు పలువురు సాయంగా నిలిచారు. కొందరికి అలాంటి సహాయం అందక పోవడంతో మృతి చెందుతున్నారని, వారందరి కోసం తాను అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫాతిమా పేర్కొంది.

## మీకు థ్యాంక్స్ చెప్పడానికి 15 ఏళ్లు పట్టింది

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత మయోసైటిస్ కారణంగా సినిమాల నుంచి బ్రేక్ తీసుకుని, మెల్లిగా కోలుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత సమంత మళ్లీ ఇప్పుడే యాక్టివ్ అవుతున్నారు. రీసెంట్ గా నిర్మాతగా మారి శుభం సినిమాతో మంచి హిట్ ను అందుకున్న సమంత తాజాగా జరిగిన 24వ తానా మహాసభలకు హాజరై తెలుగు ఆడియన్స్ గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తాను ఏ పని చేసినా ముందుగా ఆలోచించేది తెలుగు ప్రేక్షకుల గురించేనని, ఈ వేదికపై నిలబడే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు సమంత. తాను ప్రతీ ఏడాదీ తానా గురించి వింటూనే ఉన్నానని, ఏ మాయ చేశావే సినిమా నుంచే తమలో ఒకరిగా చూసిన తెలుగు వారికి సమంత ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్తూ తెలుగు వారు తన జీవితంలో ఎంతో ముఖ్యమైన వారని తెలిపారు సమంత. అందులో భాగంగా తానా వేదికపై మాట్లాడుతూ సమంత ఎమోషనల్ అవగా, దానికి సంబంధించిన



వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. ఈ స్టేజ్ పై నిలబడి అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి తనకు 15 ఏళ్లు పట్టిందని, ఏ మాయ చేసావే నుంచి మీకు థ్యాంక్స్ చెప్పే అవకాశం ఎప్పుడూ రాలేదని, మొదటి సినిమా నుంచే మీరంతా నన్ను సొంతమనుకున్నారని, ఇది తన కెరీర్లో ఓ ముఖ్యమైన దశ అని, తన మొదటి ప్రొడక్షన్ శుభమ్ సినిమాను ఎక్కువగా మెచ్చుకున్న వ్యక్తులు నార్త్ అమెరికాకు చెందిన వాళ్లేనని సమంత అన్నారు. తాను ఎలాంటి డెసిషన్ తీసుకున్నా తెలుగు ప్రేక్షకుల గురించే ఆలోచిస్తానని, తెలుగు వారంతా తనకు ఓ స్పెషల్ ఐడెంటిటీని ఇచ్చారని, తెలుగు తనకు సొంతిల్లు లాంటిదని, ఓ బేబీ మిలియన్ డాలర్లు సంపాదించిన విషయం కూడా తనకు గుర్తుందని చెప్పారు సమంత. మీరెంత దూరంగా ఉన్నప్పటికీ ఎప్పుడూ నా మనసులోనే ఉంటారని సమంత ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా సమంత ప్రస్తుతం రక్త్ బ్రహ్మాండ్ తో పాటూ మా ఇంటి బంగారం అనే సినిమాను చేస్తున్న సంగతి తెలిసిందే.




# వీరమల్లు.. కింగ్డమ్ తో థియేటర్లు కళకళలాడుతాయా..?





సినిమాను థియేటర్ లో చూసే ఆడియన్స్ సంఖ్య రోజు రోజుకి తగ్గుతుంది. అందుకే సినిమాను ప్రేక్షకులకు చేరవేసేందుకు మేకర్స్ బీభత్సమైన ప్రమోషనల్ యాక్టివిటీస్ ప్లాన్ చేస్తున్నారు. ఈమధ్య వచ్చిన కుబేర తో కాస్త థియేటర్లు సందడిగా కనిపించాయి. మళ్లీ లాస్ట్ వీక్ సినిమాలేవి మెప్పించలేదు. మళ్లీ థియేటర్లు కళకళలాడాలంటే హిట్టు బొమ్మ పడాలి. ఈ నెల 24న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు వస్తుంది. పవర్ స్టార్ ఫ్యాన్స్ అంతా కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వీరమల్లు సినిమాపై ట్రైలర్ ఇంకాస్త అంచనాలు పెంచింది. క్రిష్ మొదలు పెట్టిన ఈ సినిమాను జ్యోతి కృష్ణ పూర్తి చేశాడు. సినిమా ట్రైలర్ ముందు వరకు పెద్దగా బజ్ లేదు కానీ ట్రైలర్ రిలీజ్ తర్వాత సినిమా పై క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమాతో పవర్ స్టార్ ఫ్యాన్స్ హంగామా థియేటర్ల దగ్గర ఒక రేంజ్ లో ఉండబోతుందని చెప్పొచ్చు. ఇక ఈ సినిమా తర్వాత ఈ నెల చివరి రోజున అంటే జూలై 31న విజయ్ దేవరకొండ కింగ్ డం వస్తుంది. గౌతం తిన్ననూరి డైరెక్షన్ లో తెరకెక్కిన కింగ్ డమ్ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కూడా సినిమాపై భారీ హైప్ తెచ్చింది. ఈ సినిమా తప్పకుండా విజయ్ కి హిట్ ఇచ్చేలా ఉంది. సో ఈ సినిమా కూడా థియేటర్ల దగ్గర ఆడియన్స్ సందడి కనిపించేలా ఉంది. ఈ రెండు సినిమాల మేకర్స్ మాత్రం వారి సినిమాల ఫలితాల మీద చాలా నమ్మకంగా ఉన్నారు. పవన్ వీరమల్లు మొన్నటిదాకా సైలెంట్ గా ఉండి ఫైర్ పటాకాలా ట్రైలర్ రిలీజ్ నుంచి సూపర్ బజ్ పొందింది. ఇక కింగ్ డం సినిమా మీద ముందునుంచి విజయ్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు. సో ఈ రెండు సినిమాలతో మళ్లీ తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లకు పూర్వ వైభవం రావాలని ఆశిస్తున్నారు మేకర్స్. స్టార్ సినిమాను ఫ్యాన్స్ థియేటర్లకు వెళ్లి చూస్తున్నారు తప్ప కామన్ ఆడియన్స్ రావట్లేదు. ఎలాగు నెల రోజుల్లో ఓటీటీలో వస్తుందిగా అన్న ఆలోచన ఆడియన్స్ లో బలంగా నాటుకుపోయింది. మరి రాబోతున్న వీరమల్లు, కింగ్డమ్ టాలీవుడ్ కి హిట్ జోష్ ఇస్తాయేమో చూడాలి. ఈ రెండు సినిమాల రిజల్ట్ మీద నెక్స్ట్ రాబోయే సినిమాల ఫలితాలు ఆధారపడి ఉంటాయని చెప్పొచ్చు.

# రష్మిక ది రెబల్



ప్రతిభను ఎవరూ ఆపలేరు.. ప్రతిభావంతుల ఎదుగుదలకు ఎదురేలేదు. ఈ కోవకే చెందుతుంది రష్మిక మందన్న. కన్నడ సినిమాలో చిన్నగా మొదలై టాలీవుడ్ లో అగ్ర నాయికగా ఎదిగి, ఇప్పుడు బాలీవుడ్ లో లక్కీ ఛామ్ గా ఏల్తోంది. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ సక్సెస్ ని కేరాఫ్ గా మార్చుకున్న ఈ బ్యూటీ ఏం చేసినా అది ట్రెండ్ గా మారుతోంది. ఇప్పుడు రష్మిక మందన్న కొత్త లుక్ సంథింగ్ స్పెషల్ గా వెబ్ లో దూసుకెళుతోంది. లెదర్ సోఫా.. పచ్చ-నలుపు రంగు ఫుల్ స్లీవ్స్ టీషర్ట్, దానిపై స్టైలిష్ కోట్, లేస్ ముడి వేయని వైట్ షూస్ ని ధరించి రియల్ రెబల్ ని తలపిస్తోంది. అందంలోనే కాదు ఫ్యాషన్ సెన్స్ లోను తనను కొట్టేవాళ్లే లేరని రష్మిక నిరూపిస్తోంది. బాలీవుడ్ టు టాలీవుడ్ నటవారసులు ఎందరు ఉన్నా వీళ్లెవరూ తన ముందు నిలబడలేరు! అని సవాల్ విసురుతోంది. బాలీవుడ్ లో జాన్వీకపూర్, ఖుషి కపూర్, సుహానా ఖాన్, అనన్య పాండే, సారా అలీఖాన్ .. ఇలా చాలా మంది నటవారసురాళ్లు ఉన్నారు. కానీ వీళ్లలో ఎవరికీ లేని స్టార్ డమ్ రష్మిక మందన్నకు ఉంది. అందానికి అందం, అభినయం, సక్సెస్, అదృష్టం అన్ని కోణాల్లో రష్మికకు ఎదురే లేదు. ఇప్పుడు ఫ్యాషన్ సెన్స్ లోను వీళ్లెవరూ తన ముందు దిగదుడుపేనని నిరూపించే పనిలో ఉంది. రష్మిక ఇటీవల కుబేర చిత్రంలో నటించింది. తదుపరి థామ, ది గర్ల్ ఫ్రెండ్ అనే చిత్రాల్లో నటించింది. ఇవన్నీ విడుదలకు రావాల్సి ఉంది.

# షాలిని కంబ్యాక్ ఎప్పుడు..?

అర్జున్ రెడ్డి సినిమాతో సక్సెస్ కొట్టిన విజయ్ దేవరకొండ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. ఐతే ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన షాలిని పాండే మాత్రం కెరీర్ లో సక్సెస్ అవ్వలేకపోయింది. షాలిని తెలుగులో కొన్ని సినిమాలు చేసినా ఆమెకు అంతగా క్రేజ్ రాలేదు. కాస్త బొద్దుగా మారడం సమస్య అయ్యిందని గుర్తించిన ఆమె స్లిమ్ గా మారి షాక్ ఇచ్చింది. ఐతే అలా మారినా కూడా అమ్మడికి ఛాన్స్ లు రావట్లేదు. షాలిని కంబ్యాక్ ఎప్పుడు ఇస్తుందా అని ఆమెని ఇష్టపడే ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. అటు కోలీవుడ్, బాలీవుడ్ లో అమ్మడు చేసిన ప్రయత్నాలు కూడా వర్క్ అవుట్ కాలేదు. ముఖ్యంగా బాలీవుడ్ లో ఎలాంటి సినిమా అయినా, పాత్ర అయినా చేస్తూ వస్తుంది షాలిని కానీ ఎందుకో ఆమెకు అక్కడ లక్ కలిసి రావట్లేదు. టాలీవుడ్ పై



స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తుంది షాలిని. ఇక్కడ డైరెక్టర్స్ తో రెగ్యులర్ టచ్ లో ఉంటుందని టాక్. పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు సినిమాలు చేస్తున్న హంగామా తెలిసిందే. అందుకే షాలిని ఇక్కడ మళ్లీ ఫాం లోకి రావాలని, వరుస ఆఫర్లు అందుకోవాలని ట్రై చేస్తుంది. షాలిని పాండే తిరిగి సినిమా అవకాశాలు అందుకుంటే మాత్రం ఆమె ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే. పుష్ప లో శ్రీవల్లి ఛాన్స్ కోసమే షాలిని స్లిమ్ గా మారిందన్న టాక్ సోషల్ మీడియాలో నడుస్తుంది. ఆ వార్తల్లో నిజం ఎంతో తెలియదు కానీ పుష్ప శ్రీవల్లి ఛాన్స్ షాలిని అందుకుని ఉంటే సినిమా వల్ల ఆమెకు డబుల్ క్రేజ్ ఏర్పడేది. కానీ శ్రీవల్లిగా రష్మిక కూడా అదరగొట్టేసిన విషయం తెలిసిందే.సినిమాల్లో ఛాన్స్ లు రావడం అనేది చాలా కష్టం. హిట్ ఫాం లో ఉంటే ఏమో కానీ ఫ్లాపులు పడ్డాక తిరిగి అవకాశాలు దక్కించుకోవడం కష్టమే. సినిమాలు చేస్తూ ఫోటో షూట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది షాలిని. మళ్లీ విజయ్ దేవరకొండ లాంటి హీరో సినిమాల్లో నటిస్తే కానీ షాలిని తిరిగి ఫాం లోకి వచ్చే అవకాశం ఉండదు. ఐతే విజయ్ షాలిని కాంబో సినిమా వచ్చే ఛాన్స్ ఉందా.. అర్జున్ రెడ్డి కాంబినేషన్ రిపీట్ చేస్తే ఆడియన్స్ చూస్తారా అన్నది తెలియాల్సి ఉంది. షాలిని పాండే మాత్రం ఏమాత్రం ఫోకస్ షిఫ్ట్ అవ్వకుండా టాలీవుడ్ లో ఛాన్స్ ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

## కాజల్ వల్ల సాయి పల్లవిపై మరోసారి ట్రోలింగ్!

సాయి పల్లవి టాలెంట్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సాయి పల్లవి ఏదైనా ఒక పాత్ర చేస్తున్నారంటే ఆ పాత్రకు ప్రాణం పోయడం ఖాయం. ఇంకా చెప్పాలంటే హీరోయిన్ కు అందం ముఖ్యమైనది కాదని, యాక్టింగ్ తో గ్లామర్ ను కూడా డామినేట్ చేయొచ్చని సాయి పల్లవి నిరూపించారు. ఇప్పటికే సాయి పల్లవి ఎన్నో సినిమాల్లో గుర్తుండిపోయే పాత్రలు చేసి మెప్పించారు. ఇక అసలు విషయానికొస్తే సాయి పల్లవి ప్రస్తుతం నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న బాలీవుడ్ రామాయణలో సీత పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఎప్పుడైతే సాయి పల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేశారో అప్పట్నుంచి ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ వినిపిస్తోంది. అయితే సాయి పల్లవి సీత పాత్రను పోషించడం కొందరు స్వాగతిస్తుంటే మరికొందరు మాత్రం సాయి పల్లవి సీత పాత్ర చేయడం కన్విన్సింగ్ గా లేదని దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. వాల్మీకి రాసిన రామాయణంలో సీతను ఎంతో గొప్పగా వర్ణించారని, వాల్మీకి ప్రకారం సీత ఎంతో అందమైన ప్రతిరూపమని, సీతను ఆకాశంలో ఉండే చంద్రకాంతితో పోల్చడంతో పాటూ భూమి ంచి జన్మించిన లక్ష్మి అంటారని, అలాంటి సౌందర్యవతి సీతను అందం విషయంలో సాయి పల్లవి ఏ మాత్రం మ్యాచ్ చేయలేరని అందరూ



కామెంట్స్ చేస్తున్నారు. నితేష్ తివారీ క్యాస్టింగ్ విషయంలో చాలా బ్లండర్ చేశారని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్ ను తీసుకోవడం నెటిజన్ల డిస్కషన్స్ కు మరింత ఆజ్యం పోస్తుంది. రావణాసురుడిగా నటించిన యష్, సీత పాత్రలో కనిపించే సాయి పల్లవి అందం కోసం, మండోదరిగా కనిపించే కాజల్ ను ఎందుకు వదులుకుంటారని ప్రశ్నిస్తూ విమర్శలు చేస్తున్నారు. అయితే కొందరు సాయి పల్లవిని విమర్శిస్తున్నప్పటికీ మరికొందరు ఆమెకు ఈ విషయంలో మద్దతిస్తున్నారు. సీత పాత్రకు సాయి పల్లవి కేవలం అందంతోనే కాకుండా ఆమె నటనతో ప్రాణం పోస్తారని, ఎమోషనల్ గా సాయి పల్లవి ఆ పాత్రను అందరికీ కనెక్ట్ అయ్యేలా చేస్తారని తమ వాదనలను వినిపిస్తున్నారు. తన స్క్రీన్ ప్రెజెన్స్, యాక్టింగ్ తో సాయి పల్లవి ఇప్పటికే నటిగా తానేంటో ప్రూవ్ చేసుకున్నారని ఇప్పుడు సీత పాత్రలో అందరినీ మెప్పించి నటిగా మరో మెట్టు ఎక్కుతారని పేర్కొంటున్నారు. ఎంతో అనుభవమున్న డైరెక్టర్ నితేష్ తివారీ ఇలాంటివేవీ ఆలోచించకుండానే సీత పాత్రకు ఆమెను సెలెక్ట్ చేయరు కదా అని సాయి పల్లవిని సపోర్ట్ చేస్తూ విమర్శకులను ప్రశిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, రావణుడిగా యష్, హనుమంతుడిగా సన్నీడియోల్ నటిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా తెరకెక్కుతుండగా, మొదటి భాగం ఈ దీపావళికి, రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ కానున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536